
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 54
మంగళవారం 16-5-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'


టైటాన్స్‌ క్వాలిఫై...
సన్‌రైజర్స్‌పై నెగ్గి ప్లే ఆఫ్‌ దశకు చేరిన గుజరాత్‌ జట్టు -12లో


ఈ పార్కులు స్త్రీలకే..
ఢిల్లీలో త్వరలో అందుబాటులోకి స్త్రీలకే ప్రవేశం కల్పించే 'పింక్‌ పార్కు'లు -11లో


ఢిల్లీలో 'పవర్‌ ప్లే'
కర్ణాటక ముఖ్యమంత్రిని తేల్చేందుకు కాంగ్రెస్‌ పార్టీ పెద్దలు హస్తినలో మల్లగుల్లాలు పడుతున్నారు.
వివరాలు 6లో ▸


హాజీ సలీం... డ్రగ్‌ లార్డ్‌
అరేబియా తీరంలో పట్టుబడ్డ రూ. 25 వేల కోట్ల విలువైన 2.5 టన్నుల డ్రగ్స్‌ మోస్ట్‌వాంటెడ్‌ స్మగ్లర్‌వేనని నిర్ధారణయ్యింది.
వివరాలు 6లో ▸


ఖర్గేకు పంజాబ్‌ కోర్టు నోటీసు
రూ. 100 కోట్ల పరువు నష్టం కేసులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంజాబ్‌ కోర్టు నోటీసులు జారీ చేసింది.
వివరాలు 6లో ▸


నేడు 71 వేల మందికి..
వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి ప్రధాని వర్చువల్‌గా నియామక పత్రాలు ఇవ్వనున్నారు.
వివరాలు 6లో ▸

అసలే ధరణి తిప్పలు.. ఆపై రైతులకు అందని పాస్‌బుక్‌లు

పోస్టు బకాయిలకు పాస్‌బుక్కయ్యే!



కొన్ని నెలలుగా తపాలాశాఖకు చార్జీలు చెల్లించని రెవెన్యూ శాఖ

- పుస్తకాల ముద్రణ, బట్వాడా ఖర్చు కింద రైతుల నుంచి రూ.300 వసూలు
- దాదాపు రూ.3 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు..
- ఆడిట్‌ అభ్యంతరాలతో ఏప్రిల్‌ నుంచి బట్వాడా నిలిపేసిన తపాలాశాఖ
- పాస్‌బుక్‌ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

రాష్ట్రంలో భూముల లావాదేవీలు జరిగి నెలలు గడుస్తున్నా రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందడం లేదు. ఇదేమిటని రెవెన్యూ కార్యాలయాలకు వెళితే తపాలా శాఖ అంటోంది.. అక్కడికి వెళితే రెవెన్యూశాఖ నుంచి తమకు రాలేదని చెప్తుండటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అసలు వాస్తవం ఏమిటంటే.. లక్షల కొద్దీ పాస్‌బుక్కులు రెవెన్యూ కార్యాలయాల్లోనే గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని తపాలాశాఖ ద్వారా రైతులకు బట్వాడా చేసేందుకు సంబంధించిన చార్జీలను రెవెన్యూ శాఖ చెల్లించకపోవడమే దీనికి కారణం. పాస్‌బుక్‌ల ముద్రణ, బట్వాడా కోసం రైతుల నుంచే రూ.300 వసూలు చేస్తున్న రెవెన్యూ శాఖ.. తపాలా శాఖకు చార్జీలు చెల్లించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్‌

భూముల రిజిస్ట్రేషన్‌ అయ్యాయి.. పాస్‌బుక్‌ ముద్రణ, తపాలా ద్వారా ఇంటికి చేర్చేందుకు బట్వాడా ఖర్చును రైతులు అప్పుడే రెవెన్యూ శాఖకు చెల్లించారు. కానీ నెలలు గడుస్తున్నా పాస్‌బుక్‌ మాత్రం చేతికి అందడం లేదు. ఒకరిద్దరు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది రైతులకు పాస్‌బుక్‌లు అందాల్సి ఉంది. ఎప్పుడో రైతు ఇళ్లకు చేరాల్సి ఉన్న ఈ పాస్‌బుక్‌లు రెవెన్యూ శాఖ కార్యాలయాల్లోని బీరువాల్లో మూలుగుతున్నాయి. ఏప్రిల్‌ నుంచి ఇదే పరిస్థితి. ఇప్పటికే ధరణి సమస్యలు గందరగోళంతో రైతులు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పాస్‌బుక్‌లు రాకపోతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

చెల్లింపులు లేక బకాయిలు..

వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రైతుల నుంచి రిజిస్ట్రేషన్‌ సమయంలోనే రూ.300 చొప్పున రెవెన్యూ శాఖ వసూలు చేస్తోంది. ఆ మొత్తంతో పాస్‌బుక్‌ను ముద్రించి, తపాలా శాఖ ద్వారా రైతుల ఇళ్లకు పంపాల్సి ఉంటుంది. ఇందుకోసం రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ములో ఒక్కో పాస్‌బుక్‌కు రూ.40 చొప్పున తపాలాశాఖకు చార్జీగా చెల్లించాలి. కానీ ఏడాది నుంచి ఈ చెల్లింపుల్లో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం చూపుతోంది. తపాలా శాఖ పాస్‌బుక్‌లను బట్వాడా చేస్తున్నా.. అందుకు సంబంధించిన చార్జీలను ఎప్పటికప్పుడు చెల్లించడం లేదు. అప్పుడు ఎంతో కొంత మొత్తం ఇస్తూ వస్తోంది. దీనితో బకాయిలు రూ.3 కోట్ల వరకు చేరుకున్నాయి. చార్జీల సొమ్ము చెల్లించాలని తపాలా శాఖ ఎన్నిసార్లు కోరినా రెవెన్యూ శాఖ నుంచి స్పందన లేదు. అయినా ఇప్పుడు కాకున్నా తర్వాత అయినా
మిగతా 3వ పేజీలో ▶



కర్ణాటక ఎఫెక్ట్‌..

కాంగ్రెస్‌తోనే ఫైట్‌!

- కర్ణాటక ఫలితాల నేపథ్యంలో మారిన బీఆర్‌ఎస్‌ ఫోకస్‌
- రేపు బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ అధ్యక్షతన పార్టీ కీలక భేటీ
- అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా మార్గనిర్దేశనం
- వివిధ వర్గాలతో మమేకమయ్యేలా వినూత్న కార్యక్రమం రూపకల్పన

సాక్షి, హైదరాబాద్‌: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతున్నాయి. అక్కడ కాంగ్రెస్‌ పార్టీ బీజేపీని అనూహ్యంగా మట్టికరిపించడంతో ఇక్కడ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీనే ప్రధాన ప్రత్యర్థిగా బీఆర్‌ఎస్‌ భావిస్తోంది. తెలంగాణలో మతతత్వ రాజకీయాలు పనిచేయవనే నమ్మకంతో ఉంది. దీంతో కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు వ్యూహరచన సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ కీలక భేటీ నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ నిర్ణయించారు. మే 17న మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ లెజిస్లేచర్‌, పార్లమెంటరీ పార్టీ సంయుక్త భేటీ కేసీఆర్‌ అధ్యక్షతన జరగనుంది. సమావేశానికి
మిగతా 2వ పేజీలో ▶

సూరీడు 40+

- కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీల వరకు నమోదుకు అవకాశం.. హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- వడదెబ్బకు ఇద్దరి మృతి

3లో

	15-05-23	16-05-23 (అంచనా)	17-05-23 (అంచనా)
నల్లగొండ	43.5	43	43
భద్రాచలం	43.2	44	43
ఖమ్మం	43	43	43
రామగుండం	42.6	43	43
మెదక్	42.4	40	40
నిజామాబాద్	41.3	40	40
ఆదిలాబాద్	41.8	42	42
హనుమకొండ	41.0	42	42
మహబూబ్‌నగర్	39.9	40	40
హైదరాబాద్	39.8	40	39

న్యూస్‌రీల్‌

డాక్టర్లూ.. పదండి పల్లెకు పోదాం!



పల్లెల్లో ఉచిత వైద్యం అందించేందుకు ఐఎంఏ తెలంగాణ శాఖ ముందుకొచ్చింది. పల్లెలకు సామాజిక బాధ్యతగా సంపూర్ణ సహకారం అందించాలన్న లక్ష్యంతో 'ఆవో గావ్‌ చలే' పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టింది.
- వివరాలు 3లో▶

తెయూలో రిజిస్ట్రార్‌ గదికి తాళం



తెలంగాణ వర్సిటీలో రిజిస్ట్రార్‌ పదవి విషయంలో వివాదం కొనసాగుతూనే ఉంది. తాజాగా సోమవారం రిజిస్ట్రార్‌ యాదగిరి గదికి తాళం వేసి ఉంచడంతో గందరగోళం నెలకొంది.
- వివరాలు 3లో▶

హైదరాబాద్‌-విజయవాడ.. 20 నిమిషాలకో ఏసీ ఈ-బస్సు



హైదరాబాద్‌ నుంచి విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్‌ ఏసీ బస్సులను ఈ–గరుడ పేరుతో నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున ఈ బస్సులు తిరగనున్నాయి.
- వివరాలు 14లో▶

డిశ్చార్జికి.. రీచార్జికి మధ్య..




ఆస్పత్రిలో చికిత్స ముగిసినప్పటి నుంచి రోగి పూర్తిస్థాయిలో సాధారణ జీవితాన్ని మొదలుపెట్టే వరకు మధ్యలో అవసరమైన ట్రాన్సిషనల్‌ కేర్‌ సేవలు దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్నాయి. రోగుల రికవరీకి ఈ సేవలు పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు.
- వివరాలు 2లో▶

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్‌రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్‌
సీఆర్‌డీఏ అధికారులను దూషించి మరీ మార్పులు

- ఎల్లో గ్యాంగ్‌ భూములను ఆనుకుని వెళ్లేలా ప్రణాళిక
- అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనూ ముందే అదే అలైన్‌మెంట్‌
- అనంతరం కన్సల్టెన్సీ ద్వారా అదే ప్లాన్‌కు ఆమోదం
- అమాంతం పెరిగిన బాబు, లింగమనేని, నారాయణ భూముల విలువ.. ఈ పాపంలో పవన్‌కూ పిడికెడు వాటా..
- గత సర్కార్‌ పెద్దల నిర్వాకాలు సీఐడీ దర్యాప్తులో వెలుగులోకి

10లో




సోమవారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్‌ పరిశ్రమకు భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్‌, సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో జయేశ్‌ రంజన్‌, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఫాక్స్‌కాన్‌ చైర్మన్‌ యంగ్‌ లియూ తదితరులు

వంద సీట్లతో హ్యాట్రిక్‌ కొట్టాలి

'ఫాక్స్‌కాన్‌' పరిశ్రమ భూమిపూజలో కేటీఆర్‌

- సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వంతోనే పెట్టుబడులు
- రాష్ట్రం బాగుపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి
- కరెంటు ఇవ్వకుండా కన్నీళ్లు పెట్టించినోళ్లు మళ్లీ వస్తున్నారు
- అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదు
- ప్రైవేటు రంగంతో ఉపాధి అవకాశాలు పెంచడమే మార్గం
- ఆయా సంస్థల్లో స్థానికులకే ఉద్యోగాలు లభించేలా చూస్తామని వెల్లడి

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి


అన్నిటికీ తానే మార్గదర్శినని.. అలా అనీ అనీ హ్యాండలా ఫిక్సయిపోయింది సార్‌!

ఇక 'నమో' నమః

- 18 నుంచి 'నరేంద్ర మోదీ సర్కార్‌'తొమ్మిదేళ్ల పాలనపై బీజేపీ విస్తృత ప్రచార కార్యక్రమాలు
- మోదీ విజయాలతో పాటు కేసీఆర్‌ పాలనా వైఫల్యాలు ఎండగట్టేలా క్యాంపెయిన్‌ రూపకల్పన...
- కర్ణాటక ఓటమితో నిరాశకు గురైన రాష్ట్ర పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపేలా చేపట్టాలని యోచన...



సాక్షి, హైదరాబాద్‌: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ వివిధ కార్యక్రమాలను నిర్వహించనుంది. ఈ నెల 18 నుంచి నెలరోజుల పాటు 'మోదీ సర్కార్‌'సాధించిన విజయాలపై రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా
మిగతా 2వ పేజీలో ▶

కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

- ఈనెల 31న ఆలయ నిర్మాణానికి భూమిపూజ
- రూ. 20కోట్లతో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం
- అనుమతి పత్రాలు అందజేసిన టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి



కరీంనగర్‌: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కరీంనగర్‌లో కొలువుదీరనున్నారు. ఈ మేరకు ఇప్పటికే సీఎం కేసీఆర్‌ కరీంనగర్‌లో 10ఎకరాల స్థలాన్ని టీటీడీ ఆలయానికి కేటాయించారు. ఈ క్రమంలో టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కరీంనగర్‌ టీటీడీ ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌, టీటీడీ తెలంగాణ లోకల్‌
మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఢిల్లీలో ఈటల రాజేందర్

చేరికల అంశంపై బీజేపీ పెద్దలతో చర్చించే అవకాశం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో చేరికల అంశంపై చర్చించేందుకు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సోమవారం ఢిల్లీ వచ్చారు. మంగళవారం ఆయన పలువురు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా ఇతర నేతల చేరిక అంశంపై ఇప్పటికే ఒకమారు చర్చలు జరిపిన ఈటల, వారు పార్టీ ముందుంచిన డిమాండ్ల అంశాన్ని బీజేపీ పెద్దలతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన నేపథ్యంలో వారిద్దరు నేతలు మరేదైనా కీలక నిర్ణయం తీసుకునేలోపే పార్టీలో చేరేలా చర్యలు తీసుకునే అంశంపై ఈటల సమాలోచనలు నిర్వహించే అవకాశాలున్నాయని చెపుతున్నారు. దీంతో పాటే ఇతర పార్టీల నేతలు కొందరు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నా, స్థానిక రాజకీయ సమీకరణలు, జిల్లా నేతల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఏర్పడుతున్న సమస్యలపైనా ఆయన పెద్దలతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.

సిట్‌తో సైలెంట్‌గా సెట్ చేశారు

- పాత బోర్డుతోనే పరీక్షలు పెడితే లాభం ఏమిటి?
- వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్ వ్యవహారాన్ని సిట్‌తో సైలెంట్‌గా సెట్ చేశారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె ట్వీట్ చేశారు. మొత్తం మీద సిట్ దర్యాప్తు కథ కంచికి చేరినట్లేనన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడిందని మండిపడ్డారు. దొంగలకే తాళాలు ఇచ్చినట్టు, మళ్లీ పాత కమిషన్‌తోనే పరీక్షలు పెడుతున్నారన్నారు. ఫలితంగా అదే బోర్డు, అవే లీకులు, అవే కంప్యూటర్లు.. మారింది పరీక్ష తేదీలు మాత్రమేనన్నారు. కొత్త తేదీలతో పరీక్షలు పెట్టినంత మాత్రాన.. ఇంటి దొంగలు మళ్లీ పేపర్లు అమ్ముకోరని గ్యారెంటీ ఏమిటని నిలదీశారు. అపనమ్మకాన్ని మూటకట్టుకున్న టీఎస్‌పీఎస్సీ నుంచి ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకం ఏంటని ప్రశ్నించారు. లీకుల సూత్రధారులు బయట నిర్దోషులుగా తిరుగుతుంటే.. పాత్రధారులు బెయిల్‌పై బయటపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేసీఆర్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

లౌకిక రాజకీయ శక్తులకు స్ఫూర్తి కర్ణాటక

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు కొత్త బలాన్నిచ్చిందని, లౌకిక రాజకీయ శక్తులకు కర్ణాటక స్ఫూర్తిగా నిలిచిందని తెలంగాణ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ అడ్రసు గల్లంతైనట్లేనని, ఉత్తరాదిన కూడా ఎదురీత తప్పదని ఆయన అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో లౌకిక ప్రజాతంత్ర శక్తుల ప్రయాణం ఇక నుంచి అప్రతిహతంగా కొనసాగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లౌకికశక్తులు తోడ్పాటునందించాలని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో లౌకిక శక్తులన్నీ ఏక తాటిపైకి రావాలన్న విషయాన్ని కర్ణాటక ఫలితాలు గుర్తుచేస్తున్నాయని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందని కోలేటి విశ్వాసం వ్యక్తం చేశారు.

డిశ్చార్జికి.. రీచార్జికి మధ్య..

రోగులు చికిత్స అనంతరం పూర్తిగా కోలుకునేందుకు 'ట్రాన్సిషనల్ కేర్'

- వైద్యుల సూచనలను కచ్చితంగా అమలు చేసే అవకాశం
- ఇంజెక్షన్లు, ఫిజియోథెరపీ, ప్రత్యేక పరికరాలు అవసరమైన వారికి ఉపయుక్తం
- సమస్య తిరగబెట్టకుండా జాగ్రత్త పడేందుకు వీలు.. ఆస్పత్రి ఖర్చులను తగ్గించుకోవడంతో జేబుకు ఉపశమనం
- దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న సరికొత్త వైద్య సేవలు



నాగేందర్ (55) దిల్‌సుఖ్‌నగర్ నివాసి. తీవ్రమైన నరాల వ్యాధికి గురై ఖైరతాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. శస్త్రచికిత్స తర్వాత డిశ్చార్జయి ఇంటికి వెళ్లారు. కానీ నాలుగైదు రోజుల్లోనే సమస్యలు తిరగబెట్టి ఆస్పత్రి పాలయ్యారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేవల లోపం దీనికి కారణమని వైద్యులు నిర్ధారించారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే, వైద్యుల సూచనలను కచ్చితంగా అమలు చేస్తే.. ఈ పరిస్థితి వచ్చేదికాదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినప్పటి నుంచి పూర్తిస్థాయిలో కోలుకునే వరకు 'ట్రాన్సిషనల్ కేర్' అవసరమని గుర్తించారు. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఈ వ్యవస్థ మన దేశంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది.



సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్యం పాలైన కొందరు రోగులు చికిత్స పొంది, డిశ్చార్జి అయ్యాక తిరిగి ఆస్పత్రుల పాలవుతున్నారు. వైద్యుల సూచనలను సరిగా పాటించలేకనో, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనో.. అనారోగ్య సమస్యను మొదటికి తెచ్చుకుంటున్నారు. చికిత్స తర్వాత జాగ్రత్తలు లోపిస్తే అత్యంత అధునాతనమైన చికిత్స సైతం విఫలమయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ట్రాన్సిషనల్ కేర్ సేవలు పుట్టుకొచ్చాయి. ఆస్పత్రిలో చికిత్స ముగిసినప్పటి నుంచి పూర్తిస్థాయిలో సాధారణ జీవితాన్ని మొదలుపెట్టేవరకు మధ్యలో అవసరమైన సేవలే ట్రాన్సిషనల్ కేర్. కొందరికి చికిత్స తర్వాత నర్సింగ్ కేర్, ఫిజియోథెరపీ వంటివి అవసరం. వ్యాధి సమస్యల కారణంగా ఎదుర్కొనే మానసిక క్షోభను తగ్గించేందుకు మానసిక పర్యవేక్షణ కావాలి. ముఖ్యంగా ఆర్థోపెడిక్స్, న్యూరోసైన్స్, కార్డియాలజీకి సంబంధించిన సర్జరీల తర్వాత చికిత్సానంతర సమస్యలను తగ్గించడానికి, పూర్తిగా రికవరీ కావడానికి ట్రాన్సిషనల్ కేర్ మంచి పరిష్కారమని నిపుణులు చెప్తున్నారు.

ఎలాంటి వారికి? ఎప్పుడు?

ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే ప్రతి లక్ష మంది బ్రెయిన్ స్ట్రోక్ రోగుల్లో 120కిపైగా మళ్లీ స్ట్రోక్ బారిన పడే చాన్స్ ఉందని అంచనా. వారు డిశ్చార్జి తర్వాతా ఆస్పత్రులకు, ఇంటికి తిరగాల్సి ఉంటుంది. ఈ ప్రయాణ, ఆస్పత్రి ఖర్చుల్ని తగ్గించుకోవడం, జాగ్రత్తల కోసం ట్రాన్సిషనల్ కేర్ సెంటర్లు ఉపయుక్తమని నిపుణులు చెప్తున్నారు. న్యూరో సర్జరీ, వెన్నెముక గాయాలు, హిప్, మోకాలి మార్పిడి వంటివాటిల్లో చికిత్సానంతరం ఇంటికి వెళ్లేందుకు పట్టే రెండు–మూడు వారాల వ్యవధిలో ప్రత్యేక ట్రాన్సిషనల్ కేర్ అవసరమని వివరిస్తున్నారు. డిశ్చార్జ్ అనంతరం కొందరికి ఫిజియోథెరపీ, మానసిక కౌన్సెలింగ్ వంటివి సుదీర్ఘకాలం చేయాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రోగిని ఇంటికి తీసుకెళ్లడానికి బదులుగా కేర్ సెంటర్‌ను ఎంచుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు. అల్జీమర్స్ సమస్య ఉన్నవారికీ ట్రాన్సిషనల్ కేర్ అవసరమని అంటున్నారు. ఇక స్వాలో, స్పీచ్ థెరపిస్ట్, మస్క్యులోస్కెలెటల్ ఫిజియోథెరపిస్ట్ సేవలు, ఇంట్రావీనస్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి రావడం, ట్యూబుల ద్వారా ఆహారం అందించాల్సి రావడం, కదలికలకు తోడ్పడే పరికరాలు, మెషీన్లు, కొన్ని రకాల ప్రత్యేక బెడ్లు అవసరం ఉన్నప్పుడు ఈ సేవలను ఎంచుకోవడం ఉత్తమమని వివరిస్తున్నారు.

కేర్ సెంటర్లు ఏం చేస్తాయి?

ట్రాన్సిషనల్ కేర్ సెంటర్లలో వైద్యులు, నర్సులు, ఫిజియోథెరపిస్ట్‌లు, డైటీషియన్లు, సైకాలజిస్టులు, ఆక్యుపేషనల్, స్పీచ్, రెస్పిరేటరీ థెరపిస్ట్‌లు, న్యూరో, కార్డియాక్ ఫిజియో థెరపిస్టులు, సైకోథెరపిస్టులు, రోగి పూర్తిగా కోలుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన, మల్టీడిసిప్లినరీ రీహ్యాబ్ కేర్ టీమ్ రోగులను పూర్వస్థితికి తీసుకురావడానికి సాయపడుతుంది. రోగి డిశ్చార్జి సమ్మరీని పరిశీలించి, వైద్యులతో మాట్లాడి అవగాహన ఏర్పరుచుకుని, అవసరమైన సేవలను అందిస్తారు. రోగుల పొజిషన్లను మార్చే బెడ్‌సైడ్ అసిస్టెంట్లు, ఆహారాన్ని అందించే నర్సులు కేర్ సెంటర్‌లో అందుబాటులో ఉంటారు. ఇంటర్నల్ మెడిసిన్‌కు చెందిన వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటారు.

వ్యయ ప్రయాసలు తగ్గించే క్రమంలో..



దేశంలో 65ఏళ్లకు పైబడిన వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. వారికి తరచూ ఆరోగ్య సమస్యలు రావడం, ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం ఎక్కువ. కొందరి విషయంలో ఇంట్లోనే ఉంటే సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలోనే ట్రాన్సిషనల్ కేర్ సెంటర్ల అవసరం ఏర్పడింది. సర్జరీ/ ప్రధాన చికిత్స వంటివి జరిగాక.. పూర్తిగా కోలుకోవడానికి ఆస్పత్రిలోనే ఉండటం తీవ్ర వ్యయ భారంతో కూడుకున్నది. అంతేగాకుండా ఇతర రోగులకు చికిత్స అందడంలో ఇబ్బందులు రావచ్చు. అలాంటప్పుడు ఈ సపోర్టివ్ కేర్ సేవలు అందిస్తుంది.

– డాక్టర్ రామ్ పాపారావు, చైర్మన్, ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్

కర్ణాటక ఎఫెక్ట్.. కాంగ్రెస్‌తోనే ఫైట్!

▶ మొదటి పేజీ తరువాయి

హాజరు కావాల్సిందిగా బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గం, కార్పొరేషన్ చైర్మన్లకు ఆహ్వానం అందింది. ఈ ఏడాది చివరిలో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమావేశం అత్యంత ప్రాధాన్యంగా మారింది.

ఎన్నికలకు సన్నద్ధం చేసేలా..

జాతీయ, రాష్ట్ర రాజకీయాల స్థితిగతులను చర్చించడంతోపాటు అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే దిశగా ఈ సమావేశం ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొనడానికి ఎలాంటి వ్యూహాలతో ముందుకెళ్లాలన్న అంశాన్ని సీఎం ఈ భేటీలో వివరించనున్నట్లు సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీని ప్రజలు తిరస్కరించిన తీరుపైనా చర్చించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాన్నీ వెల్లడించనున్నారు. ఎన్నికల సమయానికి ప్రత్యర్థి పార్టీలను దిమ్మదిరిగేలా చేయడానికి పలు పథకాలను తమ వద్ద ఉన్నాయని సీఎం స్వయంగా ఒక సందర్భంలో ప్రకటించారు. సమావేశంలో ఎన్నికలను ఎదుర్కొనడానికి ఎలా సంసిద్ధం కావాలన్న అంశంపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టనున్నట్లు పార్టీ వర్గాల కథనం. అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడి నవంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే నాలుగు నెలలపాటు పార్టీ పరంగా క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశముంది. రాష్ట్ర రాజకీయాలపై వివిధ సర్వే సంస్థలతోపాటు ప్రభుత్వ నిఘా విభాగాల నివేదికలు కూడా అందిన నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపైనా కేసీఆర్ మార్గదర్శనం చేయనున్నారు.

వరుస కార్యక్రమాలతో బిజీబిజీ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీకి చెందిన అన్ని స్థాయిలకు చెందిన నేతలు చురుగ్గా పనిచేసేలా కేసీఆర్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి. ఇప్పటికే రెండు నెలలుగా నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలు ఈ నెలాఖరులోగా మిగతా సమ్మేళనాలను కూడా పూర్తి చేయాలని ఇదివరకే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. జూన్ 1న అమరుల స్మారకం ఆవిష్కరణ, జూన్ 2 నుంచి 21రోజుల పాటు 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు' వైభవంగా నిర్వహించేలా ఇప్పటికే కేసీఆర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. దశాబ్ది ఉత్సవాలు పూర్తయిన తర్వాత ఆత్మీయ సమ్మేళనాల తరహాలో నియోజకవర్గ స్థాయిలో యువజన, విద్యార్థి సమ్మేళనాలు నిర్వహించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. బుధవారం జరిగే భేటీలో యువజన, విద్యార్థి సమ్మేళనాల నిర్వహణకు సంబంధించి కేసీఆర్ పలు సూచనలు చేసే అవకాశముంది. అక్టోబర్ వరకు ఈ కార్యక్రమం కొనసాగి, అక్టోబర్ 10న వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభ ద్వారా ఎన్నికల సమర శంఖారావం పూరించేలా కార్యాచరణ ప్రకటించే అవకాశముంది.

అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో మళ్లీ బిల్లులు?

ప్రభుత్వం ఆమోదించిన బిల్లుల్లో వైద్య విద్య సంచాలకులు, అదనపు సంచాలకులు, బోధనాసుపత్రుల ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్/డైరెక్టర్ బిల్లును గవర్నర్ తమిళిసై తిరస్కరించిన నేపథ్యంలో మరోమారు పంపేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, ప్రైవేట్ వర్సిటీల బిల్లులపై మరింత సమాచారం కావాలంటూ గవర్నర్ ప్రభుత్వానికి తిప్పిపంపిన సంగతి తెలిసిందే. వర్సిటీల ఉమ్మడి నియామక బోర్డు, అటవీ విశ్వవిద్యాలయం బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం పంపారు. బుధవారం జరిగే భేటీలో వీటిని కూడా కేసీఆర్ ప్రస్తావించే అవకాశముంది. గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ఉన్న ఫారూక్ హుస్సేన్, డి.రాజేశ్వర్‌రావు ఈ నెల 27న ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకోనున్నారు. వీరి స్థానంలో కొత్తగా మండలికి ఎవరిని పంపాలనే అంశంపై గతంలోనే కేబినెట్ భేటీ నిర్వహిస్తామని కేసీఆర్ ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను సిఫారసు చేసేందుకు ఈ వారాంతంలో కేబినెట్ భేటీ కూడా జరిగే అవకాశముందని పార్టీ చెప్పాయి.

వంద సీట్లతో హ్యాట్రిక్ కొట్టాలి

- సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వంతోనే పెట్టుబడులు
- 'ఫాక్స్‌కాన్' పరిశ్రమ భూమి పూజలో మంత్రి కేటీఆర్



కొంగరకలాన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ''మనకు పచ్చని పంటల తెలంగాణ కావాలి. కొలువులున్న తెలంగాణ కావాలి. మతం మంటలతో మండిపోయే తెలంగాణ వద్దు. మన అభివృద్ధే మన మతం. మన సంక్షేమమే మన కులం. జనహితమే మన అభిమతం. ఆ దిశగా అంతా కలిసికట్టుగా కదం తొక్కుదాం''అని పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పరిశ్రమకు భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

''వచ్చే ఎన్నికల్లో గెలుపు మాత్రమే ముఖ్యం కాదు. వంద సీట్లు దాటాలి. హ్యాట్రిక్ కొట్టాలి. ఇందుకోసం ప్రతి కార్యకర్త కసిగా పనిచేయాలి. ఓ పార్టీ మత పిచ్చివాళ్లది. సందు దొరికితే హిందూ ముస్లింల మధ్య పంచాయతీ పెట్టేందుకు ప్రయత్నిస్తుంది. ఎంతసేపూ ఇది కూలకొడదాం. అది కూలగొడదామని ప్రజలను రెచ్చగొడుతుంది. మరో పార్టీ దశాబ్దాలుగా చేసిందేమీ లేదు. దశాబ్దాలుగా కరెంట్, తాగునీరు, సాగునీరు ఇవ్వక కన్నీళ్లు పెట్టించిన వాళ్లు మళ్లీ వస్తున్నారు.

ఓర్వలేక లీకేజీలకు పాల్పడుతున్నారు

ప్రధాని మోదీ చెప్పినట్టు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉంటే ఇప్పటికే 18 కోట్ల మందికి ఉద్యోగాలు దక్కేవి. తెలంగాణలో ఇప్పటికే 1.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 82 వేలు భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ఆ ఉద్యోగాలను కూడా నింపితే కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందని భావించి ఓర్వలేక కొందరు పేపర్ లీకేజీకి పాల్పడుతున్నారు. టీఎస్‌పీఎస్సీలోకి చొరబడేది వాళ్లే.. పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్ చేసేది వాళ్లే.. మళ్లీ బయటికొచ్చి గబ్బుగబ్బు చేసేది వాళ్లే. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

ప్రైవేటులోనే ఉపాధి అవకాశాలు

ప్రపంచంలో ఎక్కడైనా జనాభా మొత్తానికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదు. మన దేశ జనాభా 142 కోట్లు ఉంటే.. 60 లక్షల మందికి మాత్రమే ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. రాష్ట్రంలో నాలుగు కోట్ల జనాభా ఉంటే.. ప్రభుత్వ సంస్థల్లో 6.50 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఉన్నాయి. అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు కల్పించే అవకాశం లేదు. అందువల్ల ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పనకు కృషి చేయడమే మార్గం. ఆ దిశగా మా ప్రభుత్వం కృషి చేస్తోంది. కొత్తగా ఏర్పాటవుతున్న ఫాక్స్‌కాన్ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా 40 వేల మందికి ఉద్యోగాలు లభిస్తే.. పరోక్షంగా మరో మూడంతల మందికి ఉపాధి దొరుకుతుంది. ఫాక్స్‌కాన్ రాకతో ఐదేళ్ల తర్వాత కొంగర గుర్తుపట్టలేనంతగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే హైదరాబాద్ అభివృద్ధి చెందింది. ప్రముఖ సినీ హీరో రజనీకాంత్ ఇటీవల హైదరాబాద్ వచ్చారు. న్యూయార్క్‌లో ఉన్నానా? హైదరాబాద్‌లో ఉన్నానా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా..

మేం పెట్టుబడులు తీసుకొస్తుంటే ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారు. అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారు. వచ్చిన పరిశ్రమలను కడుపులో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. తొమ్మిది మాసాల్లో ఫాక్స్‌కాన్ ఏర్పాటు పూర్తవుతుంది. ఇక్కడి ప్రైవేటు సంస్థల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తాం. ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ పూర్తి చేసిన నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించేందుకు ఇక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేస్తాం. నిర్మాణ పనులతో పాటు నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం..''అని మంత్రి కేటీఆర్ తెలిపారు.

మా ప్రభుత్వం రాగానే ధరణిని రద్దు చేస్తాం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

వికారాబాద్ జిల్లా పరిగికి చేరుకున్న పీపుల్స్‌మార్చ్ యాత్ర



పరిగి మండలం తొండుపల్లిలో రైతు పడేసిన టమాటాలను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

పరిగి: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌లో చూపించిన లక్ష కోట్ల రూపాయలు ఏమయ్యాయని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గుడిలో లింగాన్ని మింగినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ రూ.లక్ష కోట్లు మింగారని ఆరోపించారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర సోమవారం వికారాబాద్ జిల్లా పరిగికి చేరుకుంది. ఈ సందర్భంగా తొండుపల్లి వద్ద ధర లేక రోడ్డుపై పడేసిన టమాటాను ఆయన పరిశీలించారు. రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవినీతిమయమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకే తాను పాదయాత్ర చేపట్టానని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దించారని దుయ్యబట్టారు. నిధులు, నీళ్లు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాట తప్పిన కేసీఆర్‌కు పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలకు లక్షల ఎకరాల భూ పంపిణీ చేశామని, కానీ ధరణి పేరిట వాటిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు, రెండు పడకల ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు, రూ.2లక్షల వరకు రుణ మాఫీ, రైతుకు అన్ని రకాల సబ్సిడీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. భూమి లేని ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంట్లో ఇద్దరికి పింఛన్, నిరుద్యోగులకు నాలుగు వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీలు ఇచ్చారు.

అమరుల ఉసురు తగులుతుంది: గద్దర్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ అమరవీరుల ఉసురు తగులుతుందని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. 25 లక్షల ఎకరాల భూమిని లాక్కొని పేద ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

బీఆర్ఎస్‌ను మట్టికరిపించండి

- కర్ణాటకలో బీజేపీకి పట్టిన గతే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు పట్టాలి
- బీసీబంధు పేరుతో కేసీఆర్ కొత్త డ్రామా... బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



కుటుకనూరలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్/అయిజ: కర్ణాటక రాష్ట్రంలో పోలీసు నియామక కుంభకోణానికి పాల్పడిన బీజేపీ ప్రభుత్వానికి అక్కడి ప్రజలు బుద్ధి చెప్పిన విధంగానే తెలంగాణ ప్రజలు కూడా బీఆర్ఎస్‌ను మట్టి కరిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణలో దాదాపు 16 ప్రశ్న పేపర్లు లీక్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి బీజేపీకి పట్టిన గతే పడుతుందని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. జూన్ 11న యథావిధిగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ నిర్వహిస్తామని కమీషన్ పేర్కొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 2022లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఒక పరీక్ష పేపర్ లీకైతే అక్కడి పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ రాజీనామా చేశారని, తెలంగాణలో 16 పేపర్లు లీకైతే మాత్రం ఇక్కడి చైర్మన్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌లు కమిషన్ చైర్మన్‌ను కాపాడుతున్నారని ఆరోపించారు. బీసీ సమాజాన్ని తొమ్మిదేళ్లుగా మోసం చేసి, వారికి రావలసిన లక్షల కోట్లను దోచుకొని, కొత్తగా బీసీబంధు పేరుతో డ్రామాలు ఆడాలని చూస్తున్నారని, ముఖ్యమంత్రి పన్నాగాలను నమ్మి మోసపోయేందుకు బీసీలు సిద్ధంగా లేరని అన్నారు. ఆధిపత్య వర్గాల ఆత్మగౌరవ భవనాలకు హైటెక్ సిటీ, మాదాపూర్‌లో 10 ఎకరాల భూమి దొరికినప్పుడు, బీసీల ఆత్మగౌరవ భవనాలకు ఎందుకు దొరకదని ప్రశ్నించారు. మూసీ నది ఒడ్డున, డంపింగ్ యార్డు పక్కన ఆత్మగౌరవ భవనాలు కట్టినపుడే సీఎం బీసీల బంధువు కాదని తేలిపోయిందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల తరహాలో ఇక్కడ బీసీల రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు.

పేదల బతుకులు మారాలంటే బీఎస్పీ రావాలి

పేదల బతుకులు మారాలంటే రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడు, గూడు కోసం పేదలు నిరంతరం పోరాడాల్సి వస్తోందని విమర్శించారు.

..'నమో' నమః

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిల వరకు వివిధ రూపాల్లో నిర్వహిస్తారు. తెలంగాణలోనూ సీఎం కేసీఆర్ అధికార పగ్గాలను చేపట్టి 9 ఏళ్లు పూర్తవుతున్నందున, మోదీ సర్కార్ విజయాలతో పాటు కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని రాష్ట్ర బీజేపీ నిశ్చయించింది. తాజాగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిన దరిమిలా ఒకింత నిరాశ, నిస్పృహలో ఉన్న రాష్ట్ర పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేలా వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు.

సన్నాహక సమావేశాల నిర్వహణ

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి పూర్తి స్థాయి ఫలితాలు రాకున్నా.. ఆ వెంటనే 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మొత్తం 28 సీట్లకుగానూ 24 స్థానాలను గెలుచుకున్న తీరును ప్రజలకు, కార్యకర్తలకు వివరించాలని భావిస్తున్నారు. ఇక 2014లో తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు, వాగ్దానాలు.. వాటిని ఏ మేరకు అమలు చేశారన్న దానిపై ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ప్రధాన సమస్యలు, 9 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, అమలు కాని హామీలు, తదితరాలపై దృష్టి పెట్టనున్నారు. మొత్తంగా నెల రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రస్తుతం సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమాల ప్రారంభం మొదలు హైదరాబాద్, జిల్లాస్థాయిల్లో చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పార్టీ జాతీయ నేతలు, కేంద్రమంత్రులు రానున్నట్టు సమాచారం.

22న బీజేపీ కార్యవర్గ భేటీ

- 'పొరుగు'ఫలితాలతో కుంగవద్దు
- కేసీఆర్‌పై ప్రజావ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తే చాలు
- జాతీయ నేతల సలహాలు

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాల నేపథ్యంలో రాష్ట్రంలో తదుపరి చేపట్టాల్సిన ఎన్నికల కార్యాచరణపై చర్చించేందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం కానుంది. ఈ నెల 22న నగర శివార్లలో జరగనున్న ఈ సమావేశానికి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్ (రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జీలు) రానున్నారు. మరో నాలుగైదు నెలల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కర్ణాటకలో పార్టీకి ఎదురైన ఓటమి ప్రభావం ఎలాంటి పరిస్థితుల్లోనూ తెలంగాణపై రాజకీయంగా పడదనే భరోసాను రాష్ట్ర పార్టీకి జాతీయ నేతలు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రంలో వెలువడిన ఫలితాలతో కుంగిపోకుండా, రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌పై ఉన్న వ్యతిరేకతను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రధానంగా నాయకత్వం దృష్టి సారించనున్నట్టు తెలిసింది.

ఢిల్లీకి పార్టీ నేతలు: ఎంపీ డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నేతలు జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వేర్వేరుగా ఎవరికి వారుగా సోమవారం ఢిల్లీకి చేరారు. చేరికలు, తదితర అంశాలపై చర్చకు ఈటలను జాతీయనాయకత్వం పిలిపించినట్టుగా ప్రచారం జరుగుతోంది.

కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

▶ మొదటి పేజీ తరువాయి



శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి లేఖను గంగుల, వినోద్‌లకు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జి.భాస్కర్‌రావులకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఏపీ సీఎం జగన్ ఆదేశాలతో కరీంనగర్ పట్టణంలో రూ.20 కోట్ల వ్యయంతో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

అదే రోజు శ్రీవేంకటేశ్వరుని కళ్యాణోత్సవం

ఈనెల 31న ఉదయం 7.26 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం వేదమంత్రోచ్చారణలతో నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం అదే ప్రాంగణంలో సాయంత్రం నుంచి ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు అందించేలా శ్రీవేంకటేశ్వరుని కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, త్వరలోనే వినోద్‌రావు, భాస్కర్‌రావుతో కలిసి తిరుమలకు వెళ్తామని, ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్ పద్మనగర్‌లో నిర్మించే శ్రీవేంకటేశ్వరసామి ఆలయం అంతరాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతో పాటు మూల విరాట్, పోటు, ప్రసాద వితరణ కేంద్రం తదితర అంశాలను పరిశీలిస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

థాయ్ కెసినోకి ఎవరు తీసుకెళ్లారు?

చీకోటిని ఏడు గంటలపాటు ప్రశ్నించిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: థాయ్‌లాండ్ కెసినో కేసులో అక్కడి పోలీసులకు పట్టుబడిన చీకోటి ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. థాయిలాండ్‌లో క్యాసినో ఆడుతుండగా దాడిచేసిన థాయ్ పోలీసులు పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నగదు లావాదేవీలు, డబ్బు తరలింపు తదితర విషయాలపై ఈడీ అధికారులు సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7-40 గంటల వరకు దాదాపు ఏడు గంటలకుపైగా ప్రశ్నించారు. థాయిలాండ్ వెళ్లి పట్టుబడిన వారిని ఇక్కడి నుంచి ఎవరు తీసుకెళ్లారు..? అక్కడ విలాసాలకు, కెసినో ఆడేందుకు ఒక్కొక్కరి నుంచి ఎంత వసూలు చేశారు? ఏ రూపంలో డబ్బు లావాదేవీలు చేశారు? హవాలా రూపంలో ఏవైనా లావాదేవీలు జరిగాయా..? థాయిలాండ్ పోలీసులు పట్టుకున్న నగదుకు సరైన లెక్కలు చూపారా..? ఇలా పలు అంశాలపై ప్రవీణ్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. ప్రధానంగా మనీలాండరింగ్ పైనే ఈడీ అధికారులు ఫోకస్ పెట్టారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు



సాక్షి, హైదరాబాద్/పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా మరోసారి విచారణకు హాజరుకావాలని ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసు జారీ చేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న సీబీఐ కార్యాలయంలో హాజరు కావాలని సూచించింది. అలాగే మరికొంతమందికి కూడా సీబీఐ నోటీసులు పంపించినట్లు సమాచారం.

ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదు

ఉదయ్‌కుమార్ పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ-6) గజ్జల ఉదయ్‌కుమార్‌కి ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని సీబీఐ స్పెషల్ కోర్టు అభిప్రాయపడింది. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వివేకా హత్యకేసులో గత నెల 14న ఉదయ్‌ని అరెస్టుచేసిన సీబీఐ.. అనంతరం కోర్టు అనుమతితో ఆరురోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండురోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సీబీఐ కోర్టు గత వారం తీర్పు రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించింది.

296 పరీక్ష కేంద్రాల్లో రేపు పాలిసెట్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం (మే 17) నిర్వహించే పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్-2023)కి అన్ని ఏర్పాట్లు చేసినట్టు సాంకేతిక విద్య కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందన్నారు. పాలిసెట్‌కు 1,05,656 మంది దరఖాస్తు చేసుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 296 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా విద్యార్థులు గణితం 60, భౌతికశాస్త్రం 30, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయాలని, వ్యవసాయం, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా విద్యార్థులు అదనంగా జీవశాస్త్రం 30 మార్కుల పేపర్‌కు సమాధానాలు రాయాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఓయూ, ఎంయూలలో రెండు పీజీ కోర్సులు రద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ, ఎంయూలలో 2 పీజీ కోర్సులను రద్దుచేశారు. ఓయూ నిజాం కాలేజీలో కొనసాగుతున్న ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మహాత్మాగాంధీ వర్సిటీలో ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్ కోర్సులను విద్యార్థుల ఆదరణ లేనందున రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పీజీ కోర్సులను రద్దు చేయవద్దంటూ పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ఓయూలో ధర్నాచేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల ఆదరణ ఉన్న ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సును రద్దు చేయడం దారుణమని, వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

హిందువుల మధ్య బీజేపీ చిచ్చు: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: మతాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయాలు చేస్తూ హిందువుల మధ్య చిచ్చుపెడుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆరోపించారు. బీజేపీది హిందూ ఏక్తాయాత్ర కాదని, హిందువులను విడగొట్టే యాత్ర అని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీజేపీ పుట్టకముందే హిందూ మతం ఉందని, అన్ని పార్టీల్లో హిందువులు ఉన్నారని, హిందువులను, మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తే అవి ఎప్పటికీ ఫలించవన్నారు. బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యాక మతాన్ని రెచ్చగొట్టి రాజకీయాలు నడిపిస్తున్నారని మల్లు ఆరోపించారు.

డాక్టర్లు

రాష్ట్రంలోని ప్రతి పల్లెలోనూ ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ శాఖ ముందుకు వచ్చింది. తన సామాజిక బాధ్యతగా ప్రతి మారుమూల పల్లెకూ ఆరోగ్యభద్రత విషయంలో సంపూర్ణ సహకారం అందించాలన్న లక్ష్యంతో 'ఆవో గావ్ చలే' పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు హైదరాబాద్ మినహా మిగిలిన అన్ని జిల్లాలనూ దత్తత తీసుకుంటారు. ముఖ్యంగా జిల్లా కేంద్రాలకు దూరంగా పల్లెల్లో వరుసగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తారు. తీవ్రమైన, దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా బయటపడితే.. వాటిని నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ లేదా స్తోమతను బట్టి ఇతర ఆసుపత్రులకు సిఫారసు చేయడంతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేసే వీలు కూడా ఐఎంఏ కల్పిస్తామంటోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును భరిస్తామని చెబుతోంది.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

'ఆవో గావ్ చలే' పేరిట పల్లెల దత్తతకు ఐఎంఏ శ్రీకారం

- తెలంగాణలోని ప్రతి పల్లెలో ఉచిత వైద్యసేవలు
- ఒక్కో ఊరిలో నలుగురు వైద్యులతో ప్రత్యేక బృందం
- పేద వైద్య విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్పులు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సేవాభావం

పదండి పల్లెకు పోదాం!

ఐఎంఏ ఇటీవల ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం లోని చర్లలో ఇప్పటికే వైద్య సేవలు ప్రారంభించింది. ఐఎంఏలో మొత్తం 20వేలమందికి పైగా వైద్యులు అందుబాటులో ఉన్నారని, వీరంతా ప్రతిరెండు నెలలకోసారి పల్లెల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని ఐఎం

ప్రతి ఊరికీ నలుగురు వైద్యుల బృందం

ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు వెల్లడించారు. ప్రతి పల్లెకూ నలుగురు వైద్యుల బృందం వెళ్తుంది. అందులో ఫిజీషియన్, గైనిక్, ఆర్థో, ఆప్తమాలజీ వైద్య నిపుణులు ఉంటారు. వీరు తమకు కేటాయించిన ఊరిలో సమగ్ర హెల్త్ సర్వే రూపొందిస్తారు. గ్రామస్తులకు హెల్త్ చెకప్, వైద్యపరీక్షలు, మందుల పంపిణీ నిర్వహిస్తారు. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పిస్తారు.

ఐఎంఏ లక్ష్యాలివే..

మెడికల్ షాపుల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇష్టానుసారంగా మందులు విక్రయిస్తున్నారని ఇలాంటి కౌంటర్ సేల్స్‌ను నిరోధించాలని ఐఎంఏ చాలా కాలంగా పోరాడుతోంది. దీనివల్ల ప్రజలు అనేక దీర్ఘకాలిక వ్యాధులు కొని తెచ్చుకుంటున్నారని వాపోతోంది.

సరైన వైద్య అర్హతలు లేకుండా కొందరు వైద్యం ప్రాక్టీస్ చేస్తున్నారు. అలాంటి వారి వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతోంది. ఇలాంటి అక్రమ ప్రాక్టీసులను అరికట్టాలని డిమాండ్ చేస్తోంది.

ప్రైవేటు ఆసుపత్రుల్లో దళారీ వ్యవస్థ (యాంటీ క్వాకరీ) పెరిగిపోతోంది. కొందరు దళారులు అవసరం ఉన్నా.. లేకుండా తమ కమీషన్ల కోసం పేషెంట్లను కొన్ని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తున్నారు. దీనివల్ల వారి శరీరాలపై అనేక దుష్ప్రభావాలు కలుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేస్తామంటోంది.

రాష్ట్రంలో వైద్యకాలేజీల పెంపును ఆహ్వానించిన ఐఎంఏ చాలామంది పేద వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం చేసేందుకు స్కాలర్‌షిప్పులు ప్రకటిస్తోంది ఐఎంఏకు దరఖాస్తు చేసుకున్న పేద వైద్య విద్యార్థులకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది.

పల్లెల కోసం 'ఆవో గావ్ చలే' కార్యక్రమం చేపడుతున్న మాదిరిగానే.. పట్టణాల్లోని మురికివాడల్లోనూ ఇదే విధమైన సేవలు అందించాలని నిర్ణయించింది.



జగిత్యాల జిల్లా సిరికొండలో వైద్యశిబిరం

పేదలపై భారం తప్పించేందుకే



ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యఖర్చులు పెరిగిపోతున్నాయి. ప్రైవేటు డాక్టరుకు చూపించుకునే స్తోమతలేని వేలాదిమంది పల్లె వాసులు రోగాలను మౌనంగా భరిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న అలాంటి వారికి పూర్తి ఉచితంగా వైద్య సేవలు, పరీక్షలు, శస్త్రచికిత్సలు అందించడమే మా లక్ష్యం.

– డాక్టర్ బీఎస్.రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

సూరీడు 40+

- కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీల వరకు నమోదుకు అవకాశం
- వాతావరణ కేంద్రం హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండల తీవ్రత కనిపిస్తోంది. సాయంత్రం 6 గంటలు దాటినా వేడిగాలులు వీస్తున్నాయి. ఇప్పటికే సాధారణం కంటే 2-3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా వచ్చే మూడు రోజులపాటు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని... కొన్ని జిల్లాల్లో 42ని-44 డిగ్రీల సెల్సియస్ మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అలాగే మంగళవారం నుంచి హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38-41 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. దిగువ స్థాయిలోని గాలులు వాయవ్య దిశ నుంచి రాష్ట్రం వైపు వీస్తున్నాయని వివరించింది. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. సోమ వారం నల్లగొండలో 43.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదవగా భద్రాచలంలో 43.2 డిగ్రీలు, ఖమ్మంలో 43 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వడదెబ్బకు గురై హనుమకొండ జిల్లాలో ముస్కుపెంటు(52)అనే ఉపాధి హామీ కూలీ, మంచిర్యాల జిల్లాలో సంతోష్ కుమార్ (36) అనే కానిస్టేబుల్ మృతి చెందారు. మరోవైపు రాష్ట్ర ప్రణాళికా విభాగం విడుదల చేసిన గణాంకాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్ల 45.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ 45.1 డిగ్రీలు, నల్లగొండ జిల్లా నిడమానూరులో 44.9 డిగ్రీలు, ములుగు జిల్లా తాడ్వాయి, రామగుండంలో 44.4 డిగ్రీల చొప్పున, జగిత్యాల జిల్లా జైనా, కరీంనగర్ జిల్లా వీణవంక, మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో 44.3 డిగ్రీల చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారాంపట్నంలో 44.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, ఏపీలో కూడా వడగాడ్పులు, ఎండల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.

సీఎం కేసీఆర్‌తో ముంబై మాజీ మేయర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ముంబై మహానగర మాజీ మేయర్ రమేశ్‌జాదవ్ సోమవారం తెలంగాణ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఆయనతో పాటు ముంబైకి చెందిన పలువురు దళిత నేతలు కూడా సీఎంను కలిశారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి మోడల్ మహారాష్ట్రకూ అవసరమని ఈ సందర్భంగా రమేశ్‌జాదవ్ వ్యాఖ్యానించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుతో దేశకీర్తిని ఇనుమడింపచేశారని, త్వరలో పెద్దసంఖ్యలో తమ అనుచరులతో వచ్చి బీఆర్ఎస్‌కు మద్దతును ప్రకటిస్తామని ముంబై దళిత నేతలు తెలిపారు. అలాగే, హల్దార్ జిల్లాకు చెందిన సర్పంచ్ సంఘటన్ అధ్యక్షుడు శ్యామ్‌భవర్, మహారాష్ట్రకు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ ప్రతాప్ నలవాడే కూడా కేసీఆర్‌ను కలిసి తెలంగాణ అభివృద్ధిపై చర్చించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంకా సీఎంను కలిసిన వారిలో ముంబై కార్పొరేటర్లు కళ్యాణ్ గైక్వాడ్, సందీప్‌జాదవ్, దినేశ్‌జాదవ్, మధ్యప్రదేశ్ మాజీ సీఎం బాబూలాల్ గౌర్ మేనల్లుడు సంజయ్‌యాదవ్, బుద్‌సేన్ ఉన్నారు.

10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోండి

- తొలగించిన ఆర్టిజన్ల విషయంలో కార్మిక శాఖ సూచన
- విద్యుత్ సంస్థలు, యూనియన్లతో భేటీ

సాక్షి, హైదరాబాద్: చట్టవిరుద్ధంగా సమ్మెకి దిగారన్న ఆరోపణలతో తొలగించిన 196 మంది ఆర్టిజన్లను మళ్లీ ఉద్యోగాల్లో చేర్చుకునే అంశంపై 10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ విద్యుత్ సంస్థలను కోరింది. వేతన సవరణ, విద్యుత్ బోర్డు సర్వీసు రూల్స్ వర్తింపు తదితర డిమాండ్లతో గత నెల 25న తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (హెచ్ 82), ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్లు సమ్మెబాట పట్టగా, అదేరోజు190 మంది ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. మరుసటి రోజు రెండు యూనియన్ల నాయకులు విద్యుత్‌సౌధలో ఆయనను కలసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన చేశారు. తొలగించిన ఆర్టిజన్లను 10 రోజుల్లోగా మళ్లీ ఉద్యోగాల్లో చేర్చుకుంటామని ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు హామీ ఇచ్చినట్లు యూనియన్ల నేతలు వెల్లడించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి సోమవారం విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, రెండు యూనియన్లతో ఉమ్మడిగా సమావేశం నిర్వహించారు. తొలగించిన ఆర్టిజన్లను మళ్లీ ఉద్యోగాల్లో తీసుకోవడానికి 30 రోజుల సమయం కావాలని అధికారులు కోరగా, 10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రార్ గదికి తాళం

- తెయూలో వివాదం
- ఉన్నత విద్యాశాఖ, కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన రిజిస్ట్రార్ యాదగిరి
- తాళం వేయించలేదంటున్న వీసీ..



తెలంగాణ వర్సిటీలో తాళం వేసి ఉన్న రిజిస్ట్రార్ గది

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ పదవి విషయంలో వివాదం కొనసాగుతూనే ఉంది. సోమవారం రిజిస్ట్రార్ యాదగిరి గదికి తాళం వేసి ఉంచడంతో గందరగోళం నెలకొంది. దీనిపై రిజిస్ట్రార్ యాదగిరి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ కమిషనర్ నవీన్‌మిట్టల్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వర్సిటీలో ఉదయం అన్ని విభాగాలు, చాంబర్లకు సెక్యూరిటీ సిబ్బంది తాళాలు తెరిచారు. రిజిస్ట్రార్ చాంబర్ మాత్రం తెరవద్దని వైస్ చాన్స్‌లర్ పీఏ సవిత చెప్పడంతో తెరవకుండానే ఉంచారు. అక్కడకు వచ్చిన రిజిస్ట్రార్ విషయాన్ని పాలకమండలి సభ్యులకు చెప్పడంతో వారు వీసీకి ఫోన్ చేశారు. దీంతో మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం తీయడంతో సిబ్బంది వెళ్లి కూర్చున్నారు. రిజిస్ట్రార్ మాత్రం చాంబర్‌కు రాలేదు.

ప్రభుత్వం చెబితేనే రిజిస్ట్రార్‌గా వచ్చా..

ప్రభుత్వం, పాలకమండలి చెబితేనే రిజిస్ట్రార్‌గా వచ్చానని, సమస్య పరిష్కారం చేస్తేనే బాధ్యతలు స్వీకరిస్తానని యాదగిరి 'సాక్షి'కి తెలిపారు. తనను లొంగదీసుకునే ఉద్దేశంతోనే వీసీ ఇలా చేశారని ఆరోపించారు. కాగా తాళం వేసిన విషయమై వీసీ రవీందర్‌గుప్తాను 'సాక్షి'ప్రశ్నించగా, తాను తాళం వేయించలేదని, అలా చేస్తే తాళానికి సీల్ వేసి, లెటర్ విడుదల చేసేవాడినన్నారు. వీసీ గా ఉన్న తన అనుమతి లేకుండానే ఈసీ సభ్యులు యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించడం చెల్లదన్నారు. తాను రిజిస్ట్రార్‌గా పెట్టిన విద్యావర్ధినిని బయటకు పంపి యాదగిరిని ఎలా నియమిస్తారన్నారు. తెయూలోనూ ఇతర ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ తనకు నచ్చని యాదగిరిని నియమించారని, తాను ఆర్డర్ ఇవ్వకుండా యాదగిరి ఎలా బాధ్యతలు తీసుకుంటారని వీసీ అన్నారు.

తెయూ వీసీని సస్పెండ్ చేయాలని గవర్నర్‌కు ఫిర్యాదు

తెయూ వీసీపై వచ్చిన ఆరోపణలపై విచారణ కమిషన్ లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ నేత దినేశ్ కులాచారితో పాటు పలువురు వర్సిటీ విద్యార్థులు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వీసీ 2021మేలో పదవి చేపట్టాక పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకి వినతిపత్రం సమర్పించారు.

'వార్ధా' అంచనాలు పెరగలేదు!

- గతంలో బ్యారేజీకి మాత్రమే రూ.750 కోట్లతో అంచనాలు
- ఇప్పుడు మొత్తం ప్రాజెక్టుకు రూ.4,550 కోట్లతో డీపీఆర్
- 'సాక్షి'కథనంపై నీటిపారుదల శాఖ వివరణ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టులో భాగంగా.. 2018లో బ్యారేజీ నిర్మాణానికి మాత్రమే రూ.750 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశామని రాష్ట్ర నీటి పారుదల శాఖ పేర్కొంది. భూసేకరణ, ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, ఫీల్డ్ చానళ్లు, కరకట్టలు, పంపుహౌజ్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, రెగ్యులేటర్లు, క్రాస్ డ్రైనేజీ స్ట్రక్చర్లు, బ్రిడ్జీలు, నిర్వాహణ ఖర్చులతోపాటు 18 శాతం జీఎస్టీ పన్నును కలిపితే మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.4,550.73 కోట్లకు చేరిందని తెలిపింది. కేవలం జీఎస్టీ పన్ను వ్యయం రూ.622.40 కోట్లు కానుందని వెల్లడించింది. 'వార్ధా ప్రాజెక్టు..భారీ బడ్జెట్'శీర్షికన సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెరగలేదని పేర్కొన్నారు.

తుమ్మిడిహెట్టితో భారం

తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా వార్ధా నదిపై బ్యారేజీని నిర్మించనుండటంతో వ్యయం గణనీయంగా తగ్గుతుందని నీటిపారుదల శాఖ పేర్కొంది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ పొడవు 6.45 కిలోమీటర్లు, గేట్ల సంఖ్య 102కాగా.. వార్ధా బ్యారేజీ పొడవు 1751 మీటర్లు, గేట్ల సంఖ్య 29కి తగ్గుతాయని వివరించింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద గరిష్ట నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీలు మాత్రమేకాగా.. వార్ధా బ్యారేజీలో 155 మీటర్ల వద్ద 2.94 టీఎంసీలను నిల్వ చేయవచ్చని తెలిపింది.

పోస్టు బకాయిలకు పాస్‌బుక్కయ్యే

▶ మొదటి పేజీ తరువాయి

డబ్బులు వస్తాయన్న ఉద్దేశంతో తపాలా అధికారులు బట్వాడాను కొనసాగిస్తూ వచ్చారు.

ఆడిట్ అభ్యంతరాలతో..

ఇంతగా బకాయిలు పేరుకుపోతున్నా.. ఇంకా సేవలు ఎలా అందిస్తున్నారంటూ తపాలా శాఖను అంతర్గత ఆడిట్ అధికారులు ఇటీవల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో తపాలా శాఖ బకాయిల వసూలుపై దృష్టిపెట్టింది. బకాయిలు చెల్లించకుంటే ఏప్రిల్ ఒకటి నుంచి బట్వాడా నిలిపేస్తామని రెవెన్యూ శాఖకు తేల్చి చెప్పింది. అయినా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించలేదు. దీంతో తపాలాశాఖ ఏప్రిల్ ఒకటి నుంచి పాస్‌బుక్‌ల బట్వాడాను నిలిపేసింది. ఇకపై పాస్‌బుక్‌లను పంపవద్దని స్పష్టం చేసింది. అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయాల్లోనే లక్షల సంఖ్యలో పాస్‌బుక్‌లు పేరుకుపోయాయి.

తప్పుడు సమాచారంతో అటూ ఇటూ..

పాస్‌బుక్కులు అందకపోవడంలో తప్పు తమది కాదని.. తపాలా శాఖనే దగ్గరపెట్టుకుని పంపటం లేదంటూ కొందరు అధికారులు తప్పుడు సమాచారం ఇస్తుండటంతో రైతులు పోస్టాఫీసులకు వెళ్తున్నారు. అసలు పాస్ పుస్తకాలు తమ వద్దకు రానేలేదని, రెవెన్యూ అధికారుల వద్దనే ఉంటాయని తపాలా సిబ్బంది స్పష్టం చేస్తుండటంతో మళ్లీ రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఇదంతా గందరగోళంగా మారిపోయింది. చార్జీల బకాయిలు, పాస్‌బుక్‌ల బట్వాడా నిలిపివేత అంశాలపై రెవెన్యూ, పోస్టల్ అధికారులను 'సాక్షి' సంప్రదించగా.. స్పందించేందుకు నిరాకరించారు.

ఇంతకు ముందు రవాణాశాఖలోనూ..

గతంలో డ్రైవింగ్ లైసెన్సుల విషయంలోనూ ఇదే తరహాలో ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ బట్వాడా కోసం వాహనదారుల నుంచి ఫీజులు వసూలు చేసిన రవాణాశాఖ.. తపాలా శాఖకు ఆ చార్జీలను చెల్లించలేదు. ఎన్నిసార్లు అడిగినా రవాణాశాఖ స్పందించకపోవటంతో.. గతేడాది తపాలా శాఖ డ్రైవింగ్ లైసెన్సుల బట్వాడాను నిలిపేసింది. అప్పట్లో ఆ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో.. రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పందించారు. ట్రాన్స్‌పోర్టు అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు బకాయిల్లోంచి దాదాపు రూ.కోటి వరకు చెల్లించేలా చర్యలు చేపట్టారు. దానితో తపాలా శాఖ బట్వాడాను పునరుద్ధరించింది. ఇప్పుడు రెవెన్యూ శాఖ వంతు వచ్చింది.

పేదల ఇళ్ల స్థలాలపై అడ్డుపడలేం!

ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

- ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను రాజధానుల వ్యాజ్యంతో జత చేసిన ధర్మాసనం
- పెండింగ్ పిటిషన్లను ప్రస్తావించిన న్యాయస్థానం
- సీజేఐ సూచనలు తీసుకోవాలని రిజిస్ట్రీకి ఆదేశం
- గురువారం రోజు విచారణకు వచ్చే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో 50 వేల మందికిపైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. సామాజిక న్యాయాన్ని పరిరక్షిస్తూ, రాజధానిలో అన్ని వర్గాల ప్రజలు నివసించేలా సీఆర్‌డీఏ పరిధిలోని 1,402.58 ఎకరాల్లో 25 లేఅవుట్లు పేదల ఇళ్ల స్థలాల కోసం శరవేగంగా సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఆర్-5 జోన్‌కి వ్యతిరేకంగా, హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఊట్ల శివయ్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం జస్టిస్ అభయ్.ఎస్.ఓకా, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం మూడు రాజధానుల పిటిషన్లతో దీన్ని జత చేస్తున్నట్లు పేర్కొంది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ ఏపీ ప్రభుత్వ నిర్ణయం సరికాదని, హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. అమరావతి భూములకు ఈడబ్ల్యూఎస్ స్కీమ్‌ను వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు కోలుకోలేని నష్టాన్ని మిగులుస్తుందన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి గట్టిగా వ్యతిరేకించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

సీజేఐ సూచనల మేరకు..

రాజధానికి సంబంధించి ఇతర వ్యాజ్యాలు మరో ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ప్రస్తావించింది. ఆయా పిటిషన్లతో వీటిని జత చేస్తామని పేర్కొంటూ శుక్రవారం లోపు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీనిపై సీజేఐ సూచనలు తీసుకుని జస్టిస్ జోసెఫ్ ధర్మాసనం ముందున్న పిటిషన్లతో కలిపి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ కేసులో కేవియట్ దాఖలు చేసిన మస్తాన్ వలీ తరఫు న్యాయవాది అభిజిత్‌సేన్ గుప్తా కోర్టుకు హాజరయ్యారు. కాగా ఈ పిటిషన్లు గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

దైవ దర్శనానికి వెళ్లివస్తూ.. అనంత లోకాలకు

- ఏడుగుర్ని బలిగొన్న ఘోర ప్రమాదం
- వైఎస్సార్ జిల్లా రైల్వే ఏటూరు సమీపంలో దుర్ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

జమ్మలమడుగు/తాడిపత్రి అర్బన్/అనంతపురం అర్బన్: వారంతా బంధువులు. వేసవి సెలవులు కావడంతో దైవదర్శనం కోసం తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరుగు పయనమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో 8 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామంలోని చిత్రావతి బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా తాడిపత్రి కృష్ణాపురం నాలుగో రోడ్డులో ఉంటున్న వెంకటలక్ష్మి (55), తన కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27), అక్కాచెల్లెళ్ల కుటుంబాలతో కలిసి తుఫాన్ వాహనంలో ఈ నెల 13న తాడిపత్రి నుంచి తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తాడిపత్రికి తిరుగు పయనమయ్యారు. చిత్రావతి నది బ్రిడ్జి వద్ద రోడ్డుకు గుంతలు తీసి మట్టిని కుప్పగా పోశారు. బళ్లారి నుంచి నెల్లూరుకు ఐరన్ ఓర్ తీసుకెళుతున్న లారీ తాడిపత్రి వైపు నుంచి వేగంగా వెళుతుండగా, ఎదురుగా వస్తున్న లారీని తప్పించేందుకు తుఫాన్ వాహన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి (31) బ్రేక్ వేశాడు. అప్పటికే ఆలస్యం కావడంతో ఎదురుగా వచ్చిన లారీ తుఫాన్ వాహనాన్ని ఢీకొట్టింది. తుఫాన్ వాహనం నుజ్జునుజ్జు అయింది. ఘటన అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు తెలుస్తోంది.

'యశోద'లో 45 రోజుల్లో 50 రోబోటిక్ సర్జరీలు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని సోమాజిగూడలో ఉన్న యశోద హాస్పిటల్స్ లో కేవలం 45 రోజుల వ్యవధిలో 50 విజయవంతమైన రోబోటిక్ సర్జరీలు పూర్తి చేసి ఘనత సాధించిందని యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్, డాక్టర్.పవన్ గోరుకంటి వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా మరింత సులభంగా ఖచ్చితత్వంతో నిర్వహించడానికి రోబోటిక్ సర్జరీ సహాయపడుతుందన్నారు. రోగులకు సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాలను, అత్యాధునిక వైద్య సాంకేతికతలను, అధునాతన చికిత్స ఎంపికలను అందించడానికి తమ ఆసుపత్రి కృషి చేస్తుందన్నారు. అనంతరం సీనియర్ ఆర్థోపెడిక్, రోబోటిక్ సర్జన్, డాక్టర్ సునీల్ దాచేపల్లిని, వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.



50 రోబోటిక్ సర్జరీలు పూర్తయిన సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

నేల నుంచి లేచిన దుమ్ము దానికే తిరిగి చేరినట్టు,
ప్రాణం ఎవరిచ్చారో అది ఆ దేవుడికే తిరిగి చేరుతుంది.
– జుడాయిజం

సాక్షి
మంగళవారం, 16 మే 2023

ఈ ఎన్నిక ఏం చెబుతోంది?

ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వెలువడ్డాయి. కర్ణాటకలో ఉత్కంఠకు మాత్రం తెరపడలేదు. బీజేపీ సర్కార్‌ను మట్టి కరిపించిన కాంగ్రెస్ విజయగాథ ఇంకా పూర్తిగా ప్రచారం కాక ముందే, విజయ సారథులైన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, శాసనసభా పక్షా నేత సిద్ధరామయ్యల మధ్య సీఎం సీటుకై సాగుతున్న పోటాపోటీ ప్రధాన వార్తై కూర్చుంది. సోమవారం కథ బెంగళూరు నుంచి ఢిల్లీకి మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం కోర్టులోకి కొత్త సీఎం ఎంపిక బంతి వచ్చి పడింది. పోటీదారులిద్దరినీ ఎలా బుజ్జగించి, ఎవరి పేరును సీఎంగా ప్రకటిస్తుందన్న సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. రాజీ ఫార్ములా ఏమైనా, వ్యవహారం అశోక్ గెహ్లోత్, సచిన్ పైలట్ల నిత్యకుంపటి రాజస్థాన్‌లా కాకూడదన్నదే ప్రస్తుతం కాంగ్రెస్ అజెండాగా కనిపిస్తోంది.

అధిక భాగం ఎమ్మెల్యేల మద్దతు తనకే ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో, సాక్షాత్తూ సిద్ధ రామయ్య సైతం అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ సోమవారం దేశరాజధానికి విమానమెక్కారు. పుట్టినరోజు వేడుకలు, పూజా కార్యక్రమాల బిజీ మధ్య డీకే ఢిల్లీ పయనం ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు ఊగిసలాడింది. అధిష్ఠానం ఆదేశించినా ఆఖరి క్షణంలో అనారోగ్యమంటూ వెళ్ళక డీకే తన అసంతృప్తిని పైవాళ్ళకు చెప్పకనే చెప్పారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలున్న వేళ సిద్ధ, డీకేలలో ఒకరిని కాదని మరొకరిని ఎంపిక చేయడం కాంగ్రెస్ పెద్దలకు సైతం క్లిష్టమైన పనే. ఇద్దరూ సమర్థులే. ఇద్దరూ పార్టీ విజయానికి కష్టపడ్డవారే. ప్రజానేతగా, గతంలో ప్రజానుకూల సీఎంగా తెచ్చుకున్న పేరు, పాలనానుభవం సిద్ధకు కలిసొచ్చే అంశాలు. మరోపక్క పార్టీని పలువురు వదిలేసినా, కేంద్ర దర్యాప్తు సంస్థలు వేటాడినా కాంగ్రెస్‌కే కట్టుబడి, అంగ, అర్థబలాలతో భారీ విజయం కట్టబెట్టిన కార్యదక్షత డీకే ప్రధాన ఆకర్షణ. ఎవరినీ దూరం చేసుకోలేకే కాంగ్రెస్ వంతులవారీ సీఎం సీటనే లోపాయకారీ ఫార్ములాతో శాంతపరచజూస్తోంది. కాకపోతే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో లాగా ఆ ఫార్ములా ఆచరణలో అమలుకాదేమో అన్నది రెండో వంతులో సీఎం కావాల్సినవారి భయం.

ఎన్నికల వేళ కలసి ప్రత్యర్థి పార్టీపై పోరాడిన కర్ణాటక కాంగ్రెస్ దిగ్గజ నేతలు తీరా ఫలితాలు వెలువడిన మరుక్షణమే సీఎం సీటుకై పాత ప్రత్యర్థులుగా మారిపోవడం విచిత్రమే. బీజేపీతో ఢీ అంటే ఢీ అనడానికి ఇప్పుడిప్పుడే సర్వశక్తులూ ఒడ్డుతున్న పార్టీకి ఇది పెద్ద తలనొప్పే కాక ప్రజాక్షేత్రంలోనూ తలవంపులే. దీని నుంచి బయటపడడం ఇప్పుడు ఆ పార్టీ, ఆ పార్టీ నేతల చేతుల్లోనే ఉంది. నిజానికి, 224 స్థానాలున్న కీలక దక్షిణాది రాష్ట్రంలో 42.9 శాతం ఓటు షేర్‌తో 135 సీట్లు గెలవడం మోదీ ప్రవేశానంతర రాజకీయ క్షేత్రంలో కాంగ్రెస్‌కు పెద్ద సాంత్వన. 2018 ఎన్నికలతో పోలిస్తే, 4.8 శాతం ఓటు షేర్, 55 సీట్లు అధికంగా ఆ పార్టీ దక్కించుకోవడం విశేషం. బీజేపీ మాత్రం అర శాతం లోపే ఓటు షేరు తగ్గినా, 38 సీట్లు చేజార్చుకొని 66 స్థానాల్లోనే గెలుపొందగలిగింది. బీజేపీ ప్రభుత్వ పాలనావైఫల్యానికి దర్పణంగా డజనుమంది మంత్రులు ఓటమిపాలై, ఇంటి దారి పట్టాల్సొచ్చింది.

పాలనలో లోపంతో పాటు పేరుకున్న అవినీతి, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, లింగాయత్ వర్గాన్ని దూరం చేసుకోవడం – ఇలా బీజేపీ ఓటమికి అనేక కారణాలు. రాష్ట్రంలో 16–17 శాతం జనాభాతో, ఒకప్పుడు కమలానికి బలమైన ఓటుబ్యాంక్‌గా నిలిచిన వీరశైవ లింగాయత్‌లు ఈసారి హస్తం గుర్తుకు జై కొట్టారు. ఉత్తర కర్ణాటకలో వచ్చిన ఫలితాలు, బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ పక్షాన గెలిచిన లింగాయత్ ఎమ్మెల్యే అభ్యర్థుల సంఖ్యే అందుకు సాక్ష్యం. బీజేపీలో తమకు అవమానం జరిగిందంటూ తమ వైపు మొగ్గిన ఈ బలమైన లింగాయత్ వర్గాన్ని అలాగే నిలుపుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్‌దే. మరో బలమైన ఒక్కళిగ వర్గానికి చెందిన డీకేనూ దూరం చేసుకోలేదు. పైగా, లోక్‌సభ ఎన్నికల్లోనూ 28 సీట్ల కన్నడసీమలో ఇదే విజయ దరహాసం పునరావృతం కావాలంటే పార్టీని సమర్థంగా నడిపే కార్యశూరులే కావాలి. 75 లక్షల సంస్థాగత బలంతో, సిద్ధ, డీకే లాంటి స్థానిక నేతలతోనే తాజా విజయం సాధ్యమైందని అధిష్ఠానానికీ తెలుసు.

ఒక రకంగా కర్ణాటక ఫలితాలు గెలిచిన కాంగ్రెస్‌కూ, ఓడిన బీజేపీకీ రెంటికీ స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. జాతీయ అంశాల కన్నా స్థానిక అంశాలు, సారథులు, ప్రజా సంక్షేమ వాగ్దానాలు, బడుగు బలహీన వర్గాల, దళిత, మైనారిటీల ఏకీకరణ రాజకీయంతో మోదీ, షా లాంటి బలమైన ప్రత్యర్థుల్ని సైతం ఢీకొట్టవచ్చని గ్రాండ్ ఓల్డ్ పార్టీ నేర్వాల్సిన పాఠం. అతి జాతీయవాదం, మనుషుల్ని చీల్చే మతతత్వం, 'ఒకే దేశం ఒకే భాష'తో ఆసేతు హిమాచలాన్ని చాపచుట్టేయాలనుకుంటే అది కుదరని పని అనేది కాషాయపార్టీకి కర్ణాటక చావుదెబ్బ చెబుతున్న గుణపాఠం. మోదీపై బీజేపీ అతిగా ఆధారపడితే లాభం లేదు. స్థానికంగా పార్టీ, నాయకత్వం బలంగా ఉంటేనే ఆ మోళీ పని చేస్తుందనడానికి యూపీ, అస్సామ్, మధ్యప్రదేశ్‌లే తార్కాణం. 2014 మే తర్వాత జరిగిన 57 అసెంబ్లీ ఎన్నికల్లో సగానికి పైగా వాటిలో మోదీ ఉన్నా ఆ పార్టీ ఓడిపోయిందనేది కఠిన వాస్తవం. అది తెలిసి నడుచుకోకుంటే బీజేపీకి కష్టం. ఇక, కర్ణాటక ఫలితాలతో లోక్‌సభపై ఆశలు పెంచుకుంటున్న ప్రతిపక్షాలు అతిగా లెక్కలేసి, సంబరపడితే సరిపోదు. జాతీయ స్థాయిలో నేటికీ తిరుగులేని మోదీకి ప్రత్యామ్నాయంగా నిలవాలంటే, నిందలు, ఆరోపణల కన్నా ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాలి. బలవంతుడైన ప్రత్యర్థిపై కలసికట్టుగా పోరాడాలి. సీఎం సీటు చేజారవచ్చనే నిస్పృహలో 'ధైర్య సాహసాలు నిండిన ఒక్క వ్యక్తి వల్లే మెజారిటీ సాధ్య'మని గర్జిస్తున్న డీకేకి సైతం ఆ సంగతి తెలీదనుకోలేం. మరిన్ని సవాళ్ళు ముందున్న వేళ పార్టీకైనా, వ్యక్తులకైనా ఐకమత్యమే మహాబలం.

ఎప్పటికీ 'మేధావులు' అవసరమే!

విశ్లేషణ



నీరా చంఢోక్

ఫ్రెంచ్ సమాజంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో 'మేధావులు' ఆవిర్భవించారు. అయితే ఈ మేధావులు అనే మాటను వామపక్షీయులను ఉద్దేశించి వాడింది సంప్రదాయవాదులు (రైట్‌వింగ్), కాకపోతే నిందాపూర్వకంగా! వారి దృష్టిలో ఈ మేధావులు దేశ వ్యతిరేకులు. నేటి భారత్‌లో కూడా అదే పరిస్థితి ఉండటం గమనార్హం. అయితే మేధావులు ఈ దాడులను మొదటినుంచీ తమ లక్ష్య సాధనలో ప్రాసంగికత లేనివిగా కొట్టిపారేస్తారు. అన్యాయం, నిరంకుశాధికారం, మత ఘర్షణల మీద పోరాటమే తమ లక్ష్యమని చెబుతారు. సమాజంలో జరిగే వ్యవహారాలకు మేధావులు తమ సొంత ప్రపంచాల్లో కళ్లుమూసుకుని ఉండలేరు. కానీ మునుపటిలా శక్తిమంతంగా వారు పోరాడుతున్నారా అన్నది సందేహం.

1993లో 'బీబీసీ రీత్ ప్రసంగం' చేస్తూ పాలస్తీనియన్–అమెరికన్ ప్రొఫెసర్ ఎడ్వర్డ్ సెడ్ ఇలా ప్రశ్నించారు: ''సృజనాత్మకతకూ, దౌర్బల్యాల పట్ల నిబద్ధతకూ మధ్య సమతౌల్యత సాధించడం ఎలా?'' ఇంకా ఆయన ఇలా కొనసాగించారు: ''అదిభౌతికమైన ఉద్వేగాలు, ఆసక్తి ఉండని న్యాయం, సత్యం వంటి సూత్రాలు కదిలించినప్పుడల్లా అసలైన మేధావులు ఎన్నడూ లేనంత తాముగా ఉన్నారు. వారు అక్రమాలను నిరసించారు, బలహీనుల పక్షాన నిలిచారు, అధికారాన్ని ప్రశ్నించారు.''

ప్రజా మేధావి అన్న భావన మొట్టమొదట 1894 డిసెంబరులో ఫ్రాన్స్‌లో పుట్టుకొచ్చింది. ఆర్మీ కెప్టెన్ ఆల్ఫ్రెడ్ డ్రేఫస్‌పై దేశద్రోహం ఆరోపణలు వచ్చాయి. జర్మన్లకు మిలటరీ రహస్యాలు అమ్మేశాడన్నది ఆయనపై ఆరోపణ. ఇదే అదనుగా యూదు వ్యతిరేక సంస్థలు చెలరేగాయి. ఉదాహరణకు ఎడువార్డ్ డ్రూమాంట్ సంపాదకత్వంలో నడిచిన 'లా లిబ్రే' ఫ్రెంచ్ యూదులు విశ్వాస ఘాతకులన్నట్టుగా కథనాలు ప్రచురించింది. కొంతమంది డ్రేఫస్‌కు మద్దతుగా నిలిచారు. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం బలహీనంగా ఉంది. ఫెర్దినాండ్ వాల్సిన్ ఈస్టర్‌హేజీ అనే మరో అధికారిపై ఇలానే దేశద్రోహ ఆరోపణలు వస్తే మిలటరీ కోర్టు వాటిని కొట్టివేసింది.

జరిగిన అన్యాయం గురించి అందరికీ స్పష్టంగా అర్థమైంది. జాతి వివక్ష కూడా ప్రస్ఫుటంగా కనిపించింది. ఈ నేపథ్యంలో మేధావులు తమ సొంత ప్రపంచాల్లో కళ్లుమూసుకు ఉండలేని పరిస్థితి. విఖ్యాత నవలా రచయిత ఎమిలీ జోలా 'జా అక్యూస్' పేరుతో రాసిన బహిరంగ లేఖ 'లా అరోర్' పత్రికలో ప్రచురితమైంది. డ్రేఫస్‌ను అక్రమంగా దోషిగా నిర్ధారించి ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని ఎమిలీ ఆ లేఖలో సైన్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇది మరో వివాదానికి దారితీసింది. జోలా మద్దతుదారులు సైన్యాన్ని కించపరచడం ద్వారా దేశాన్ని బలహీన పరిచారని సంప్రదాయవాదులు (రైట్ వింగ్) విరుచుకుపడ్డారు. మండించే స్వభావం గల అలంకారప్రాయమైన దేశభక్తి కంటే వ్యక్తిగత స్వేచ్ఛకు ఉదారవాద వామపక్షీయులు మద్దతిచ్చారు. సంప్రదాయవాదులు వారిని 'మేధావులు' అని నిందాపూర్వకంగా పిలిచారు. వారి దృష్టిలో ఈ మేధావులు దేశ వ్యతిరేకులు. నేటి భారత్‌లో కూడా అదే జరుగుతోంది.

అయితే మేధావులు ఎప్పుడూ ఈ దాడులను తమ లక్ష్య సాధనలో ప్రాసంగికత లేనివిగా కొట్టిపారేస్తారు. అన్యాయం, నిరంకుశాధికారం, మత ఘర్షణల మీద పోరాటమే తమ లక్ష్యమని చెబుతారు. తత్వవేత్త, రచయిత జా పాల్ సార్త్ర్ 1980లో మరణించినప్పుడు సుమారు యాభై వేల మంది ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. వివాదానికి దూరంగా ఉండే హక్కు మేధావికి లేదనే వారు సార్త్ర్. అన్నింటికీ అతీతంగా ఉంటామనే సౌలభ్యం కూడా వారికి నాస్తి అంటారాయన. సమాజాన్ని మార్చేందుకు ప్రజా మేధావి



అనేవాడు తన సొంత విషయాలను పక్కనబెట్టాలనీ, వ్యక్తిగత జీవితం వంటివి అతడు లేదా ఆమెకు ఉండవనీ అంటారు.

1935లో ఫ్రెంచ్ మేధావులు అంతర్జాతీయ రచయితల సంఘం ఒకదాన్ని ఏర్పాటు చేశారు. ప్యారిస్ సంస్కృతి పరిరక్షణ దీని ఉద్దేశం. ఈ సంఘం ఏర్పాటు చేసిన సదస్సులో ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు ఏకమయ్యారు. జూన్ నెలలో జరిగిన ఈ సదస్సుకు సజ్జాద్ జహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్ వంటివారూ హాజరయ్యారు. తరువాతి కాలంలో వీరిద్దరూ భారతీయ సాహిత్యం, ఉర్దూ కవిత్వంలో మార్పునకు కృషి చేశారు. ఆల్డస్ హక్స్‌లీ, ఈఎం ఫార్‌స్టర్, బోరిస్ ప్యాస్టర్‌నాక్, బెర్తోల్ట్ బ్రెష్ట్, ఇంకా ఇతర దిగ్గజ రచయితలు ఈ సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో తలెత్తిన వివాదాలు కాస్తా ప్యారిస్ వీధుల వరకూ విస్తరించాయి.

సోవియట్ యూనియన్ చరిత్రకారుడు ఇల్యా ఎహ్రెన్ బర్గ్ 'దోపిడిదారులను దునుమాడేందుకు ఆయుధంగా మారని ఏ కళ అయినా నిష్ప్రయోజనమైంది!' అన్నారు ఇల్యా మీద ఆంద్రే బ్రెటన్ లాంటివారు బహిరంగంగానే విమర్శించారు. చివరకు ఆ సదస్సు ఫాసిస్టులకు వ్యతిరేకంగా ఒక సమాఖ్యనైతే ఏర్పాటు చేయలేకపోయింది. సదస్సుకు హాజరైన వారందరూ ఫాసిజాన్ని ద్వేషించారు. కానీ సోవియట్ యూనియన్ తరహా పరిష్కారం ఉండాలన్న ఆకాంక్షపై మాత్రం ఏకాభిప్రాయానికి రాలేక పోయారు. అధివాస్తవికులు, కమ్యూనిస్టుల మధ్య సయోధ్య కోసం రెనె క్రేవెల్ (అధివాస్తవికుడు) విఫలయత్నం చేశారు. ఆ నిస్పృహలో రెనె తన ఇంటికొచ్చేసి గ్యాస్ కనెక్షన్ ఆన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. 'ఏవగింపు' అని రాసి ఉన్న నోట్ అతడి కోటు జేబుకు అతికించి ఉండింది!

ప్రగతిశీల రచయితల బాధ్యత

రచయితలు, కవుల సామాజిక బాధ్యతలపై అదే కాలంలో భారత్‌లో కూడా ఎన్నో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కవులు, రచయితలు సామాన్యులతో కలిసిపోవాలంటే వారు తమ వ్యక్తిగత ఆనందాలు, కోరికలు, ఉద్వేగాలు, నిస్పృహలకు అతీతంగా తమ రచనలు, కవితలను తీసుకెళ్లాలన్న నమ్మకంతో 1936లో ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ (అఖిల భారతీయ ప్రగతిశీల రచయితల సంఘం) ఏర్పడింది. మతం, జాతీయత రాజకీయాల నుంచి పేదరికం, వివక్ష, వర్గం వైపు కవులను మళ్లించిన ఘనత దీనిదే. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు ఇటలీ కాలమిస్ట్ ఆంటోనియో గ్రాంసీ రచనలను అప్పటికి చదివి ఉండేందుకు అవకాశం లేదు. ఆయన 'ప్రిజన్ నోట్‌బుక్' 1970లలో ఆంగ్లంలో ప్రచురితమైంది. కానీ ముస్సోలిని అపఖ్యాతి జైలు వ్యవస్థలో మగ్గిన గ్రాంసీ రాసినదానిలో ఈ ప్రగతిశీల రచయితలు నమ్మకం ఉన్నవారే. అదేమిటంటే... మేధావి అనేవాడు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తనకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలి. ఉదారవాదులు రాజకీయ జీవితంలోకి ప్రవేశించాలి!

ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ సభ్యుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ సభ్యుడైన కె.ఎ. అబ్బాస్ తన ఆత్మకథలో 'నేనేమీ ఓ ద్వీపాన్ని కాదు' అన్న వాక్యం ఉంటుంది. 1946 నాటి బాంబే గురించి ఈ వ్యాఖ్య. అప్పట్లో హిందూ, ముస్లింల మధ్య బాంబే రెండుగా విడిపోయి ఉండేది. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఓ శాంతి ప్రదర్శన ఏర్పాటు చేశాయి. పృథ్వీరాజ్ కపూర్‌కు చెందిన పృథ్వీ థియేటర్స్‌తో పాటు సుమారు 52 సాంస్కృతిక సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. కపూర్లు(పృథ్వీరాజ్, రాజ్, షమ్మీ), దేవానంద్, బల్‌రాజ్ సహానీ, అభ్యుదయ ఉర్దూ కవులు, రచయితలు సజ్జాద్ జహీర్, మజ్రూహ్ సుల్తాన్‌పూరి, అలీ సర్దార్ జాఫ్రీ, కైఫీ అజ్మీ, సాహిర్ లూధియానీవీతో పాటు మరాఠీ, గుజరాతీ రచయితలు కూడా బోరిబందర్ నుంచి బాంద్రా వరకూ సాగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. శాంతి, సామరస్యాలు, సౌభ్రాతృత్వాలను సూచించే పాటలు పాడుతూ సాగిందా ఊరేగింపు. తద్వారా మత ఘర్షణల గాయాలకు మందు పూసే ప్రయత్నం జరిగింది.

ప్రస్తుతానికి వస్తే... మన నటులను అధికార పక్షంపై ప్రశంసలు కురిపించేలా బలవంతం చేస్తున్నారు. జైలుకెళ్లాల్సి వస్తుందని రచయితలు భయపడుతున్నారు. విప్లవాత్మక ఆలోచనలున్న నాటక రంగం కనుమరుగైంది. కవులు రాస్తున్నారు కానీ వారి వారి ఏకాంతాల్లో! విద్యావేత్తలు తమ ఉపకులపతుల ఆగ్రహానికి గురి కాకుడదన్న రంధిలో ఉన్నారు. ఏతావాతా... సమాజపు చేతన కాస్తా నిశ్శబ్దంలో అంగలారుస్తోంది. ఇది ఉపమాలంకారమే కావొచ్చుగానీ, మేధావుల చుట్టూ సంకెళ్ల శృంఖలాలు చుట్టుకుపోయి ఉన్నాయి. దశాబ్దాలపాటు ఫాసిస్టు వ్యతిరేక కూటమి కట్టిన శక్తులు మమ్మల్ని మళ్లీ ఆవహిస్తే బాగుండు. సామాజిక మేధావులు లేని సమాజం నశించిపోతుందనీ, అది కూడా చాలా నెమ్మదిగా కానీ కచ్చితంగా జరుగుతుందనీ ఆ శక్తులు గుర్తుచేస్తున్నాయి.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శాంతిని నెలకొల్పాలి



మణిపూర్‌లో అశాంతి ఇంకా కొనసాగుతుండటం తీవ్ర ఆందోళనకరం. శాంతిని నెలకొల్పడం, అందరి క్షేమాన్ని చూసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాథమ్యం ఇవ్వాలి. హింసలో చిక్కుబడిపోయి, దీనివల్ల ప్రభావితమైన అందరి పట్లా నాకు వేదన కలుగుతోంది.

– ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి

ఏంటో తెలుసు



ఖాలిస్తానీ ఉద్యమానికి మేము సిక్కులం వ్యతిరేకులం. మాకు ఈ సోకాల్డ్ ఉద్యమ వాస్తవికత ఏంటో తెలుసు. సిక్కుల్లో ఎవరూ ఖాలిస్తాన్ కోరుకోవడం లేదు. ఇది భారత్‌కు వ్యతిరేకంగా సమస్యలు సృష్టించడానికి మొదలైనది మాత్రమే.

– జస్లీన్ కౌర్, వ్యాఖ్యాత

ఏం రాశాడో!



ఏనాడూ పుస్తకం పట్టి చదవగా చూడని నా చిన్నారి కూడా భారీ మార్కులతో పాసవ్వడం చూశాక – విద్యావ్యవస్థలో నాకున్న కొద్దిపాటి విశ్వాసం కూడా సన్నగిల్లింది.

– మంజుల్, కార్టూనిస్ట్

ఎందరో పనిచేస్తే...



ఒంటిచేత్తో తాను ప్రధాని కాలేదనీ, కానీ అదే ఒంటిచేత్తో తన ప్రధాని పదవి పోతుందనీ మోదీ తెలుసుకోవాలి. (కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో)

– సుబ్రమణ్యస్వామి, కేంద్ర మాజీ మంత్రి

ప్రశ్నే తలెత్తొద్దు



ఐదేళ్లలో సుమారు పది లక్షల కోట్ల రూపాయల మురిగిపోయిన కార్పొరేట్ అప్పుల్ని బ్యాంకులు రైటాఫ్ చేసే దేశంలో– ప్రజల అంచనాలు, అవసరాలను చూసుకోవడానికి మాత్రం నిధుల కొరత ఎందుకుండాలి?

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మూసీ ప్రక్షాళన తక్షణ అవసరం

హైదరాబాద్ నగరం నడి మధ్య నుండి పాత, కొత్త నగరాలను వేరు చేస్తూ ఆహ్లాదంగా పారే ఒకప్పటి ముచుకుందా నది మూసీ నది పేరుతో ఇవ్వాళ ఒక మురుగు కాల్వను తలపిస్తోంది. అనేక హానికారక రసాయనాలూ, వ్యర్థాల నిలయంగా ఈ నది మారిపోయింది. కృష్ణా నదికి ఉపనదైన మూసీ నది వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టింది. భాగ్యనగర వాసుల దాహార్తిని తీర్చడానికి ఉద్దేశించిన 'హుస్సేన్ సాగర్' మూసీపై నిర్మించినదే అంటేనే మూసీ నీరు ఎంత స్వచ్ఛంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

మూసీ నది పట్ల అప్పటి ఉమ్మడి పాల కులే కాదు ఇప్పటి తెలంగాణ పాలకులూ చేసిందేమీ లేదు. అప్పటి పాలకులు విపరీతమైన పారిశ్రామిక కారిడార్లకు అనుమతులు ఇచ్చి వాటి నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలకు డంపింగ్ యార్డ్ లాగా మూసీని మార్చేశారు.



ఒకప్పుడు మూసీ నిండు కుండలా సుడులు తిరుగుతూ ప్రవహించేది. అనేకసార్లు మూసీకి వరదలు వచ్చేవి. 1908 సెప్టెంబర్ 28న వచ్చిన వరదలు మూసీ ఉగ్ర రూపాన్ని జంట నగరాలకు సాక్షాత్కరింప చేశాయి. అప్పటి అనుభవాల నుండి కొంత మేరకు ఆధునికీకరణ చేసినా ఎక్కడ కూడా ఈ నది ప్రక్షాళన కార్యక్రమం చేపట్టలేదు. ఫలితంగా ఇప్పటికీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల్లో 68 శాతం ఆర్థరైటిస్, 79 శాతం చర్మ వ్యాధులు, 44 శాతం డయేరియాతో కునారిల్లి పోవడానికి విషపూరితమైన మూసీ నదే కారణం అంటే నమ్మక తప్పదు. మూసీని ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీరు, దుర్గంధం లేని గాలిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైన ఉంది.

మూసీ ప్రవహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల బాధలు వర్ణనాతీతం. ఒక వైపు ఫ్లోరిన్ భూతం పట్టి పీడిస్తుంటే మరోవైపు భూగర్భ జలాలు మూసీ వల్ల విషతుల్యమవుతున్నాయి. మూసీపై నుంచి వీచే దుర్గంధ పూరిత గాలుల వల్ల పరీవాహక ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కిడ్నీ సమస్యలతో పాటు అనేక అనారోగ్య సమస్యలూ వేధిస్తున్నాయి. అనారోగ్యంతో పనిచేసుకోలేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులూ ఎదురవుతున్నాయి. ఆరోగ్యం లేక, బతుకు తెరువూ కానక అనేక మంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

ఈ దయనీయ పరిస్థితులను అధ్యయనం చేసిన ప్రొఫెసర్ వెంకటదాస్ మూసీనది ప్రక్షాళన చేయాలని ఉద్యమించారు. ఇప్పటి వరకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీల్లో ఒక్కటైన మూసీ సుందరీకరణను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు పాదయాత్ర ప్రారంభించారు. హైదరాబాద్ మహానగరం గుండా సాగుతున్న ఈ పాదయాత్ర చరిత్రలో లిఖించదగినది. ప్రభుత్వానికి తన బాధ్యతను గుర్తు చేస్తూ సాగుతున్న ఈ పాద యాత్రలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం పంచుకుంటున్నారు.

– డా॥ పి. నారాయణ
(ఏప్రిల్ 23 నుంచి జూన్ 11 సాగుతున్న 'సేవ్ మూసీ' పాదయాత్ర)

దాడుల నుంచి రక్షణ కావాలి

ఇటీవలి కాలంలో ఆసుపత్రులపై, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగి పోతున్నాయి. గతవారం కేరళలో యువ వైద్యురాలు వందనా దాస్ హత్యకు గురైన నేపథ్యంలో వైద్యులు తమ సేవలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తక్షణం తీసుకురావలసిన అవసరం మరొక్కసారి చర్చకు వచ్చింది.

దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2008లో దేశంలోనే మొట్టమొదటిసారిగా వైద్యులపై, ఆసుపత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారు. తర్వాత 14 రాష్ట్రాల్లో ఇదే విధమైన చట్టాన్ని తీసుకు రావడం జరిగింది.

డాక్టర్ వందనా దాస్ హత్య అనంతరం కేరళలో ప్రస్తుతమున్న రాష్ట్ర వైద్య రక్షణ చట్టాన్ని కఠినతరం చేస్తామని కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా అమలు చేయడానికి అనుకూలంగా జాతీయస్థాయిలో వైద్యుల, ఆసుపత్రుల రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వానికి ఐఎంఏ జాతీయ సంఘం, రాష్ట్ర సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పలు సందర్భాలలో విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ఖాతరు చేయకపోవడం శోచనీయం. ఇంకా ఎంతమంది వందనా దాస్‌లు ప్రాణాలు కోల్పోతే కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందో తెలియడం లేదు.



ఆసుపత్రుల్లో రోగులు చనిపోయిన సందర్భాలలో, చికిత్సలలో లోపాలపై వైద్యులపై వైద్య నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే సమయంలో సుప్రీంకోర్టు తీర్పులు పరిగణనలోకి తీసుకోవాలి. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయాలి. వైద్యులపై నిర్లక్ష్యం ఆరోపణలపై కేసులు నమోదు చేసినప్పటికీ, వైద్యులని అరెస్టు చేయడానికి ఆస్కారం లేదని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఒకే విధానం అన్నిచోట్ల అమలు చేసేలా పలు రాష్ట్రాలలో ఉన్న విధంగా రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల పోలీసు అధికారులకు, పోలీస్ స్టేషన్లకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ఆదేశాలు జారీ చేయాలి.

ఎటువంటి శిక్షణ లేకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అధిక సంఖ్యలో గ్రామీణ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించడానికి పరిమితం కాకుండా, తమకు శిక్షణ లేని వైద్యం అందిస్తూ ప్రజలకు హాని కలిగిస్తున్నారు. అనవసరంగా శక్తిమంతమైన యాంటీబయాటిక్ మందులను విస్తృతంగా వాడడం వల్ల వారికి తీవ్రమైన జబ్బులు వచ్చినప్పుడు ఆ మందులు పని చేయని పరిస్థితికి దారి తీస్తున్నాయి. శిక్షణ లేని వైద్యం చేస్తున్న క్లినిక్‌ల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. అందుకు అనుగుణంగా నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

అన్ని రకాల వైద్య విధానాలపై ఐఎంఏకు గౌరవం ఉంది. ప్రజలకు ఏ వైద్య విధానం కావాలో వారే నిర్ణయించుకుని ఆ వైద్య విధానంలో చికిత్స పొందడానికి అవకాశం కల్పించాలి. కానీ దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వం వివిధ వైద్య విధానాలను మిళితం చేసి కిచిడి వైద్యం అందించే విధానాలు రూపొందించడం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టడం తప్ప మరొకటి కాదు. ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలి.

తన సామాజిక బాధ్యతలో భాగంగా పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు, విద్యా సంస్థలలో ఆరోగ్య సదస్సులు, కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్తహీనత నిర్ధారణ వంటి అనేక కార్యక్రమాలు, ఆరోగ్య సంబంధమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు నిర్వహించి జబ్బులు రాక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన పెంచడానికి ఐఎంఏ శాఖలు కృషి చేస్తున్నాయి. ఇటువంటి కీలక పాత్ర పోషిస్తున్న సంస్థను వైద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోబోయే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదించడం ఆరోగ్యకర సంప్రదాయమవుతుంది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల అమలులోని సాధ్యాసాధ్యాలూ, ఫలితాలూ వైద్యులకు తెలిసినంతగా మరొకరికి తెలియవు కదా.

– డాక్టర్ జి. రవికృష్ణ, డాక్టర్ పి. ఫణిధర్
ఐఎంఏ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

నడవాల్సిన దారి

ఓ ఆశ్రమంలో గురువుగారిని సేవిస్తూ విద్యను అభ్యసిస్తున్నాడు ఓ శిష్యుడు. ఒకరోజు తినడానికి కావలసిన కాయలూ, ఫలాల కోసం శిష్యుడు అడవిలోపలికి వెళ్లాడు. ఓ చోట చెట్టు కింద ఓ నక్క కాలికి తగిలిన గాయంతో నడవలేక కూర్చుని ఉంది. దానిని చూడటంతోనే ఆ యువకుడికి సందేహం కలిగింది. నడవలేని ఈ నక్క ఎట్లా వేటాడు తుందని. అతనికి ఎదురుగా ఓ పులి రావడం కనిపించింది. వెంటనే అతను చెట్టు చాటుకు పోయి దాక్కున్నాడు.

పులి ఎక్కడో చంపిన ఓ జింకను తీసుకొచ్చి తినగలిగినంత తిని మిగిలింది అక్కడే విడిచిపెట్టి తన దారిన తాను పోయింది. తర్వాత నక్క మెల్లగా కుంటుకుంటూ పోయి పులి మిగిల్చిన జింక మాంసాన్ని తిని తన ఆకలి తీర్చుకుని తృప్తి పడింది. ఇదంతా చెట్టు చాటు నుంచి గమనిస్తున్న శిష్యుడు 'గాయంతో నడవలేని స్థితిలో ఉన్న నక్కకు దేవుడు దయ తలిచి ఏదో విధంగా ఆహారాన్ని సమకూర్చాడు. ఎప్పుడూ దేవుణ్ణి స్మరిస్తూ, జపిస్తూ ఉండే నాకు ఆహారం ఇవ్వక పోతాడా' అనుకున్నాడు.

జ్యోతిర్మయం

అటువంటి ఆలోచన మదిలో మెదలడంతోనే ఆ యువకుడు ఇక ఆహారం కోసం వెతకడం మానేశాడు. రోజులు గడిచిపోతున్నాయి తప్ప అతనికి ఆహార మేమీ లభించలేదు. దాంతో అతను ఆకలితో నీరసించి పోతున్నాడు. శిష్యుడు ఎంతకూ తిరిగి రాకపోవడంతో గురువుగారు అతడిని వెతుక్కుంటూ బయలుదేరారు. ఓ చెట్టు కింద అన్నపానాదులు లేకుండా నీరసంతో పడుకున్న తన శిష్యుడు కనిపించాడు. గురువు గారికి శిష్యుడు జరిగినదంతా చెప్పాడు.

అప్పుడు గురువుగారు 'ఓరీ మూర్ఖుడా, నువ్వు ఓ నక్కను చూసి దాని దారిలో నడవడమేమిటీ... నువ్వు పాఠం నేర్చుకోవలసింది పులి నుంచి. నిస్సహాయులకు సాయం చేయమని నిన్ను దేవుడు ఒక పరికరంగా పుట్టిస్తే నువ్వేమో ఇతరుల నుంచి సాయం పొందలేకపోతానా అని ఇలా చెట్టు కింద కూర్చుని ఆహారం కోసం చూస్తున్నావా... ఇది నీకు తగునా?' అన్నారు.

ఇతరులకు సాయం చేసే వారికే దేవుడు సహాయం చేస్తాడు అని తెలుసుకున్న శిష్యుడు అప్పటి నుంచి నలుగురికీ సాయపడేలా మారాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.ద్వాదశి రా.11.45 వకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.8.46 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: రా.8.20 నుండి 9.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.47 నుండి 11.32 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.37.

క్లుప్తంగా...

పెళ్లిరోజు భర్త ఆత్మహత్య

భార్య ఉరేసుకున్న చెట్టు వద్దనే బలవన్మరణం



శ్యాంసుందర్ (ఫైల్)

హుస్నాబాద్: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి తన పెళ్లిరోజే... భార్య ఉరేసుకున్న చోటే బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ జిల్లా నేదునూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి శ్యాంసుందర్(35)కు ఏడాది క్రితం హుస్నాబాద్ పట్టణానికి చెందిన శారదతో వివాహమైంది. పెళ్లయిన కొద్ది నెలలకే ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో ఆరునెలల క్రితం శారద తన ఇంటివద్ద ఉన్న చెట్టుకే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భార్య చనిపోయిన నాటి నుంచి మనస్తాపానికి లోనైన శ్యాం ఆదివారం అర్ధరాత్రి హుస్నాబాద్‌కు వచ్చి భార్య చనిపోయిన చెట్టు వద్దే పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించేలోగానే మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాతా శిశు కేంద్రంలో గర్భస్థ శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన



ఎంసీహెచ్ ఇన్‌చార్జి కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

కరీంనగర్ టౌన్: కరీంనగర్ మాతా శిశు కేంద్రంలో సోమవారం ఓ గర్భస్థ శిశువు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నెల్లి హర్షిత డెలివరీ నిమిత్తం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం రాత్రి 10.30 గంటలకు అడ్మిట్ అయింది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కడుపులో ఉన్న శిశువు కదలికలు ఆగిపోగా, మరికొద్ది సమయానికి పరీక్షించిన వైద్యులు కడుపులోనే బిడ్డ చనిపోయాడని చెప్పారు. చివరకు శస్త్రచికిత్స ద్వారా మృత శిశువును బయటకు తీశారు. 10.30గంటల సమయంలో తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్నా డెలివరీకి టైం ఉందంటూ డాక్టర్లు నిర్లక్ష్యం చేశారని, అడ్మిట్ అయిన వెంటనే డెలివరీకి ప్రయత్నిస్తే బాబు బతికేవాడని భర్త హరీష్ ఆరోపించారు. డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యమే గర్భస్థ శిశువు మరణానికి కారణమంటూ.. బాధ్యులైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తకు నిప్పుపెట్టి.. ఆ మంటల్లో చిక్కుకుని..



మున్యానాయక్ (ఫైల్)

కూసుమంచి: పొలంలో చెత్తకు నిప్పుపెట్టిన రైతు.. ఆ మంటల్లోనే చిక్కుకుని మృతిచెందాడు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యాతండాకు చెందిన రైతు బదావత్ మున్యా నాయక్ (53) సోమవారం ఉదయం పొలంలో గెట్ల వెంట చెత్త ఉండటంతో అన్నీ పోగేసి నిప్పుపెట్టి ఇంటికి వచ్చేశాడు. మధ్యాహ్నం పొలం దగ్గరకు వెళ్లేసరికి మంటలు సమీప రైతుల పొలాల్లోకి వ్యాపించి బావుల వద్ద ఉన్న మోటార్ల స్టార్టర్లు, వైర్లు కాలిపోతున్నాయి. దీంతో మంటలు ఆర్పేందుకు యత్నించిన మున్యా దుస్తులకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో బయటపడలేకపోయిన ఆయన శరీరం కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.

అంబేడ్కర్ ఆలోచనల బాటలో కేసీఆర్ ప్రభుత్వం

ఎంపీ సంతోష్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరును పెట్టినందుకు కృతజ్ఞతగా తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అధ్వర్యంలో ఈ నెల 16న ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న కేసీఆర్‌కు ధన్యవాద సభ పోస్టర్‌ను సోమవారం ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. ప్రగతిభవన్ లో గజ్జెల కాంతంతో పాటు తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములుతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపేందుకు ఈ సభ నిర్వహించడం ముదావహమన్నారు.

దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలి

అఖిలపక్ష నేతల డిమాండ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో దళిత బంధు పథకంలో జరిగిన అవినీతిని గుర్తించి, మోసపోయిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేశ్, సీపీఎం మండల కార్యదర్శి కడెం లింగన్న, బీజేపీ నేత ధరావత్ సంతోష్, వైఎస్సార్ టీపీ నేత ఏపూరి యాకన్న మాట్లాడుతూ గ్రామంలో దళిత బంధు పథకంలో లబ్ధిదారులకు అందజేసిన గేదెల యూనిట్లలో రూ.10 లక్షలకు గాను కేవలం నాలుగు గేదెలు మాత్రమే ఇచ్చి యూనిట్ పూర్తయిందని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. తమ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ విచారణకు వెంటనే కమిటీని నియమిస్తామని, లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

పరిశోధనా ఫలాలు రైతులకు చేరాలి

- ఉత్పత్తిని పెంచడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవాలి
- జీ–20 సదస్సు సమీక్షలో కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పిలుపు
- వ్యవసాయ వర్సిటీలో నూతన ఆడిటోరియం ప్రారంభించిన మంత్రి



నూతన ఆడిటోరియంను ప్రారంభిస్తున్న నరేంద్ర సింగ్ తోమర్, నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పరిశోధనా ఫలాల్ని మారుమూల ప్రాంతాల్లో ఉండే సన్న చిన్న కారు రైతాంగాలకి అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ పిలుపునిచ్చారు. పంటల ఉత్పత్తి, ఉత్పాదకతల్ని అధికం చేయడానికి, నష్టాల్ని తగ్గించడానికి, మార్కెట్ అనుసంధానం చేయడానికి టెక్నాలజీలని విరివిగా వినియోగించుకోవాలన్నారు. కిందిస్థాయి రైతాంగం వరకు శిక్షణ అందించాలన్నారు. రైతాంగ సంక్షేమం కోసం కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో కలిసి పనిచేస్తాయన్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని 'విస్తరణ విద్యాసంస్థ (ఈఈఐ)'లో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈఈఐ స్వర్ణోత్సవాల సందర్భంగా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో 200 మంది కూర్చునే విధంగా ఈ ఆడిటోరియాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా తోమర్ మాట్లాడుతూ, అనేక పంటల ఉత్పత్తి, ఉత్పాదకతలలో దేశం ప్రథమ శ్రేణిలో ఉందన్నారు. దిగుమతులు చేసుకునే స్థాయి నుంచి ఎగుమతులు చేసుకునే స్థాయికి దేశం ఎదిగిందని మంత్రి వివరించారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి తమ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వివరించారు. రాష్ట్రానికి కేంద్రం కూడా ఇతోధిక సాయం అందించాలని కోరారు.

జూన్ 15–17 మధ్య హైదరాబాద్‌లో జీ–20 సదస్సు...

జూన్ 15–17 మధ్య హైదరాబాద్‌లో జరగనున్న జీ–20 అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు ముందస్తు ఏర్పాట్లపై మాదాపూర్ హెచ్ఐసీసీ లో కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్, రాష్ట్ర వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా తోమర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో తెలంగాణ ముందున్న నేపథ్యంలోనే ఇక్కడ జీ–20 సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

సీఎస్ శాంతి కుమారితో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి భేటీ...

కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహూజా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోజ్ అహూజా, జాయింట్ సెక్రటరీ యోగితా రాణాలను శాంతి కుమారి శాలువాతో సత్కరించారు.

అట్లాంటాలో రామాలయ నిర్మాణం

స్వామివారి విగ్రహాలకు భద్రాద్రిలో పూజలు

భద్రాచలం: అమెరికాలోని అట్లాంటాలో నిర్మిస్తున్న రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అట్లాంటా ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో భద్రాచలం రామాలయ నమూనా తరహాలో ఉండేలా ఆలయం నిర్మిస్తున్నారు. ఇందులో ప్రతిష్ఠించేందుకు ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాలలో శ్రీ సీతారామ లక్ష్మణులు, ఆంజనేయుడు, గరుత్మంతుడి విగ్రహాలను తయారు చేశారు. వీటిని ఏపీ దేవాదాయ శాఖ రిటైర్డ్ స్థపతి రాజేశ్వరాచార్యులు ఆధ్వర్యంలో భద్రాచలం తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఈ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, ధాన్యాధివాసం చేశారు. 45 రోజుల పాటు ధాన్యాధివాస పూజల అనంతరం విగ్రహాలను అట్లాంటాకు తీసుకెళ్లనున్నారు. భద్రాద్రి రామాలయంలో జరిగే సంప్రదాయ పూజలనే అట్లాంటాలోనూ ఆచరించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరాచార్యులు తెలిపారు. ధాన్యాధివాస పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న అర్చకులు, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు



సోమవారం పట్నా హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్

ఐసీఎస్ఈ టాపర్ అన్విత్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) వెల్లడించిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన బి అన్విత్ 99.2 శాతం మార్కులు సాధించి జాతీయ టాపర్‌గా నిలిచాడు. కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న అన్విత్ 500కి 496 మార్కులు సాధించాడు.

అందరూ కలవకుంటే మోదీని ఎదిరించడం సాధ్యం కాదు

- వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలి
- హుస్నాబాద్‌లో సీపీఐ నేత నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, సిద్దిపేట: నరేంద్రమోదీని ఓడించాలంటే మోదీ వ్యతిరేక శక్తులను ఏకం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అందరినీ కలుపుకోకుంటే మోదీని ఎదిరించడం సాధ్యం కాదన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో దేశ్‌కి బచావో బీజేపీకి హఠావో ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడారు. మోదీ వచ్చాక ఆయన గడ్డం ఎంత పెరిగిందో గ్యాస్ ధర అంత పెరిగిందని ఎద్దేవా చేశారు. దేశంలో 29 మంది బ్యాంకులకు డబ్బులు ఎగ్గొడితే అందులో 28 మంది గుజరాత్ గుండాలే ఉన్నారని ఆరోపించారు. దేశానికి ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని వేధిస్తోందన్నారు. అన్యాయంగా రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలంటే ఆదానీ ముంద్రా పోర్టుపై రైడ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, హుస్నాబాద్ నుంచి తమ పార్టీ తరఫున చాడ వెంకటరెడ్డి పోటీచేస్తారని నారాయణ ప్రకటించారు.

ధరణి పేరుతో కేసీఆర్ మాయాజాలం: ధరణి పేరుతో కేసీఆర్ మాయాజాలం చేస్తున్నారని పేదల భూములు దోచుకుంటున్నారని నారాయణ విమర్శించారు. సచివాలయం బ్రహ్మాండంగా కట్టారు.. కానీ ప్రజలకు ప్రవేశం లేకుంటే అది శ్మశానం లాంటిదే అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ మా కాలివేలు కొనలకు సాటి గాని వాళ్లు మంత్రులుగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ బీజేపీ, జనసేన బీజేపీ అప్పుడప్పుడు ఒక్కటవుతాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కవి రచయిత సురేందర్‌లు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని 'కలెక్టరేట్' ఎక్కిన రైతులు

- సిద్దిపేట కలెక్టరేట్, కమిషనరేట్ కోసం భూములిచ్చిన రైతుల ఆందోళన
- పోలీసుల రంగప్రవేశం.. అరెస్టు చేసి స్టేషన్‌కు తరలింపు



కలెక్టరేట్‌పైకి ఎక్కి నినాదాలు చేస్తున్న బాధిత రైతులు

సిద్దిపేట రూరల్: సిద్దిపేట కలెక్టరేట్, కమిషనరేట్‌ల నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చిన రైతులు తమకు ప్రభుత్వం చేసిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సుమారు 100 మంది బాధిత రైతులు తమ గోడును విన్నవించేందుకు ప్రజావాణికి వచ్చారు. అయితే బాధితులను పోలీసులు లోపలికి అనుమతించలేదు. వారితో మాట్లాడి గొడవ కాకుండా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమను లోపలికి అనుమతించకపోవడంతో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని చెప్పిన రైతులు, ఒక్కసారిగా కార్యాలయ భవనంపైకి ఎక్కి న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని భవనంపైనుంచి కిందకి తీసుకువచ్చారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ కొండపాక మండలం దుద్దెడ, రాంపల్లి గ్రామాలకు చెందిన 663, 143 సర్వే నంబర్లలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 165 మంది రైతులకు 365 ఎకరాల భూమిని పంపిణీ చేసిందన్నారు. ఐదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తం భూమిని సిద్దిపేట కలెక్టరేట్, కమిషనరేట్ నిర్మాణానికి సేకరించిందని, భూమికి నష్టపరిహారంగా రూ. 20 లక్షలు, కలెక్టరేట్ వద్ద 200 గజాల ఇంటి స్థలం అందిస్తామని అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు. తమలో కొంతమందికి డబ్బులు ఇచ్చి.. ఇంటిస్థలం పట్టా సర్టిఫికెట్ మాత్రం ఇచ్చారని, కానీ రిజిస్ట్రేషన్ మాత్రం చేయడంలేదని చెప్పారు. ఈ విషయంపై ఎన్నోసార్లు కలెక్టర్‌కు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని, పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినా అధికారుల్లో మార్పు రాలేదని విచారం వ్యక్తంచేశారు. అనంతరం రైతులను ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వద్దకు అనుమతించగా బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వారంలోపు సమావేశం నిర్వహించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. బాధితులు బయటకు వచ్చాక భవనంపైకి ఎక్కిన ఘటనలో పోలీసులు పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యూత్ కాంగ్రెస్ వార్‌రూమ్‌పై పోలీసుల దాడి!

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం రాత్రి యూత్ కాంగ్రెస్‌కు చెందిన వార్‌రూమ్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా పలువురిని అదుపులోకి తీసుకుని, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివిధ రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై వరుస ఫిర్యాదులు అందాయని.. దీనిపై సాంకేతిక దర్యాప్తు చేయగా బంజారాహిల్స్‌లోని ఓ కార్యాలయం నుంచి వస్తున్నట్టు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఆ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించామని, ప్రాథమిక విచారణలో అది యూత్ కాంగ్రెస్‌కు చెందిన వార్ రూమ్‌గా తేలిందని వెల్లడించారు. ఈ అంశంపై దర్యాప్తు చేపడతామన్నారు.

పుష్కరిణిలో యువకుడి మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయకొండకు దిగువన ఉన్న లక్ష్మీ పుష్కరిణిలో దిగిన యువకుడికి ఫిట్స్ రావడంతో ఊపిరాడక మరణించాడు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం చెడిగిద్దకు చెందిన బోయిన రమేష్ (30) కుటుంబసభ్యులతో కలిసి సోమవారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనానికి ముందు పుష్కరిణిలో పుణ్య స్నానం చేసేందుకు వెళ్లారు. రమేష్‌కు నీళ్లలో దిగగానే ఫిట్స్ రావడంతో మునిగిపోయాడు. నీటిని మింగడంతో ఊపిరాడక మృతిచెందాడు. పోలీసులు రమేష్ మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్రం ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విరాట్ కోహ్లీతో డ్యూరోఫ్లెక్స్ భాగస్వామ్యం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రముఖ స్లీప్ సొల్యూషన్స్ ప్రొవైడర్ 'డ్యూరోఫ్లెక్స్' తమ బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెట్ ఐకాన్ విరాట్ కోహ్లీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని హోటల్ తాజ్ కృష్ణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విరాట్ కోహ్లీ పాల్గొని 'డ్యూరోఫ్లెక్స్' ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతికతతో తయారు చేసిన మ్యాట్రెస్ న్యూమాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోహ్లీ మాట్లాడుతూ.. 'డ్యూరోఫ్లెక్స్'తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి నాణ్యమైన నిద్ర తప్పనిసరని అన్నారు. సంస్థ సీఈవో మోహన్‌రాజ్, సీఎండీ మాథ్యూ చాందీ కూడా మాట్లాడారు.

- జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు సోమవారం షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ నెల 11న ఖమ్మంలో మైనార్టీ పథకాల అమలుపై షహజాది నిర్వహించిన సమీక్షకు కలెక్టర్ హాజరుకాకపోగా, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు హాజరయ్యారు. దీంతో ఆమె సమీక్ష నిర్వహించకుండానే వెళ్లిపోయారు. సమావేశానికి ఎందుకు హాజరుకాలేదో ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సూచిస్తూ ఆమె నోటీసు జారీచేశారు.

క్లుప్తంగా

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు.. న్యూస్ చానెల్ అధికారి అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సీబీఐ తాజాగా మరొకరిని అరెస్ట్ చేసింది. 'ఇండియా ఏహెడ్' న్యూస్ చానెల్ కమర్షియల్ హెడ్, ప్రొడక్షన్ కంట్రోలర్ అర్వింద్ కుమార్ జోషిని అదుపులోకి తీసుకుంది. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆప్ ప్రచార బాధ్యతలను చేపట్టిన చారియెట్ మీడియా సంస్థకు ఈయన హవాలా మార్గంలో రూ.17 కోట్లను బదిలీ చేసినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. వాట్సాప్ చాటింగ్, హవాలా ఆపరేటర్ల రికార్డులు పరిశీలించిన తర్వాత జోషిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. చారియెట్ మీడియా యజమాని రాజేశ్ జోషిని ఫిబ్రవరిలోనే ఈడీ అదుపులోకి తీసుకుంది. అయితే, సరైన ఆధారాలను సమర్పించలేదంటూ మే 6న ప్రత్యేక కోర్టు ఆయనకు బెయిలిచ్చింది.

మరో 'అనుచిత' విమాన ప్రయాణికుడి అరెస్ట్

అమృత్‌సర్: అంతర్జాతీయ విమానంలో మరో అనుచిత ప్రవర్తన ఘటన చోటుచేసుకుంది. ఈ వివరాలను సోమవారం పోలీసులు వెల్లడించారు. శనివారం షార్జా నుంచి అమృత్‌సర్‌కు బయల్దేరిన ఇండిగో సంస్థ అంతర్జాతీయ విమానంలో పంజాబ్‌లోని కోట్లీ గ్రామానికి చెందిన రాజీందర్ సింగ్ ప్రయాణిస్తున్నారు. విమానంలో తప్పతాగాక అతను విమాన మహిళా సిబ్బంది ఒకరితో గొడవకు దిగాడు. ఈ సందర్భంగా ఆమెను లైంగికంగా వేధించాడు. గొడవను గమనించిన తోటి విమాన సిబ్బంది వెంటనే అమృత్‌సర్‌లోని కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో విమానం అమృత్‌సర్‌లోని శ్రీ గురు రాందాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే రాజీందర్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. భారత శిక్షాస్మృతిలోని 354, 509 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

కరెంటు బిల్లులు కాంగ్రెస్ నుంచి వసూలు చేసుకోండి!

చిత్రదుర్గ: "మేం కరెంటు బిల్లులు కట్టం. కాంగ్రెస్ పార్టీ నుంచి వసూలు చేసుకోండి" అని కర్ణాటకలో ఓ గ్రామస్థులు తెగేసి చెప్పారు. చిత్రదుర్గ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. బకాయిలతో సహా కరెంటు బిల్లులన్నీ కట్టాలన్న బిల్లు కలెక్టర్‌కు గ్రామస్థులు ఎదురు తిరిగారు. ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత కరెంటిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది గనక ఎన్నికల బిల్లులను ఆ పార్టీ నుంచే వసూలు చేసుకోవాలని స్పష్టం చేశారు. దాంతో చేసేది లేక ఆయన వెనుదిరిగాడు.

హాజీ సలీం.. డ్రగ్ లార్డ్



భారత్‌కు మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్

ఐఎస్ఐ, లష్కరే దన్ను, దావూద్‌తో లింకులు	పలు దేశాల్లో విచ్చలవిడిగా డ్రగ్స్ పంపింగ్
తాజాగా ఎన్సీబీకి చిక్కిన డ్రగ్స్ 2.5 టన్నులు	దాని విలువ ఏకంగా రూ. 25,000 కోట్లు!

అతనిది అత్యంత విలాసవంతమైన జీవన శైలి. అడుగు కదిలితే చుట్టూ అత్యాధునిక ఏకే ఆయుధాలతో అంగరక్షకుల భారీ భద్రత. ఎటు వెళ్లాలన్నా ముందే పలు అంచెల తనిఖీలు, దారి పొడవునా మూడో కంటికి అగుపడని రీతిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు. ఇది ఏ దేశాధ్యక్షుని పరిచయమో కాదు. భారత్‌తో సహా పలు ఆసియా దేశాలకు కొన్నేళ్లుగా కంటిపై కునుకు లేకుండా చేస్తున్న డ్రగ్ కింగ్ హాజీ సలీం జల్సా లైఫ్ స్టైల్! శనివారం కోచి సమీపంలో అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో భారీగా డ్రగ్స్ మోసుకెళ్తున్న ఓ నౌకను పక్కా సమాచారం మేరకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అడ్డగించి ముంచేయడం తెలిసిందే. అందులో ఏకంగా 2.5 టన్నుల మెథంఫెటామిన్ దొరకడం అధికారులనే విస్మయపరిచింది. ఇది ఎన్సీబీకి మోస్ట్ వాంటెడ్ డ్రగ్స్ స్మగ్లర్ అయిన హాజీదేనని దాడిలో పట్టుబడ్డ 29 ఏళ్ల పాక్ జాతీయుడు వెల్లడించాడు. భారత్, శ్రీలంక, సీషెల్స్ తదితర దేశాల్లో సరఫరా నిమిత్తం దీన్ని పాక్ దన్నుతో దొంగచాటుగా తరలిస్తున్నట్టు విచారణలో అంగీకరించాడు. మన దేశంలో ఇంత భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం ఇదే తొలిసారి! అంతేగాక పలు దేశాల్లో సరఫరా నిమిత్తం అత్యంత భారీ మొత్తంలో డ్రగ్స్‌ను మోసుకెళ్తున్న మదర్ షిప్ ఎన్సీబీకి చిక్కడమూ ఇదే మొదటిసారి! దాని విలువను రూ.12 వేల కోట్లుగా అధికారులు తొలుత పేర్కొన్నారు. కానీ ఇప్పటిదాకా దొరికిన డ్రగ్స్‌లోకెల్లా ఇదే అత్యంత హెచ్చు నాణ్యతతో కూడినదని తాజాగా పరీక్షల్లో తేలింది. దాంతో దీని విలువను సవరించి ఏకంగా రూ.25,000 కోట్లుగా తేల్చారు! పాక్ నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు హాజీ ముఠా అన్నిరకాలుగా సాయపడుతున్నట్టు కూడా తేలింది.



పాక్ అడ్డాగా...

పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా అండదండలతో అరేబియా సముద్రంలో హాజీ విచ్చలవిడిగా డ్రగ్స్ దందా నడుపుతున్నాడు. పాక్, ఇరాన్, అఫ్గానిస్తాన్ అతని అడ్డాలు! ఎక్కడా స్థిరంగా ఉండకుండా తరచూ స్థావరాలు మార్చడం హాజీ స్టైల్. అతని ప్రస్తుత అడ్డా పాకిస్తాన్. బలూచిస్తాన్‌లో మకాం వేసి కథ నడుపుతున్నాడు. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంతోనూ హాజీకి దగ్గరి లింకులున్నట్టు ఎన్సీబీ అనుమానం.

గమ్మత్తైన సంకేతాలు..

తేలు, ఎగిరే గుర్రం, డ్రాగన్, కొమ్ముగుర్రం, 555, 777, 999. ఇవన్నీ డ్రగ్స్ సరఫరాలో హాజీ ముఠా వాడే సంకేతాల్లో కొన్ని. డ్రగ్స్ ప్యాకెట్లపై ఉండే ఈ ప్రత్యేకమైన గుర్తులు వాటిలోని డ్రగ్స్, దాని నాణ్యతకు సంకేతాలు. కొనుగోలుదారులు మాత్రమే వీటిని గుర్తిస్తారు. హాజీ మనుషులు డ్రగ్స్‌ను ఏడు పొరలతో పటిష్టంగా ప్యాక్ చేస్తారు. నీళ్లలో పడ్డా దెబ్బతినకుండా ఈ జాగ్రత్త. ఇలా డ్రగ్స్ సరఫరా, విక్రయంలో హాజీది విలక్షణ శైలి. హాజీ అప్పుగానే డ్రగ్స్ సరఫరా చేస్తాడు. తనకు హవాలా మార్గంలోనే సొమ్ము పంపాలని చెబుతాడు. వ్యాపారానికి శ్రీలంక పడవలు వాడుతుంటాడు. అవి పాక్, ఇరాన్ సముద్ర తీరాల్లో మదర్ షిప్ నుంచి డ్రగ్స్ నింపుకొని రహస్యంగా భారత్‌కు చేరుకుంటాయి. క్వింటాళ్ల కొద్దీ ఉన్న నిల్వను చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి గమ్యానికి తరలిస్తారు.

ఢిల్లీలో పవర్ ప్లే

పదవిపై పట్టువీడని ఇద్దరు నేతలు

- అధిష్టానం పిలుపుతో ఢిల్లీకి సిద్ధూ
- ఆరోగ్య కారణాలతో రాష్ట్రంలోనే డీకే
- ఖర్గే చేతికి ఏఐసీసీ ప్రతినిధుల నివేదిక
- సోనియా, రాహుల్‌తో అధ్యక్షుని చర్చలు
- నేటి సాయంత్రంలోగా తుది నిర్ణయం!

న్యూఢిల్లీ/బెంగళూరు: కర్ణాటక సీఎం అభ్యర్థిని తేల్చేందుకు కాంగ్రెస్ పెద్దలు హస్తినలో మల్లగుల్లాలు పడుతున్నారు. పదవి కోసం మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ తీవ్రంగా తలపడుతుండటంతో రెండు రోజులుగా రాష్ట్రంలో రాజకీయం వేడెక్కడం తెలిసిందే. సీఎల్పీ భేటీలోనూ పీటముడి వీడకపోవడంతో సంప్రదింపుల కోసం వారిద్దరినీ అధిష్టానం హస్తినకు పిలిచింది. దాంతో సిద్ధరామయ్య సోమవారం సాయంత్రమే ఢిల్లీ చేరగా డీకే మాత్రం 'ఆరోగ్య కారణాల'తో బెంగళూరుకే పరిమితమై మరింత సస్పెన్స్‌కు తెర తీశారు. ఢిల్లీ వెళ్తున్నట్టు మధ్యాహ్నం దాకా చెబుతూ వచ్చిన ఆయన చివరికి పర్యటనను రద్దు చేసుకున్నారు. మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్ధరామయ్య వెంటే ఉన్నారన్న వార్తలను మీడియా ప్రస్తావించగా, తాను మొత్తం 135 మంది ఎమ్మెల్యేలకూ నాయకుడినంటూ డీకే నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు సోమవారం ఉదయం బెంగళూరులో డీకే 61వ పుట్టినరోజు వేడుకల్లో సిద్ధరామయ్య కూడా పాల్గొన్నారు. ఆ వెంటనే ఒకరు హస్తినలో, మరొకరు బెంగళూరులో తమ ప్రయత్నాలకు పదును పెడుతూ రాజకీయ వేడిని మరింత పెంచుతున్నారు. అసెంబ్లీ పోరులో పార్టీని కలసికట్టుగా విజయ తీరాలకు చేర్చిన వీరిద్దరిలో ఎవరూ పట్టు వీడకపోవడం, వారి మద్దతుదారులైన ఎమ్మెల్యేలు, నేతలు రెండు శిబిరాలుగా చీలిన నేపథ్యంలో ఈ చిక్కుముడిని అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. అగ్ర నేతలు సోనియా, రాహుల్‌గాంధీలతో చర్చించి మంగళవారం సాయంత్రానికల్లా సీఎం అభ్యర్థిని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖరారు చేస్తారని చెబుతున్నారు. సీఎం అభ్యర్థి ఎంపికకు ఆదివారం రాత్రి పొద్దుపోయేదాకా ముగ్గురు అధిష్టానం ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన సీఎల్పీ భేటీ ఎటూ తేల్చలేకపోవడం, నేతలతో, ఎమ్మెల్యేలతో దూతల విడివిడి చర్చలు, రహస్య బ్యాలెట్ వంటివి ఏ ఫలితమూ ఇవ్వకపోవడంతో అభ్యర్థి ఎంపిక అధికారాన్ని పార్టీ అధ్యక్షునికే కట్టబెడుతూ సీఎల్పీ తీర్మానం చేయడం తెలిసిందే. సీక్రెట్ బ్యాలెట్ బాక్సులతో ఢిల్లీ ప్రతినిధులు సోమవారం ఢిల్లీ చేరారు. ఖర్గేకు పరిస్థితి వివరించడంతో పాటు నివేదిక కూడా అందజేశారు.



సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా సిద్ధరామయ్యకు కేక్ తినిపిస్తున్న డీకే శివకుమార్

సిద్ధూ వర్సెస్ డీకే

కర్ణాటక సీఎం పదవి కోసం తీవ్ర పోటీ

కర్ణాటక నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం రేసులో ప్రధానంగా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ముందంజలో ఉన్నారు. ముఖ్యమంత్రి పదవి కావాలన్న ఆకాంక్షను వారిద్దరూ ఏమాత్రం దాచుకోవడం లేదు. పరస్పరం గట్టిగా పోటీ పడుతున్నారు. అయితే, కాంగ్రెస్ అధిష్టానం మనసులో ఏమున్నదో అంతుబట్టడం లేదు. ఈ నేపథ్యంలో ఇద్దరు నాయకుల బలాలు, బలహీనతలు, వారికి ఉన్న అవకాశాలు ఏమిటో చూద్దాం.. – బెంగళూరు

సిద్ధరామయ్య బలాలు

- మాస్ లీడర్‌గా రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు.
- మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు.
- 2013 నుంచి 2018 పూర్తిస్థాయిలో ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవం.
- ఏకంగా 13 సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. పరిపాలనలో విశేష అనుభవం ఉంది.
- మైనార్టీలు, వెనుకబడిన తరగతులు, దళితుల్లో ఆదరణ.
- బీజేపీ, జేడీ(ఎస్)లను గట్టిగా ఎదుర్కొనే సామర్థ్యం.
- రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు కావడం. రాహుల్ గాంధీ నుంచి లభిస్తున్న అండదండలు.

బలహీనతలు

- కాంగ్రెస్ పార్టీతో సంస్థాగతంగా పెద్దగా అనుబంధం లేకపోవడం.
- 2018లో ముఖ్యమంత్రిగా పనిచేస్తూ కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించలేకపోవడం.
- జేడీ(ఎస్) నుంచి వచ్చిన ఆయన్ను బయటి వ్యక్తిగానే ఓ వర్గం చూస్తుండటం.
- వయసు 75 ఏళ్లు. వృద్ధాప్యం సమీపిస్తుండడం.

అవకాశాలు

- ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపే, అందిరినీ కలుపుకొనేపోయే తత్వం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలవాలంటే సిద్ధూ వంటి అనుభవజ్ఞుడు కావాలని అధిష్టానం భావిస్తుండడం.
- డీకే శివకుమార్‌పై ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు.
- తనకు ఇదే చివరి ఎన్నిక అని సిద్ధూ ప్రకటించినందున మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఇదే చివరి అవకాశం కావడం.

డీకే శివకుమార్ బలాలు

- సుదీర్ఘమైన రాజకీయ అనుభవం. బలమైన సంస్థాగత సామర్థ్యాలు.
- అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం సాధించి పెట్టడం.
- పార్టీ నాయకత్వానికి విధేయుడిగా పేరు.
- కష్ట కాలంలో ట్రబుల్ షూటర్‌గా అందించిన సేవలు.
- పుష్కలమైన ఆర్థిక వనరులు కలిగిన నాయకుడు.
- బలమైన తన సొంత సామాజిక వర్గం ఒక్కళిగల మద్దతు.
- సోనియా కుటుంబంతో సాన్నిహిత్యం.
- వయసు కేవలం 61 ఏళ్లు. ఆరోగ్యం మెరుగ్గా ఉండడం.
- మంత్రిగా శాఖలను నిర్వర్తించిన అనుభవం.

బలహీనతలు

- వెంటాడుతున్న ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు. న్యాయ పోరాటం చేయాల్సి రావడం.
- తిహార్ జైలులో కొన్నిరోజులపాటు శిక్ష అనుభవించడం.
- రాష్ట్రమంతటా కాకుండా పాత మైసూర్‌కే తన ప్రాబల్యం పరిమితం కావడం.
- ఒక్కళిగలు మినహా ఇతర సామాజిక వర్గాల మద్దతు ఆశించిన స్థాయిలో లేకపోవడం.

అవకాశాలు

- పాత మైసూర్‌లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ దక్కడం వెనుక కృషి శివకుమార్‌దే.
- కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతుండడం. ఎస్ఎం కృష్ణ, వీరేంద్ర పాటిల్ పీసీసీ అధ్యక్షులుగా ఉంటూ ముఖ్యమంత్రులయ్యారు.
- కాంగ్రెస్‌లోని పాత తరం నాయకుల ఆశీస్సులు లభిస్తుండడం.



అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమంలో చరఖా తిప్పుతున్న భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం ఆశ్రమాన్ని సందర్శించారు.

అరుదైన అంతరిక్ష శిల అరుదెంచె..

న్యూజెర్సీలో ఇంట్లోకి దూసుకొచ్చిన కాన్‌డ్రైట్ గ్రహ శకలం



న్యూజెర్సీ: సువిశాలమైన అంతరిక్షంలో వింతలు విడ్డూరాలకు అంతు లేదు. మనకు తెలియని ఎన్నెన్నో విశేషాలు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఇతర గ్రహాల నుంచి విడిపోయిన శిలలు సుదీర్ఘంగా ప్రయాణం సాగించి మన భూగోళంపై పడుతుంటాయి. ఇలాంటి శిలల వల్ల భూమిపై భారీ గోతుల్లాంటివి ఏర్పడుతుంటాయి. అత్యంత అరుదైన కాన్‌డ్రైట్ అంతరిక్ష శిల(గ్రహ శకలం) అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో ఓ ఇంటి పై అంతస్తులోని పైకప్పును చీల్చుకొని పడక గదిలోకి దూసుకొచ్చింది. న్యూజెర్సీ రాజధాని ట్రెంటాన్‌కు ఉత్తరాన ఉన్న హోప్‌వెల్ టౌన్‌షిప్‌లో ఇటీవలే మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. ఈ శిల వేగానికి పడక గదిలోని కలప గచ్చు కొంత ధ్వంసమయ్యింది. ఎవరో ఆకతాయిలు రాయి విసిరారని భావించిన ఆ ఇంటి యజమాని సుజీ కాప్ దాన్ని చేతిలోకి తీసుకొని పరిశీలించగా వేడిగా తగిలి చురుక్కుంది. అదొకలోహాన్ని పోలి ఉండడంతో ప్రభుత్వ అధికారులకు సమాచారం చేరవేశారు. అధికారుల సూచన మేరకు 'ద కాలేజ్ ఆఫ్ న్యూజెర్సీ' సైంటిస్టులు రంగంలోకి దిగి, ఆ శిలను ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో క్షుణ్నంగా పరిశీలించారు. అది కాన్‌డ్రైట్ అంతరిక్ష శిలగా నిర్ధారించారు. బంగాళదుంప పరిమాణంలో 6/4 అంగుళాలు, 2.2 పౌండ్ల (దాదాపు ఒక కిలో) బరువు ఉన్నట్లు సైంటిస్టులు చెప్పారు. ఇలాంటి గ్రహశకలం గతంలో భూమిపై పడిన దాఖలాలు పెద్దగా లేవని తెలిపారు. అరుదైన గ్రహ శకలాన్ని పరీక్షించడం అద్భుతమైన అవకాశమని ద కాలేజ్ ఆఫ్ న్యూజెర్సీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ చైర్మన్ నాథన్ మ్యాగీ చెప్పారు. ఈ శిలపై అధ్యయనం ద్వారా ఫిజిక్స్ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని వెల్లడించారు.

కాంగ్రెస్ బలంగా ఉన్న చోట్ల మద్దతిస్తాం

తొలిసారిగా ప్రకటించిన తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ

కోల్‌కతా: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాల ఐక్యత భావనకు తృణమూల్ కాంగ్రెస్ జై కొడుతుందా లేదా అనే ప్రశ్నకు ఎట్టకేలకు సమాధానం లభించింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో తాము మద్దతు ఇస్తామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఐక్యంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకెళ్తాయనే సానుకూలత మరింత పెరిగింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మమత మాట్లాడారు. "కాంగ్రెస్ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో వాళ్లనే పోటీ చేయనిద్దాం. మేం వారికి మద్దతు ప్రకటిస్తాం. ఇందులో తప్పేముంది. ఇదే తరహాలో వేరే నియోజకవర్గాల్లో తోటి రాజకీయ పార్టీలు బలంగా ఉంటే అక్కడ వారికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వాల్సిందే. సీట్ల షేరింగ్ సూత్రం పాటిస్తే బాగుంటుంది. బలమైన ప్రాంతీయ పార్టీలకు సరైన ప్రాతినిధ్యం దక్కాలి. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట కాంగ్రెస్‌కు మద్దతు అందాలంటే ఇతర పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో కాంగ్రెస్ కూడా మద్దతు ఇవ్వాలి. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో వాటికే ప్రాధాన్యమివ్వాలి" అన్నారు.

గురుద్వారాలో మద్యం తాగిందని... మహిళను కాల్చి చంపేశాడు

పటియాలా: పంజాబ్‌లోని పటియాలాలో గురుద్వారాలో మద్యం సేవిస్తోందనే ఆగ్రహంతో ఓ మహిళను ఒక వ్యక్తి కాల్చిచంపాడు. పర్వీందర్ కౌర్ అనే మహిళకు మద్యం అలవాటుంది. డీ-అడిక్షన్ చికిత్స తీసుకుంటోంది. ఆదివారం సాయంత్రం దుఖ్‌నివారణ్ గురుద్వారాకు వచ్చి సరోవరం వద్ద మద్యం తాగడం మొదలుపెట్టింది. అడ్డుచెప్పిన భక్తులపై మద్యం బాటిల్‌తో దాడి చేసింది. ఆమెను వాళ్లు గురుద్వారా మేనేజర్ గదికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను గది బయటకు తీసుకు రాగానే నిర్మల్‌జీత్ సింగ్ సైనా అనే భక్తుడు ఆగ్రహంతో ఊగిపోతూ లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో ఆమెపై గుళ్లవర్షం కురిపించడంతో అక్కడికక్కడే మరణించింది. తర్వాత నిందితుడు రివాల్వర్ పోలీసులకు అప్పజెప్పి లొంగిపోయాడు. కోర్టులో అతడిపై సిక్కు సంఘాల సభ్యులు పూలవర్షం కురిపించారు.

ఖర్గేపై రూ.100 కోట్లకు దావా

సంగ్రూర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై హిందూ సురక్ష పరిషత్ జాతీయ అధ్యక్షుడు హితేశ్ భరద్వాజ్ పంజాబ్‌లోని సంగ్రూర్ కోర్టులో రూ.100 కోట్ల పరువు దావా దాఖలు చేశారు. దీనిపై జూలై 10లోగా వివరణ ఇవ్వాలంటూ ఖర్గేకు న్యాయస్థానం నోటీసు జారీ చేసింది. కర్ణాటకలో అధికారంలోకి వస్తే పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)తో పాటు బజరంగ్ దళ్‌పై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇవ్వడం తెలిసిందే. బజరంగ్ దళ్‌ను అతివాద సంస్థ అయిన పీఎఫ్ఐతో పోల్చి అప్రతిష్ట పాలు చేసేలా హామీ ఇచ్చారని హితేశ్ ఆరోపించారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన ట్రక్కు..26 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికుల వ్యాన్‌ను ట్రక్కు ఢీకొనడంతో 26 మంది చనిపోయారు. తమౌలిపాస్ రాజధాని సియుడాడ్ విక్టోరియా రహదారిపై ఈ ఘోరం జరిగింది. ప్రమాద తీవ్రతకు ట్రక్కు ట్రయిలర్, వ్యానుకు మంటలు అంటుకున్నాయి. మృతులంతా విహార యాత్ర నుంచి తిరిగొస్తున్నారు.

కేజ్రీవాల్ బంగ్లా దర్యాప్తు అధికారికి ఉద్వాసన

న్యూఢిల్లీ: ఢిల్లీలో పాలనాధికారం రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందని సుప్రీంకోర్టు తేల్చిన నేపథ్యంలో ఆప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం కేజ్రీవాల్ అధికార బంగ్లా ఆధునీకరణకు రూ.45 కోట్లు వెచ్చించారన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న విజిలెన్స్ అధికారి, సీనియర్ ఐఏఎస్ రాజశేఖర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దర్యాప్తును విజిలెన్స్ విభాగంలోని ఇతర అసిస్టెంట్ డైరెక్టర్లు పంచుకోవాలని, నివేదికలను నేరుగా విజిలెన్స్ సెక్రటరీకి సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తు మాటున రాజశేఖర్ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజిలెన్స్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ చెప్పారు.

రిటైర్ అవ్వాల్సిన వ్యక్తిని కాను... కొత్త ఇన్నింగ్స్ మొదలుపెడతా

పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎంఆర్ షా ఉద్వేగ ప్రసంగం

వీడ్కోలు కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తో జస్టిస్ ఎంఆర్ షా



న్యూఢిల్లీ: ఇప్పుడే పదవీవిరమణ చేయాల్సిన వ్యక్తిని కాదని, మరో కొత్త ఇన్నింగ్స్ మొదలెడతా అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ముఖేశ్‌కుమార్ రసిక్‌భాయ్(ఎంఆర్) షా సోమవారం వ్యాఖ్యానించారు. భారత సర్వోన్నత న్యాయస్థానంలో నాలుగో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన ఎంఆర్ షా సోమవారం పదవీవిరమణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అధ్యక్షతన సుప్రీంకోర్టు బార్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్ షా ప్రసంగించారు. 'రిటైర్ అవ్వాల్సిన వ్యక్తినికాదు. జీవితంలో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెడతా. కొత్త ఇన్నింగ్స్ ఆడేందుకు సరిపడ ధైర్య, స్థైర్య, ఆయుఃఆరోగ్యాలు ప్రసాదించాలని ఆ భగవంతుని వేడుకుంటున్నాను. రాజ్‌కపూర్ సినిమాలో పాటలోని పదాలు నాకు గుర్తొస్తున్నాయి. రేపు నేను ఆటలో ఉండొచ్చు ఉండకపోవచ్చు. కానీ వినీలాకాశంలో సదా తారనై ఉంటా. పుట్టుక ఇక్కడే. మరణమూ ఇక్కడే' అంటూ ఉద్వేగంతో మాట్లాడారు. 'లాయర్లకు నాదో విన్నపం. అస్తమానం కేసులపై వాయిదాలు కోరకండి. వాదనలకు సిద్ధమై రండి. యువ లాయర్లకు నాదో సలహా బార్ రూమ్‌లోనో, క్యాంటీన్‌లో కాలక్షేపాలొద్దు. కోర్టు హాల్‌లో వాదనలు విని అనుభవం గడించండి' అని అన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడారు. 'ధైర్యం, పోరాట స్ఫూర్తి చూస్తే ఆయనను టైగర్ షా అనాల్సిందే. తర్కంతో ఆలోచించే జ్ఞాని. టెక్నాలజీని త్వరగా ఆకళింపుచేసుకుంటారు. కొలీజియం నిర్ణయాలు తీసుకునేటప్పుడు అద్భుతమైన సలహాలిచ్చారు. నేను అదనపు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా ఉన్నప్పుడు మొదలైన స్నేహం ఆనాటి నుంచీ కొనసాగింది. ఎవరి ఇళ్లల్లో వాళ్లం ఉన్నాసరే ఫోన్‌చేస్తే చాలు ఆయన ఎప్పుడూ కీలకమైన అంశాలపై చర్చిస్తుండేవారు. కోవిడ్ సంక్షోభకాలంలోనూ విధులు నిర్వర్తించాం' అని అన్నారు. 2018 నవంబర్ రెండో తేదీన సుప్రీంకోర్టు జడ్జిగా షా నియమితులయ్యారు. సోమవారం ఆయన రిటైర్‌అవడంతో సుప్రీంకోర్టులో సీజేతో కలిపి మొత్తం జడ్జీల సంఖ్య 32కు పడిపోయింది. ఆదివారం మరో జడ్జి జస్టిస్ దినేశ్ మహేశ్వరి రిటైర్‌కావడం తెల్సిందే. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టులో జడ్జీల గరిష్ట సంఖ్య 34.

జస్టిస్ ఎంఆర్ షా న్యాయ ప్రస్థానం 1982లో గుజరాత్ హైకోర్టులో న్యాయవాదిగా మొదలైంది. 2004 మార్చిలో గుజరాత్ హైకోర్టులో అదనపు న్యాయవాదిగా నియమితులయ్యారు. ఆ తర్వాతి ఏడాది శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2018 ఆగస్టులో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. అదే ఏడాది నవంబర్‌లో పదోన్నతితో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా వచ్చారు.

వైవిధ్యమే భారత్ బలం: మోదీ

న్యూఢిల్లీ: భారతీయులను వైవిధ్యం పట్ల సహజంగా ఉండే ప్రేమే శతాబ్దాలుగా ఐకమత్యంగా ఉంచుతోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌కున్న ఈ విశిష్టతే ప్రపంచం దృష్టిని కూడా ఆకర్షించిందని చెప్పారు. 'భారతదేశం వివిధ వర్గాలు, మతాలు, భాషలు, సంప్రదాయాలకు నెలవు. ఎన్నో సంస్కృతులు, ఆచారాలు, జీవన విధానాలను ఆచరిస్తూనే ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. ఒకరి పండుగలను మరొకరు జరుపుకుంటూ సహజీవనం సాగిస్తున్నారు' అంటూ ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్‌కు చెందిన నజాకత్ చౌధరికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా చౌధరి ఇటీవల అస్సాంలో పర్యటించారు. ఈ పర్యటన తనలో స్ఫూర్తి నింపిందనీ, మరిచిపోని అనుభూతులను మిగిల్చిందంటూ ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖకు ప్రధాని పైవిధంగా బదులిచ్చారు.



నేడు 71 వేల మందికి నియామక పత్రాలు

దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి మోదీ మంగళవారం వర్చువల్ విధానంలో నియామక పత్రాలివ్వనున్నారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ఆయన ఇప్పటిదాకా 2.9 లక్షల మందికి నియామక పత్రాలిచ్చారని కేంద్రం తెలిపింది. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో రోజ్‌గార్ మేళాలను ఏర్పాటు చేయనున్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా గత ఏడాది అక్టోబర్‌లో రోజ్‌గార్ మేళాను ప్రధాని ప్రారంభించారు.

గహ్లోత్‌కు సచిన్ పైలట్ అల్టిమేటం

నెలాఖరులోగా డిమాండ్లు తీర్చకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరిక



జైపూర్: రాజస్తాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ దూకుడు పెంచారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో అవినీతిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలన్న తన డిమాండ్‌ను ఈ నెలాఖరులోగా నెరవేర్చకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామంటూ సొంత పార్టీకే చెందిన సీఎం అశోక్ గహ్లోత్‌కు అల్టిమేటం జారీ చేశారు. ఈ డిమాండ్ సాధనలో భాగంగా ఆయన చేపట్టిన ఐదు రోజుల పాదయాత్ర సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తన మద్దతు దారులైన 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో జైపూర్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఆర్‌పీఎస్‌సీ)ని రద్దు చేసి, పునర్వ్యవస్థీకరించాలని, పేపర్ లీక్‌తో పరీక్షలను రద్దు వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్న రెండు కొత్త డిమాండ్లను వినిపించారు. నెలాఖరులోగా చర్యలు తీసుకోకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సాక్షి హైదరాబాద్


మంగళవారం ı 16 ı మే ı 2023

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో...

నిందితురాలికి బెయిల్

చంచల్‌గూడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రం లీక్ చేసిన కేసులో అరెస్ట్ అయిన నిందితులు చంచల్‌గూడ జైల్లో ఉన్న విషయం విదితమే. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న టీఎస్‌పీఎస్సీ ఉద్యోగి షమీమ్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సోమవారం ఆమె జైలు నుంచి విడుదలైంది.

భారీగా బంగారం పట్టివేత



శంషాబాద్: మస్కట్ నుంచి విమానంలో వచ్చిన మహిళా ప్రయాణికురాలి నుంచి కస్టమ్స్ అధికారులు సోమవారం 1.476 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సీటు సమీపంలో ఉన్న శానిటరీ ప్యాడ్స్‌లో దాచి బంగారం తీసుకువస్తుండగా అనుమానించి తనిఖీ చేశారు. దీని విలువ రూ.77.90 లక్షలు ఉంటుందని నిర్ధారించారు.

ఆర్టీఏలో నాగచైతన్య



సాక్షి, సిటీబ్యూరో: సినీ నటుడు అక్కినేని నాగచైతన్య సోమవారం ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ కోసం ఆయన ఇక్కడికి వచ్చారని, నిబంధనల మేరకు ఆయనకు డ్రైవింగ్ పర్మిట్‌ను అందజేసినట్లు ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్ పేర్కొన్నారు.









మీనాలు.. ఎన్నెన్నో వర్ణాలు!

విభిన్న రకాల చేపలు.. సముద్రంలో మాత్రమే కనిపించే వైవిధ్యభరితమైన మీనాలు.. ఇంద్రధనుస్సును తలపించే.. మైమరిపించే వర్ణాలు.. నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటుచేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాలో ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్ అక్వేరియం అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రధానంగా చిన్నారులు ఫిదా అవుతున్నారు. అంగుళం నుంచి మొదలుకొని 5 అడుగుల పొడవు వరకు ఉన్న చేపలను ఇక్కడ నేరుగా చూసేందుకు నగర వాసులు క్యూ కడుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటే చేసిన ఫిష్ టన్నెల్ నుంచి నడుచుకుంటూ వెళ్తూ సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. ఈ తరహా అక్వేరియంలను ఏర్పాటు చేయడం నెక్లెస్ రోడ్డులో ఇదే మొదటిసారి కావడంతో నగరం నలు మూలల నుంచి విచ్చేసిన సందర్శకులు ఎంతో ఉత్సాహంగా రంగు రంగుల చేపల్ని తిలకిస్తున్నారు. 500 వందలకు పైగా రకాల చేపల్ని ఇక్కడ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

– ఖైరతాబాద్

న్యూస్‌రీల్

దడ పుట్టిస్తున్న భగభగలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడి భగభగలు దడ పుట్టిస్తున్నాయి. రోహిణి కార్తె సమీపిస్తుండటంతో ఎండల తీవ్రత మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. సోమవారం 20 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు తీవ్ర ప్రభావం చూపాయి. మరో నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీలుగా నమోదైంది. ఖైరతాబాద్ గణాంక భవన్ వద్ద అత్యధికంగా 40.8 డిగ్రీలు, సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ వద్ద 40.7, గచ్చిబౌలిలో 40.6, పాటిగడ్డ చిలకలగూడ, మోండా మార్కెట్‌లో 39.9 షాపూర్ నగర్‌లో 39.9, గుడిమల్కాపూర్, బన్సీలాల్‌పేట్, మెహిదీపట్నం, జీడిమెట్లలో 39.7, ఉస్మానియా యూనివర్సిటీలలో 39.6 డిగ్రీలు నమోదయ్యాయి. ఎండల తీవ్రత కారణంగా మూడు రోజులుగా విద్యుత్ డిమాండ్ 20 శాతం మేరకు పెరిగింది.

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యమివ్వాలి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 21 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా సూర్యలత మాట్లాడుతూ.. వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు సమర్పించే దరఖాస్తులపై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరిస్తే బాగుంటుందని సూచించారు. అవసరమైన వాటిని ఉన్నతాధికారుల దష్టికి తీసుకు వెళ్లేవాటిని జాప్యం చేయకుండా తక్షణమే నివేదించి వాటిని సైతం పరిష్కరించాలని సూచించారు.

పఠనంతో సమగ్ర అవగాహన: గవర్నర్ తమిళిసై



విద్యార్థితో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

పంజగుట్ట: విద్యార్థులు చిన్నప్పటి నుండే చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని, పఠనం వివిధ సమస్యలపై సమగ్ర దృక్పథాన్ని ఇస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. సోమవారం రాజ్‌భవన్ సంస్కృతి హాల్‌లో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీడ్ ఇండియా–లీడ్ ఇండియా' ప్రచారాన్ని ఆమె ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదవడం ఎంతో ప్రయోజనాన్ని ఇస్తుందని గవర్నర్ తెలిపారు. తన విద్యార్థి రోజులను గుర్తుచేసుకుంటూ తన తండ్రి స్వామి వివేకానంద, తమిళ కవి భారతీయార్ పుస్తకాలను బహుమతిగా ఇచ్చేవారని గుర్తుచేసుకున్నారు. ఆ పుస్తకాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయన్నారు. ప్రతి రోజూ గంట చదివే అలవాటు తనకు ఇప్పటికీ ఉందన్నారు. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఒక బుక్ రూం ఉండాలని అభిప్రాయపడ్డారు. పుస్తక పఠనం జ్ఞానాన్ని పొందేందుకు, సమాజంలో సంస్కరణలు తెచ్చేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని అందించారు.

ఔరా! ఏమీ ఎసరు?



వార్డు కార్యాలయాలుగా మారనున్న కమ్యూనిటీహాళ్లల్లో కొన్ని..

వార్డు	కమ్యూనిటీహాల్
వనస్థలిపురం	ఎఫ్‌సీఐ కాలనీ కమ్యూనిటీ హాల్
లింగోజిగూడ	ఎస్‌బీహెచ్ వెంచర్– 3 కమ్యూనిటీ హాల్
హస్తినాపురం	ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్ –2 కమ్యూనిటీ హాల్
సైదాబాద్	జాకీర్ హుస్సేన్ కమ్యూనిటీ హాల్
వెంగళ్రావునగర్	వీడియో గల్లీ కమ్యూనిటీ హాల్
బోరబండ	బంజారానగర్ కమ్యూనిటీ హాల్
రామ్నాస్‌పురా	టీఎన్‌కే కాలనీ కమ్యూనిటీ హాల్
కిషన్‌బాగ్	కిషన్‌బాగ్‌పార్క్ కమ్యూనిటీ హాల్

◆ మైలార్‌దేవ్‌పల్లిలో టీఎస్‌జీఓస్ కాలనీ మోడల్‌మార్కెట్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.

బల్దియా వార్డు కార్యాలయాలుగా మారనున్న కమ్యూనిటీ హాళ్లు

- మోడల్‌మార్కెట్లు, షాపింగ్, స్పోర్ట్స్ కాంప్లెక్సులు సైతం
- రూ. 3–5 లక్షల వరకు వ్యయంతో మరమ్మతులు
- బస్తీల్లోని పేదల సమావేశాలకు ఇక తిప్పలే



వార్డు కార్యాలయంగా మారనున్న ఓ కమ్యూనిటీ హాల్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలోని కమ్యూనిటీ హాళ్లు ఇక వార్డు కార్యాలయాలుగా మారనున్నాయి. జూన్ నుంచి వార్డు ఆఫీసర్ల పాలనను అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో చాలా వరకు కమ్యూనిటీ హాళ్లనే వార్డు కార్యాలయాలుగా మార్చనున్నారు. పారిశుధ్య, మురుగునీరు, విద్యుత్, రోడ్ల మరమ్మతులు, మ్యాన్ హోళ్లు, క్యాచ్‌పిట్లకు మూతలు వంటి చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సర్కిల్ కార్యాలయాల దాకా వెళ్లకుండా వార్డుస్థాయిలోనే పరిష్కరించాలన్న మంత్రి కేటీఆర్ ఆదేశాలకనుగుణంగా ఈ నెలాఖరులోగా వార్డు కార్యాలయాల ఏర్పాటు కోసం భవనాలను సిద్ధం చేస్తున్నారు. వీటిలో చాలా వరకు ఆయా వార్డుల్లోని కమ్యూనిటీ హాళ్లనే వార్డు కార్యాలయాలుగా మార్చేందుకు సిద్ధమయ్యారు. జీహెచ్ఎంసీలో ఇప్పటికే ఉన్న వార్డు కార్యాలయాల్లో కొత్తగా ఏర్పాటు చేయబోయే వార్డు ఆఫీసులకు యోగ్యంగా ఉంటే వాటినే వార్డు కార్యాలయాలుగా మార్చనున్నారు. వీటితోపాటు కమ్యూనిటీ హాళ్లను ఎంపిక చేశారు. కమ్యూనిటీ హాళ్లు కూడా లేని ప్రాంతాల్లో మోడల్ మార్కెట్లలోని మడిగెలు, షాపింగ్ కాంప్లెక్సులు, స్పోర్ట్స్ కాంప్లెక్సుల్లోని దుకాణాలను సైతం వార్డు కార్యాలయాలుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని వార్డు కార్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు మరమ్మతుల కోసం ఒక్కో కమ్యూనిటీ హాల్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు.

పేదలకు ఇబ్బందులు..

పాతబస్తీతో పాటు కోర్‌సిటీలోని కొన్నిసర్కిళ్లలో బస్తీల్లోని కమ్యూనిటీ హాళ్లు సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళల సమావేశాలకు, బస్తీ ప్రజలకు సంబంధించిన చిన్న ఫంక్షన్లకు, సమావేశాలకు ఉపయోగపడుతున్నాయి. వ్యాక్సినేషన్ కేంద్రాలుగానూ వినియోగిస్తుండటమే కాక కొన్ని కమ్యూనిటీ హాళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, జిమ్ కేంద్రాలు వంటివి ఉన్నాయి. బస్తీల్లోని పేదలకు కమ్యూనిటీ హాళ్లు అంతో ఇంతో ఉపకరిస్తున్నాయని, ఇప్పుడు వాటిల్లోనే వార్డు కార్యాలయాలు ఏర్పాటుచేస్తే తమకు ఇబ్బందులెదురవుతాయని కొన్ని బస్తీల ప్రజలు చెబుతున్నారు. వీటి ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. సైదాబాద్ కమ్యూనిటీ హాల్‌లో వార్డు ఆఫీసు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలు స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో అక్కడ వార్డు ఆఫీసు ఆలోచన విరమించుకున్నారు.

స్థానిక నేతల చేతుల్లో..

జీహెచ్ఎంసీలోని కమ్యూనిటీ హాళ్లన్నీ స్థానిక రాజకీయనేతలు, ఆయా అసోసియేషన్ల గుప్పిట్లోనే ఉన్నాయి. వాటి తాళాలు సైతం వారి వద్దే ఉన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులకు వాటిపై ఎలాంటి అజమాయిషీ లేదు. నిర్వహణను సైతం పట్టించుకోవడం లేదు. వాటిల్లో కొన్ని కమ్యూనిటీ హాళ్లను ఆయా సంఘాల వారు ఫంక్షన్ హాళ్లుగా మార్చి అద్దెలకిచ్చుకుంటున్నా, జీహెచ్ఎంసీకి నయాపైసా రావడం లేదు. పేదలకు ఉపయోగపడుతున్నవి కాకుండా కొందరు నేతల కబంధహస్తాల్లో ఉన్న కమ్యూనిటీ హాళ్లను వార్డు కార్యాలయాలుగా మారిస్తే ప్రజలకు స్థానికంగా సేవలతోపాటు వారి కబంధ హస్తాలనుంచి సదరు భవనాలకు విముక్తి లభిస్తుందని చెబుతున్న వారూ ఉన్నారు.

ఇతర భవనాలు లేకే..

సమయం దగ్గర పడుతుండటం, ఇతరత్రా భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు సదుపాయంగా ఉండే కమ్యూనిటీ హాళ్లనే వార్డు కార్యాలయాలుగా మారుస్తున్నాం. ప్రజలకు రవాణా సదుపాయం, పార్కింగ్ వంటి వాటిని దృష్టిలో ఉంచుకొనే వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాం.

– జీహెచ్ఎంసీ అధికారులు

కలిసి బతకలేమని.. కడకు ఊపిరి తీసుకుని..

కేపీహెచ్‌బీలో యువతి, యువకుడి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణమంటున్న పోలీసులు



జ్యోతి (ఫైల్)



శ్యామ్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ యువతి, యువకుడి ఆత్మహత్య విషాదాన్ని నింపింది. ఇద్దరి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో సోమవారం ఈ ఘటన వెలుగుచూసింది. సీఐ కిషన్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలోని గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ఆకుల శ్యామ్ (24), పోతుల జ్యోతి (22) సమీప బంధువులు. మూడేళ్ల క్రితం జ్యోతికి వివాహమైంది. కొద్ది రోజులకే భర్త నుంచి ఆమె విడిపోయింది. ఈ క్రమంలో గత నెల జ్యోతి నగరానికి వచ్చి కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. జ్యోతికి శ్యామ్‌తో అప్పటికే స్నేహం, ప్రేమ నేపథ్యంలో అతను కూడా ఇటీవల నగరానికి వచ్చాడు. కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని 7వ ఫేజ్ ఎల్‌ఐజీ గృహంలో ఉంటున్నాడు.

స్నేహితుడి ఇంటి తాళాలు తీసుకుని..

శ్యామ్ స్నేహితుడు వంశీకి ఈ నెల 20న వివాహ నిశ్చితార్థం ఉండటంతో 9న ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. శుక్రవారం వంశీ ఇంట్లో లేకపోవటంతో శ్యామ్ అతనికి ఫోన్ చేసి ఇంటి తాళాలు తీసుకున్నాడు. అనంతరం హాస్టల్‌లో ఉంటున్న జ్యోతిని ఇదే ఇంటికి పిలిపించుకున్నాడు. ఇద్దరి నడుమ గత ప్రేమానుబంధాలతో పాటు ఇరు కుటుంబ పెద్దల వ్యతిరేకత నేపథ్యంలో కలిసి బతకలేమనుకున్నారు. దీంతో శ్యామ్ ఉరి వేసుకొని, జ్యోతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.



గదిలో జ్యోతి, శ్యామ్ మృతదేహాలు

ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో..

మాదాపూర్‌లో ఉంటున్న జ్యోతి సోదరుడు ఆమెకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటంతో హాస్టల్‌కు వచ్చి చూశాడు. హాస్టల్‌లో జ్యోతి లేకపోవటంతో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని స్నేహితుడైన వంశీ ఇంటికి వెళ్లి చూడగా తలుపులు లోపల నుంచి గడియ పెట్టి ఉంది. ఇంట్లోంచి దుర్వాసన రావటంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపు గడియ పగుల గొట్టి లోనికి వెళ్లి చూడగా గదిలో శ్యామ్ ఉరివేసుకొని, జ్యోతి పురుగుల మందు తాగి విగతజీవులుగా కనిపించారు. ఇరువురి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమై ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సా..గుతున్న సుందరీకరణ

సాక్షి, సిటీబ్యూరో: సచివాలయ ప్రాంగణమే కాదు.. పరిసరాలను సైతంఅందంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులను అప్పట్లో ప్రారంభించారు. తెలుగుతల్లి చౌరస్తా నుంచి పీవీ విగ్రహం వరకు నెక్లెస్‌రోడ్డు మార్గంలో అటు పీపుల్స్ ప్లాజా వైపు సంజీవయ్య పార్కు వరకు హెచ్ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుందరీకరణ ప్రాజెక్టు అది. ఇప్పుడు నత్తను తలపిస్తోంది. సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎంతో హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఫుట్‌పాత్ విస్తరణ, ఎత్తు పెంచడం కోసం రోడ్లను తవ్వేశారు. మరోవైపు సందర్శకుల తాకిడితో ఈ మార్గంలో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. సెక్రటేరియట్ ప్రారంభోత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని తెలుగుతల్లి చౌరస్తా నుంచి అమోఘ్ రెస్టారెంట్ వరకు మాత్రం ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేసి వదిలేశారు. ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన పనుల్లోని జాప్యం తీరు ఇది.

చెట్లు మాత్రం పెట్టారు..

ప్రస్తుతం ట్యాంక్‌బండ్‌పై ఉన్నట్లుగా ఫుట్‌పాత్‌ల ఎత్తు పెంచి సందర్శకులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసి నెక్లెస్‌రోడ్డు వాతావరణాన్ని ఆహ్లాదంగా మార్చేందుకు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా తెలుగుతల్లి చౌరస్తా నుంచి పీవీ విగ్రహం వరకు, అక్కడి నుంచి సంజీవయ్య పార్కు వరకు సుమారు 4 కిలోమీటర్లు బ్యూటిఫికేషన్ చేయాల్సి ఉంది. పేవ్‌మెంట్‌పై పచ్చికను పెంచి 200 చెట్లను నాటాలని నిర్ణయించారు. అందమైన విద్యుద్దీపాల స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కొన్ని చెట్లను మాత్రం నాటారు. అమోఘ్ రెస్టారెంట్ వరకు మాత్రం ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేశారు. మిగతా మార్గంలో తవ్వకాలకే పరిమితం కావడం గమనార్హం.

ఫ్లోటింగ్ ఫౌంటెన్ తరలింపులోనూ జాప్యమే..

లుంబిని పార్కు వద్ద సాగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ ఫౌంటెన్ తరలింపులోనూ జాప్యం నెలకొంది. అప్పట్లో ఫార్ములా–ఈ పోటీలను దృష్టిలో ఉంచుకొని రూ.7 కోట్లతో ఏర్పాటు చేసిన ఫౌంటెన్‌ను పీపుల్స్‌ప్లాజా వైపు తరలించాలని నిర్ణయించారు. దీనివల్ల నెక్లెస్‌రోడ్డులో భారీగా ట్రాఫిక్ రద్దీ నెలకొనడంతో పాటు హుస్సేన్‌సాగర్‌లోని మురుగునీరు ఫౌంటెన్‌ల ద్వారా రోడ్డుపై, వాహనదారులపై వర్షంలా పడడంతో చాలా ఇబ్బందిగా మారింది. మరోవైపు సెక్రటేరియట్ ప్రారంభోత్సవం అనంతరం పెరగనున్న ప్రముఖుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని దానిని మరోచోటికి మార్చాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఫౌంటెన్ వినియోగంలో లేకపోయినా లుంబిని పార్కు నుంచి మాత్రం తరలించలేదు.

పెరిగిన సందర్శకుల తాకిడి...

ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు వైపు సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. కొత్త సెక్రటేరియట్‌ను, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని వీక్షించేందుకు ప్రతి రోజు భారీ సంఖ్యలో జనం తరలి వస్తున్నారు. వేసవి సెలవులు కావడంతోనూ సందర్శకుల తాకిడి పెరిగింది. వీకెండ్స్‌లో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది. సెక్రటేరియట్ వద్ద, అంబేడ్కర్ విగ్రహం వద్ద సెల్ఫీలు తీసుకొనేందుకు పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. ఒకవైపు సందర్శకుల రద్దీ, మరోవైపు ఇరుకైన రోడ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి పనుల్లో జాప్యం వల్ల ప్రతి రోజు ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది.

నెక్లెస్ రోడ్డులో రూ.9 కోట్లతో హెచ్ఎండీఏ పనులు

- సెక్రటేరియట్ ప్రారంభ సమయంలో హడావుడి
- పనుల్లో జాప్యంతో నరకప్రాయమైన ట్రాఫిక్
- అంబేడ్కర్ విగ్రహం, సచివాలయానికి సందర్శకుల తాకిడి

నెక్లెస్ రోడ్డులో నత్త నడకన సుందరీకరణ పనులు



సిక్సర్.. సక్సెస్.. నిద్ర ఉంటేనే..

కంటి కునుకుతో మానసిక, శారీరక ఒత్తిడి దూరం

- అండర్ -19లో కాస్తంత నిర్లక్ష్యంతో ఇబ్బందిపడ్డా
- 25 ఏళ్ల వయసు నుంచి ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తున్నా
- డ్యూరోఫ్లెక్స్ సమావేశంలో క్రికెటర్ విరాట్ కోహ్లి మనోగతం



సాక్షి, సిటీబ్యూరో: మానసిక ప్రశాంతతకైనా.. శారీరక విశ్రాంతికైనా నిద్ర చాలా అవసరం. ముఖ్యంగా ప్రొఫెషనల్ అథ్లెట్లకు, క్రీడాకారుల భవిష్యత్ సజావుగా సాగడానికి సంపూర్ణమైన నిద్ర అతి ప్రామాణికమని ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లి వ్యాఖ్యానించారు. ఫిట్‌నెస్, నిద్రకు చాలా ప్రాముఖ్యతనిచ్చే విరాట్ కోహ్లీని ప్రముఖ స్లీప్ సొల్యూషన్స్ ప్రొవైడర్ 'డ్యూరోఫ్లెక్స్' బ్రాండ్ అంబాసిడర్‌గా కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన సోమవారం హోటల్ తాజ్‌కృష్ణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విరాట్ కోహ్లి నిద్ర, ఫిట్‌నెస్‌తో పాటు తన క్రికెట్ కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర అంశాలపై మాట్లాడారు. కోహ్లి ఏమన్నారంటే..

నైట్ పార్టీకెళ్లా.. ఔటయ్యా..

◆ ప్రొఫెషనల్ కెరీర్ అయినా, ప్రియమైనవారితోనైనా ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని కొనసాగించాలంటే సరిపడా నిద్ర చాలా అవసరం. ఈ విషయంలో నేను చాలా జాగ్రత్తలు తీసుకుంటాను. తగినన్ని గంటలు విశ్రాంతి తీసుకోవడమే కాదు.. డీప్ స్లీప్ అంటే నాకిష్టం. నేను అండర్–19 ఆడుతున్నప్పుడు ఒక రోజు కోల్‌కతాలో నైట్ పార్టీకి వెళ్లాను. అది పూర్తి చేసుకుని వచ్చేసరికి తెల్లవారుజామున 6 గంటలైంది. 7 గంటలకు మ్యాచ్ మొదలైంది. కేవలం 20 నిమిషాలే నిద్రపోయిన నేను బ్యాటింగ్‌కు వెళ్లిన లంచ్ లోపే ఔటయ్యాను. అప్పుడు నిద్ర విలువ తెలిసొచ్చింది. నాకు 25 ఏళ్ల ఉన్నప్పటి నుంచి అనుకుంటా.. ఫిట్‌నెస్‌కు, నిద్రకు చాలా ప్రాముఖ్యతనిస్తున్నా.

◆ వన్డేలు లేదా టెస్ట్ క్రికెట్ ఆడుతున్నప్పుడు పగటిపూట నిద్రపోవడం సాధ్యం కాదు. రోజంతా నిద్రపోయే అవకాశం ఉండదు. ప్రస్తుతం నేను సాయంత్రం సమయంలో జరిగే 20–20 ఆడుతున్నాను. కాబట్టి మధ్యాహ్నం నిద్రపోవడం ప్రారంభించాను, ఇది రీసెట్ లాంటిది. ఈ కునుకుతో తాజాగా, ఎనర్జిటిక్ మారిపోతాను. ఈ అలవాటు ఎన్నో సార్లు గాయాలైనప్పుడు కూడా త్వరగా కోలుకునేలా చేసింది. ప్రశాంతమైన ఆరోగ్యం కోసం మెడిటేషన్ చేస్తాను. మ్యూజిక్ వింటాను. ఒత్తిడి నుంచి బయటపడటానికి ఇలాంటి విషయాలను జీవితంలో భాగంగా చేసుకున్నాను.

పోలీస్ శాఖకు అధిక నిధులు కేటాయించాం

- కార్పొరేట్ స్థాయిలో పోలీస్ సేవలు
- సీఎం కేసీఆర్ చొరవతోనే ఈ చర్యలు
- హోం మంత్రి మహమూద్ అలీ



నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభించిన అనంతరం పోలీసుల సేవలను తెలుసుకుంటున్న మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, డీజీపీ అంజనీకుమార్, కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు

జియాగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీస్ శాఖకు అత్యధికంగా నిధులు కేటాయించగా పోలీస్‌స్టేషన్లు కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకొని ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నాయని హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. సోమవారం జియాగూడలోని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని ఆయన మరోమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ పోలీసుల సేవలను కొనియాడారు. నగరంలో తొమ్మిది కమిషనరేట్లు పనిచేస్తున్నాయని, శాంతి భద్రతలు సక్రమంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అతి త్వరలో ఛేదిస్తూ కట్టడి చేస్తున్నారన్నారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ నగరంలో పోలీస్‌స్టేషన్లు సిటిజన్ ఫ్రెండ్లీ పోలీస్‌స్టేషన్లుగా పనిచేస్తున్నాయన్నారు. డయల్ 100కు ఫోన్ చేసిన వెంటనే 15 నిమిషాలలోపు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుంటున్నారన్నారు. 65 శాతం సీసీ కెమెరాలు ఉండడం వల్ల పిల్లలకు, మహిళలకు భద్రత ఏర్పడిందన్నారు. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, పోలీస్ హౌసింగ్ సంస్థ చైర్మన్ కోలేటి దామోదర్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌లు పాల్గొని భవనంలోని పలు కార్యాలయాలను ప్రారంభించారు. నగర కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం పోలీస్‌స్టేషన్లను అన్ని హంగులతో ఏర్పాటు చేయడం వల్ల సేవలు మెరుగవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్, సౌత్‌వెస్ట్ డీసీపీ కిరణ్ ఖారే, వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ, గోషామహల్ ఏసీపీ సతీష్‌కుమార్, శాంతి సంఘం సభ్యులు దర్పల్లి నర్సిములు, రాజేందర్‌ప్రసాద్ జైస్వాల్, రాజేందర్ కుమార్, ప్రేమ్‌కుమార్, కావూరి వెంకటేష్, నర్మద, ఎస్ఐలు శేఖర్, వేణుగోపాల్, కె.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కాప్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



మాట్లాడుతున్న ట్రాఫిక్ చీఫ్ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి సిటీ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంప్‌ను ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు సోమవారం ప్రారంభించారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ..ఏటా దేశం వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య యుద్ధాల్లో మరణిస్తున్న వారి కంటే ఎక్కువగా ఉందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఒక్కరూ కచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలని, చిన్నారులు తమ కుటుంబీకులు, స్నేహితులకు వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ క్యాంప్‌లో 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్కులైన విద్యార్థినీవిద్యార్థులకు డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్, కార్టూన్స్, చేతి రాత మెరుగుపరుచుకోవడం, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీ, సెల్ఫ్ డిఫెన్స్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇవి జరుగనున్నాయి.

పాత కక్షలతోనే రియల్టర్ హత్య

- వివరాలు వెల్లడించిన కీసర పోలీసులు
- నిందితుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులు

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి ఆర్‌టీసీ కాలనీలో ఈ నెల 11న జరిగిన రియల్టర్ అశోక్‌కుమార్ అలియాస్ అశప్ప హత్యకు పాత కక్షలే కారణమని మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ , కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ రఘువీర్‌రెడ్డిలు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం వారు ఇక్కడ విలేకరుల సమావేశం నిర్వహించారు. అశప్పను ఆరుగురు వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి చంపారన్నారు. నారాయణపేట జిల్లా అభంగాపూర్ గ్రామానికి చెందిన అశప్పకు ఏ1 నిందితుడు బురిడి విజయ్‌కుమార్ కుటుంబంతో 25 ఏళ్లుగా పాత కక్షలున్నాయని తెలిపారు. 1999లో అశప్ప..విజయ్‌కుమార్ ఇంటిపై బాంబులు విసరడంతో కుటుంబ సభ్యులు గాయపడ్డారని తెలిపారు. ఆ తర్వాత 2001 నుండి 2004 వరకు అశప్ప తన అనుచరులతో కలిసి విజయ్‌కుమార్ బాబాయ్‌తోపాటు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులను హత్య చేశాడని, దీంతో అప్పటి నుంచే అశప్పను ఎలాగైనా అంతమొందించాలని విజయ్‌కుమార్ కక్షగట్టాడని చెప్పారు. 2019లో ఓసారి దాడిచేయగా అశప్ప తప్పించుకున్నాడు. విజయ్ కుమార్ నుండి తనకు ప్రాణహాని ఉందని పసిగట్టిన అశప్ప తన కుటుంబంతో సహా మకాంను హైదరాబాద్‌కు మార్చాడు. శత్రువులకు ఆచూకీ దొరక్కుండా వివిధ ప్రాంతాల్లో నివసిస్తూ వస్తున్నాడు. గత మూడేళ్ల నుంచి రాంపల్లి ఆర్టీసీ కాలనీ సమీపంలో సొంత ఇల్లు కట్టుకుని ఉంటుండగా...విజయ్‌కుమార్ విషయం తెలుసుకుని అశప్పను హత్య చేసేందుకు పథకం పన్నాడు. అభంగాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుండి 4 వేట కొడవళ్లు కొనుగోలు చేశాడు. మూడు నెలల క్రితం దమ్మాయిగూడలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ తమ కుటుంబ సభ్యులు, అనుచరులు బుర్జుకాడి ఆంజనేయులు, బుర్జుకాడి లింగప్ప, కిచ్చి నగేష్, కిచ్చివెంకటేష్, గంజి శరత్‌కుమార్‌ల సహాయంతో పథక రచన చేశాడు. మొదట ఈ నెల 5, 10వ తేదీల్లో రెక్కీ జరిపాడు. 11న రాత్రి 7.40 గంటలకు వీరంతా కలిసి అశప్పను వేటకొడవళ్లతో నరికి చంపారు. ఈ హత్య సంచలనం కావడంతో సవాలుగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ జరిపారు. ఈ మేరకు ప్రధాన నిందితుడు బురిడి విజయ్‌కుమార్‌తో పాటు మిగతా వారంతా వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి సిద్ధమవుతున్నారన్న విషయం తెలుసుకుని..కాపుకాసి సోమవారం వారిని పట్టుకొని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 4 వేటకొడవళ్లు, 5 సెల్‌ఫోన్లు, కారు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

పది శాతం మంది కటకటాల్లోకే!

- జనవరి–ఏప్రిల్ మధ్య 13,431 డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులు
- వీరిలో 1317 మందికి జైలు శిక్ష విధించిన న్యాయస్థానం



ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కుతున్న 'నిషా'చరుల్లో దాదాపు పది శాతం మంది జైలుకు వెళ్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 14,877 మందిపై అభియోగపత్రాలు దాఖలు చేయగా... 1317 మందికి జైలు శిక్ష పడిందని ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు సోమవారం వెల్లడించారు. ట్రాఫిక్ పోలీసులు దాఖలు చేసిన అభియోగపత్రాలను పరిశీలించిన న్యాయస్థానం మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కిన వారికి ఒక రోజు నుంచి 60 రోజుల వరకు శిక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటన ప్రకారం... ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ల్లో 13,431 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరితో పాటు గతంలో ఈ తరహాలో చిక్కిన వారితో కలిపి మొత్తం 14,877 మందిపై న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారు. మద్యం తాగిన మోతాదు, నడిపిన వాహనం సహా వివిధ అంశాలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం వీరిలో 1317 మందికి జైలు శిక్ష, జరిమానా... మిగిలిన వారికి జరిమానా విధించింది. జైలుకు వెళ్లిన వారిలో ఒకరికి 60 రోజులు, మరోకరికి 30 రోజులు, 24 మందికి 15 నుంచి 20 రోజులు, 55 మందికి 10 నుంచి 14 రోజులు, 565 మందికి 5 నుంచి 9 రోజులు, 671 మందికి నాలుగు నుంచి ఒక రోజు చొప్పున శిక్ష పడింది. వీరిలో 243 మంది డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇద్దరివి మూడేళ్లు, ఐదుగురివి రెండేళ్లు, 15 మందివి ఏడాదిన్నర, 52 మందివి ఏడాది, మరో ఇద్దరివి తొమ్మిది నెలలు, 26 మందివి ఎనిమిది నెలలు, 83 మందివి ఆరు నెలలు, నలుగురివి మూడు నెలలు, ఒకరిది రెండు నెలలు చొప్పున సస్పెండ్ అయ్యాయి. ఈ మొత్తం అందరు 'నిషా' చరులకు కలిపి న్యాయ స్థానం రూ.3.2 కోట్ల జరిమానా విధించింది. ప్రతి ఒక్కరికీ గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. జైలు శిక్ష పడిన వారిని చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కి జైలుకు వెళ్లిన వారికి భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్టులు రావడం, వీసా క్లియరెన్స్‌లు పొందడం కష్టమవుతుందని సుధీర్‌బాబు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గించే లక్ష్యంతోనే ఈ ప్రత్యేక డ్రైవ్స్ చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

సిక్కులకు అండగా మైనార్టీ కమిషన్



సాక్షి, సిటీబ్యూరో: సిక్కు సమాజానికి మైనార్టీ కమిషన్ అండగా ఉంటుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ భరోసా ఇచ్చారు. కిషన్‌బాగ్ సిక్ చావనీలో జరిగిన సిక్కుల సామూహిక వివాహాల మహోత్సవానికి హాజరైన ఆయన..కొత్త జంటలను ఆశీర్వదించారు. ఏటా సిక్కు సమాజంలో సామూహిక వివాహాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమలంలో సిక్కు మత పెద్దలు భగేందర్ సింగ్, జోగేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కెన్నాబిడోల్‌కు సీడీఎస్‌సీఓ అనుమతి

సాక్షి, సిటీబ్యూరో: న్యూరో డిజార్డర్స్ చికిత్సలో ప్రముఖంగా ఉపయోగించే ఫార్మా ఉత్పత్తి కెన్నాబిడోల్‌కు దేశంలో మొదటిసారిగా సీడీఎస్‌సీఓ అనుమతి లభించిందని నగరానికి చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రతినిధులు వెల్లడించారు. తమ అనుబంధ సంస్థ జెనారా ఫార్మా ఆధ్వర్యంలో నగరంతో పాటు విశాఖపట్నంలో అత్యాధునిక సౌకర్యాల మధ్య ఉత్పత్తి చేసిన కెన్నాబిడోల్ ఓరల్ సొల్యూషన్ 100ఎంజీ/ఎంఎల్‌కు ఈ అనుమతి లభించిందని బయోఫోర్ సీఈఓ డాక్టర్ జగదీష్ బాబు రంగిశెట్టి పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు అరెస్ట్



అరెస్టయిన బాలశౌరి రెడ్డి

ఆల్వాల్: ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఆల్వాల్ పోలీసులు, మేడ్చల్ జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆల్వాల్ హిల్స్ కాలనీకి చెందిన బాలశౌరిరెడ్డి గత కొంత కాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ విషయంపై సమాచారం అందడంతో పోలీసులు అతడు నివాసం ఉంటున్న ఫ్లాట్‌పై దాడి చేశారు. ఈ మేరకు రూ.15 లక్షలు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్‌ద్వారా మరో రూ.17 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు.

గండిచెరువులో మునిగి ఇద్దరు మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయ పరిసరాల్లోని గండిచెరువులో మునిగి ఇద్దరు మృతి చెందారు. హైదరాబాద్ జగద్గిరిగుట్ట సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వనమాల పవన్‌కుమార్ (19), దండే కార్తీక్ (22) ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చారు. శ్రీస్వామి వారిని దర్శించుకున్న తరువాత పట్టణంలో ఓ సత్రంలో కుటుంబ సభ్యులతో బస చేసేందుకు దిగారు. అక్కడే వంటలు వండుకున్న తరువాత పవన్ కుమార్, దండే కార్తీక్‌లు ఇద్దరు స్వామిని మళ్లీ ఒకసారి దర్శనం చేసుకుంటామని సాయంత్రం చెప్పి వెళ్లారు. రాత్రి 10గంటలైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు చెందారు. అదే రాత్రి చుట్టు పక్కల, కొండపై వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం మధ్యాహ్నం సమయంలో పవన్‌కుమార్, కార్తీక్ మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గండి చెరువులో ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని, ఉదయం మిస్సింగ్ కేసు ఇచ్చిన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పవన్ కుమార్, కార్తీక్‌ల కుటుంబ సభ్యులు వచ్చి, చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుల బంధువైన శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరు సాయంత్రం సమయంలో గండి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడినట్లు పోలీసులు చెబుతున్నారు.

'ఉగ్ర సీన్' రీ-కన్‌స్ట్రక్షన్!

- ఆ ఆరుగురిని సిటీకి తీసుకువచ్చిన ఏటీఎస్
- నగరంలోని పలు ప్రాంతాల్లో వీరి 'పర్యటన'
- నేడు సిద్దిపేట శివారుకు తీసుకువెళ్లే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులకు హైదరాబాద్‌లో చిక్కిన ఐదుగురు ఉగ్రవాదులు దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారా..? ఔననే అంటున్నారు అధికారులు. ప్రాథమిక విచారణలో వీళ్లు చెప్పిన విషయాలను సీన్ రీ-కన్‌స్ట్రక్షన్‌లో గుర్తించిన అంశాలకు పొంతన లేదని స్పష్టం చేస్తున్నారు. తాజాగా చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో అనేక కీలకాంశాలు గుర్తించారు. గత వారం సిటీలో అరెస్టు అయిన ఐదుగురితో పాటు భోపాల్‌లో చిక్కిన సూత్రధారి యాసిర్ ఖాన్‌ను ఏటీఎస్ అధికారులు సోమవారం హైదరాబాద్ తీసుకువచ్చారు. వీరిని నగరంలోని అనేక ప్రాంతాలకు తీసుకువెళ్లి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు. మంగళవారం సిద్దిపేట శివారులో ఈ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి భోపాల్ తరలించనున్నారు. మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు గత వారం సిటీలో అరెస్టు చేసిన మహ్మద్ సలీం, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్ అబ్బాస్ అలీ, షేక్ జునైద్, మహ్మద్ హమీద్‌లతో పాటు భోపాల్‌లో చిక్కిన యాసిర్ ఖాన్‌లను సోమవారం సిటీకి తీసుకువచ్చారు. ఈ ఉగ్రవాదులంతా సలీం, రెహ్మాన్, సల్మాన్ (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) ఇళ్లల్లో సమావేశాలు నిర్వహించారు. వీటిలో సలీం ఇంట్లో జరిగిన ప్రతి సమావేశానికీ యాసిర్ హాజరయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఏటీఎస్ అధికారులు ఈ ఆరుగురిని సమావేశాలు జరిగిన ఇళ్లకు, ఐదుగురినీ వారి వారి ఇళ్లకు తీసుకువెళ్లి పలు అంశాలను రికార్డు చేశారు. తన మాడ్యూల్ ప్రాక్టీస్ చేయడానికి సలీం ఎంజే మార్కెట్ సమీపంలోని ఓ ఆయుధాల విక్రయ దుకాణం నుంచి మూడు ఎయిర్ పిస్టల్స్, పిల్లెట్స్ ఖరీదు చేశారు. అతడికి ఆ షాపు వద్దకు తీసుకువెళ్లిన ఏటీఎస్ అధికారులు దానికి సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకోవడంతో పాటు యజమాని వాంగ్మూలం నమోదు చేశారు.

తప్పుదోవ పట్టించారు.

ఈ ఉగ్రవాదులు అరెస్టు అయిన సమయంలో తాము నగర శివార్లలోని అనంతగిరి అడవుల్లో ఎయిర్ పిస్టల్స్‌తో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసినట్లు పోలీసులకు చెప్పారు. వీరిని లోతుగా విచారించిన నేపథ్యంలో ఏటీఎస్ అధికారులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికే ఇలా చెప్పారని గుర్తించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి వీళ్లు ఫైరింగ్ ప్రాక్టీస్‌కు ఏ అడవుల్లోకీ వెళ్లలేదని, టోలిచౌకిలో ఉన్న ప్రైవేట్ షూటింగ్ అకాడెమీలో చేసినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన ఏటీఎస్ టీమ్ రికార్డులు స్వాధీనం చేసుకుని, స్టేట్‌మెంట్స్ రికార్డు చేసింది. పరారీలో ఉన్న సల్మాన్ సహా నగరంలో అరెస్టు అయిన ఆరుగురూ తరచు సిద్దిపేటకు వెళ్లి వచ్చినట్లు తేలింది. అక్కడకు ఎందుకు వెళ్లారనే కోణంలోనూ ఉగ్రవాదులను ఏటీఎస్ అధికారులు విచారించారు. ఆ పట్టణానికి శివార్లలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ ప్రార్థన స్థలం ఉందని, అక్కడా తాము కొన్ని సమావేశాలు నిర్వహించామని బయటపెట్టారు. కత్తులు, గొడ్డళ్లు వినియోగించి దాడి చేయడం, విల్లులతో బాణాలు వేయడంతో పాటు ఫిట్‌నెస్‌కు సంబంధించిన కొన్ని ట్రైనింగ్స్ అక్కడ చేసినట్లు అంగీకరించారు. దీంతో ఈ ఉగ్రవాదులను మంగళవారం సిద్దిపేట శివార్లకు తీసుకువెళ్లాలని ఏటీఎస్ అధికారులు భావిస్తున్నారు.

అబద్ధాలు చెప్పి నమ్మించారు.

హైదరాబాద్ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించిన సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరినీ ఉగ్రవాదం వైపు ఆకర్షించాలని ప్రయత్నించారు. తాము కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నామని నమ్మబలికి వారిని తమ ఇళ్లల్లో జరిగిన సమావేశాలకు రప్పించారు. అయితే వాటిలో ఈ ద్వయం చెప్తున్న అంశాలు రెచ్చగొట్టేవిగా, వీరి కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరమయ్యారు. ఈ కేసులో అలా దూరమైన వారిని సాక్షులుగా మార్చాలని ఏటీఎస్ నిర్ణయించింది. న్యాయస్థానంలో నిందితులను దోషులుగా నిరూపించడానికి ఇవి కీలకమనే ఉద్దేశంతో రాష్ట్ర నిఘా వర్గాలతో కలిసి వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తోంది. సోమవారం వరకు చంద్రాయణగుట్ట, హఫీజ్ బాబానగర్ ప్రాంతాలకు చెందిన ఇద్దరిని గుర్తించారు. నగరంలో ఉన్న ఏటీఎస్ టీమ్ వీరి నుంచీ వాంగ్మూలాలు నమోదు చేసింది. ఈ ఉగ్రవాదుల ఏటీఎస్ కస్టడీ గడువు శుక్రవారంతో ముగియనుంది.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

రెండు స్పాలు సీజ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని సీక్రెట్ ఆఫ్ హెయిర్ అండ్ ఫ్యామిలీ సెలూన్‌లో మసాజ్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి యజమానిపై కేసు నమోదు చేయడమే కాకుండా సెలూన్‌ను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొంత కాలంగా రోడ్ నెం. 2లో ప్రకాశ్ అనే వ్యక్తి ఫ్యామిలీ సెలూన్ నిర్వహిస్తూ వివిధ ప్రాంతాల నుంచి యువతులను రప్పించి క్రాస్ మసాజ్ చేయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ఎస్.కరుణాకర్‌రెడ్డి సంబంధిత సిబ్బందితో కలిసి సెలూన్‌పై దాడి చేశారు. మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా సదరు నిర్వాహకుడు ఏర్పాటు చేయలేదు. జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఈ సెలూన్‌ను నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. మసాజ్ థెరపిస్టులు, బ్యూటీషియన్ల పేరుతో వివిధ ప్రాంతాల నుంచి పది మంది యువతులను రప్పించి వ్యభిచారానికి పాల్పడుతున్నట్లుగా విచారణలో తేలింది. సెలూన్ యజమాని ప్రకాశ్‌పై ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద వెల్‌నెస్ పేరుతో..

బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో సోనాలిసింగ్ అనే బ్యూటీషియన్ కొంత కాలంగా మహి ఆయుర్వేది వెల్‌నెస్ ఫ్యామిలీ సెలూన్ పేరుతో స్పాను నిర్వహిస్తుండగా ఇందులో మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ మనోజ్ కుమార్ దాడులు నిర్వహించారు. ఈ సెలూన్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నట్లుగా గుర్తించారు. స్పా ముసుగులో ఈ కేంద్రాన్ని వ్యభిచార గృహంగా మార్చినట్లుగా తనిఖీల్లో వెల్లడైంది. నిర్వాహకురాలిపై ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు సర్కార్ ప్రోత్సాహం

- 615 మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడాపోటీలు
- 17 వేల క్రీడా ప్రాంగణాల నిర్మాణం
- గుడి, బడిలాగే క్రీడా మైదానాలను గౌరవించాలి
- సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం సీఎం కప్–2023 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 615 మండల కేంద్రాల్లో క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో 17వేల క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు భారీ నగదు, విలువైన ఇళ్ల స్థలాలను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల్లో రెండు శాతం, ప్రొఫెషనల్ కోర్సుల్లో శాతం రిజర్వేషన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు మరో లక్ష ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగుతోందని వివరించారు. ఐటీకి అడ్డాగా మారిన తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కుతున్నాయని ఆయన వివరించారు. భారీ పరిశ్రమలను జిల్లాలకు సైతం విస్తరించడం వల్ల గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారని, నిఖత్ జరీన్ తదితరులను ఆయన ఉదహరించారు. గుడి, బడిలాగే క్రీడామైదానాలను గౌరవించాలని, క్రీడా ప్రాంగణాల కేర్ టేకర్లుగా యువకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్ర రేఖా, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, ఎంపీడీఓ మమతాబాబు, ఎంపీఓ వినోద, మండల విద్యాశాఖాధికారి హీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ తదితరులు

ఆటోలో వెళ్తున్న వ్యక్తిపై కత్తులతో దాడి



చికిత్స పొందుతున్న బీసయ్య

జగద్గిరిగుట్ట: ఆటోలో వెళ్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం భానూర్ గ్రామానికి చెందిన బీసయ్య ఆదివారం ఎన్టీఆర్‌నగర్‌లో ఓ వివాహానికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజాము 3.30 గంటలకు ఆటోలో ఎన్టీఆర్ నగర్ నుండి కేపీహెచ్‌బీ వైపు వెళ్తుండగా తులసి వనం లేక్‌వ్యూ బార్ సమీపానికి రాగానే ముగ్గురు వ్యక్తులు ఆటోను అడ్డగించి ఆపై కత్తులతో బీసయ్యపై దాడి చేశారు. అతన్ని చేతులు, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి..అనంతరం బీసయ్య జేబులోంచి నగదు, మొబైల్ ఫోన్‌ను గుంజుకుని పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

వైభవంగా రుక్మిణీ కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

పంజగుట్ట: ఎర్రమంజిల్ బాలాపుర బస్తీలోని శ్రీకృష్ణ మందిరం తొలి వార్షికోత్సవం సందర్భంగా బస్తీవాసులు సోమవారం ఆలయంలో రుక్మిణీ, శ్రీకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లకు వేకువ జామునే అభిషేకం అనంతరం మొదలైన ఈ కల్యాణ క్రతువులో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూజా వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి బాలకృష్ణ, రవి శంకర్, స్థానిక పంచాయితీ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్, హరిగోపాల్, మాణిక్‌రావు, కల్యాణ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నాయుడునగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల పర్యటన



నాయుడునగర్‌లో పర్యటిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని నాయుడు నగర్ బస్తీలో బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించి స్థానికులతో ముచ్చటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అడుగడుగునా డ్రెయినేజీ పొంగిపొర్లుతుండగా దుర్గంధం స్థానికులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నదని దుయ్యబట్టారు. బస్తీలో అభివృద్ధి ముందుకు సాగడం లేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఆయనకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. పలువురు తమ ఇళ్లకు ఆహ్వానించి కష్టాలు వెళ్లబోసుకున్నారు. త్వరలోనే ఖైరతాబాద్‌కు మంచి రోజులు వస్తాయని ఆయన హామీ ఇచ్చారు.

గూడు పోయింది.. గోడు మిగిలింది!



ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

రహమత్‌నగర్: కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో బస్తీవాసులు ఆందోళన బాట పడుతున్నారు. ఇస్తే అందరికీ ఇవ్వాలి లేకపోతే వద్దంటూ పట్టు పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం తమ ఇళ్ల పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలతో సికింద్రాబాద్ ఆర్డీఓ, ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి తమగోడు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై బస్తీకి చెందిన షేక్ హైదర్ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ ద్వారా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లేఖను సమర్పించారు.

ఏపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంకు సన్మానం



ఎమ్మెల్సీ ఏసురత్నంను సన్మానిస్తున్నట్రస్ట్ ప్రతినిధులు

రహమత్‌నగర్: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా తొలిసారిగా హైదరాబాద్ నగరానికి వచ్చిన చంద్రగిరి ఏసురత్నంకు తెలంగాణ వడ్డెర ఆత్మగౌరవ, భవన సముదాయ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జేరిపేటి సత్యనారాయణ రాజు, సభ్యులు ఎత్తరి అంతయ్య, డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, శివరాత్రి ఐలుమల్లు మాట్లాడుతూ... వడ్డెర కులస్తులను గుర్తించిన తెలంగాణ సీఎం కేసీఆర్ భవన నిర్మాణానికి ఉప్పల్‌లో ఎకరం స్థలం కేటాయించి నిర్మాణ పనులు చేపడుతుండటం అభినందనీయమన్నారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ ఏసురత్నం రూ. 6 లక్షల చెక్కును అందించి తన ఉదారతను చాటుకోవడం పట్ల ట్రస్ట్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నేతలు తన్నీరు వెంకట కృష్ణ, ముద్దంగుల నర్సింహ, వరకొప్పుల లింగయ్య, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి!

- బంజారాహిల్స్ డివిజన్‌లో ముందుకు సాగని అభివృద్ధి
- పట్టించుకోని ఎమ్మెల్యే తీరుపై సర్వత్రా ఆందోళన
- అభివృద్ధికి దూరం అవుతున్నామంటూ ఆవేదన

ఖైరతాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారవుతోంది. దీంతో పలు ప్రాంతాల్లోని ప్రజలు సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. స్థానిక ఎమ్మెల్యే చెప్పేదానికి, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేకుండా పోతోందనే విమర్శలూ లేకపోలేదు. ఎమ్మెల్యే మైక్ పట్టారంటే కోట్లాది రూపాయల ముచ్చట్లు వినిపిస్తుండగా స్థానికంగా మాత్రం అభివృద్ధి పనుల్లో పురోగతి ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదనే చెప్పొచ్చు. అధికార పార్టీ నేతల నిర్వాకంతో బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా అంతటా సమస్యలు నెలకొని ప్రజల్లో నిర్లిప్తత కనిపిస్తోంది.



ఎన్బీటీ నగర్‌లో తవ్వేసిన రోడ్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాన్ నుంచి ఎన్బీటీ నగర్ కల్లు కంపౌండ్ వరకు రూ. 1.62 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నత్తనడకన సాగిన ఈ పనులు మేయర్ ఇంటి చౌరస్తా వరకు వచ్చి నిలిచిపోయాయి.

- కల్లు కంపౌండ్ నుంచి ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖానా, అయ్యప్ప ఆలయం మీదుగా చర్చి, ఏసీబీ కార్యాలయం వరకు రూ. 1.90 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందు కోసం రెండు నెలల క్రితమే రోడ్డును తవ్వారు. ఇప్పటిదాకా పని ముందుకు సాగడం లేదు.
- డ్రెయినేజీ పనుల కోసం రూ. 14 లక్షలు, మంచి నీటి పైప్‌లైన్ల కోసం రూ. 50 లక్షలు ఎన్బీటీ నగర్ అంతర్గత రహదారులకు కేటాయించి పైపులు వేశారు. అయితే తవ్విన గుంతలు మాత్రం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయి.
- దుర్వాసనలతో బస్తీవాసులు నెలన్నరగా నానా తిప్పలు పడుతున్నారు. లీకేజీలు అరికట్టేందుకు, కలుషిత నీటికి చెక్ పెట్టేందుకు పైపులు వేసినా ఇప్పటిదాకా రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.



ఏడేళ్ల క్రితం శంకుస్థాపన...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో కల్లు కంపౌండ్ సమీపంలో 300 గజాల విస్తీర్ణంలో రూ. 62 లక్షల వ్యయంతో మహిళా భవన్ నిర్మాణానికి 2013లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం శంకుస్థాపన చేశారు.
- ఇప్పటిదాకా ఈ పనులు మొదలే కాలేదు. పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించకపోవడంతో పనుల్లో పురోగతి లేదు.

మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం...

ఎన్బీటీ నగర్‌లో అయ్యప్ప దేవాలయం పక్కన సుమారుగా రెండెకరాల విస్తీర్ణంలో మల్టీ పర్పస్ నిర్మాణం కోసం 2015లో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇప్పటిదాకా ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. ఏనాడూ స్థానిక ఎమ్మెల్యే ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై సంబంధిత అధికారులతో సమీక్షించలేదు.

శ్రీరాంనగర్ కమ్యూనిటీ హాల్ ఎక్కడ...

బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్ బస్తీలో రూ. 2.50 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే దానం శంకుస్థాపన చేశారు. నెలన్నర దాటుతున్నా ఇంకా పునాదులు కూడా తీయలేదు. ఈ నిర్మాణ పనులు ఎందుకు ఆగిపోయాయన్న దిశగా ఎమ్మెల్యే కసరత్తు ప్రారంభించలేదు.

సుందరంగా లోటస్‌పాండ్ చెరువు



బంజారాహిల్స్: వారం రోజుల క్రితం ఉక్కపోత, ఆక్సిజన్ కొరతతో పెద్ద ఎత్తున లోటస్‌పాండ్ చెరువులో చేపలు మృతి చెందిన విషయం విదితమే. మృతి చెందిన చేపలతో లోటస్‌పాండ్‌తో పాటు పరిసర ప్రాంతాలన్నీ కంపుకొట్టడంతో పార్కు నిర్మానుష్యంగా మారింది. స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. మత్స్యశాఖ అధికారులు పార్కులో పర్యటించి ఆక్సిజన్ మాత్రలను నీటిలో వేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సిబ్బందిని నియమించి చనిపోయిన చేపలన్నింటినీ తొలగించడంతో ఇప్పుడు లోటస్‌పాండ్ సుందరంగా కనిపిస్తున్నది. చెరువులో నీరు స్వచ్ఛతతో అటు వాకర్లను, ఇటు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే జలమండలి నిర్వాకంతో చుట్టుపక్కల ప్రాంతాల డ్రెయినేజీల నుంచి మురుగు ఈ చెరువులోకి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తక్షణం ఈ సమస్యకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే మళ్లీ చేపలు మృత్యువాత పడే అవకాశాలున్నాయని మత్స్యశాఖ అధికారులు హెచ్చరించారు.



వ్యర్థాలను తొలగించడంతో సుందరంగా కనిపిస్తున్న లోటస్‌పాండ్ చెరువు

20న 'డబుల్' ఇళ్ల దుకాణాల వేలం



ఎమ్మెల్యే దానంను కలిసిన 'డబుల్' ఇళ్ల నివాసులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో ఉన్న దుకాణాల వేలం పాటను ఈ నెల 20వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారని డిగ్నిటీ హౌసింగ్ కమిటీ అధ్యక్షుడు బి.అనిల్, ప్రతినిధులు వెంకటేష్, వినోద్ తెలిపారు. ఇప్పటికే వేలంపాట నిర్వహించాలనుకున్నా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సమావేశమయ్యారు. ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఈ నెల 20న ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు.

జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలి



ఆందోళనలో పాల్గొన్న నాయకులు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఎస్పీఆర్‌హిల్స్‌లో సీపీఎం జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు స్వామి, ప్రజా సంఘాల నాయకుడు శేషగిరిరావు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా కొనసాగుతున్న జర్నలిస్టులకు అండగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. సమాజ సేవలో నిస్వార్థంగా సేవలందిస్తున్న జర్నలిస్టులకు కమలానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కమలానగర్ బస్తీవాసులందరికీ ఒకేసారి డబుల్ రూం ఇళ్లను కేటాయించాలన్నారు. నాయకులు భాగ్యరాజ్, ఎ.ఆర్.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంపు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఒక్క రోజు శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు, డ్యాన్స్, మ్యాజిక్ షో కార్యక్రమాలను నిర్వహించారు. ఉపొందిన విద్యార్థులకు బహుమతులను ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా సభ్యులు అందజేశారు.

దేవుడి రూపంలో మానవ విగ్రహాలు పెడితే సహించం

మాజీ మంత్రి కృష్ణయాదవ్,
సినీ నటి కరాటే కల్యాణి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కృష్ణ యాదవ్

పంజగుట్ట: దేవుడి రూపంలో మానవ విగ్రహాలను ఏర్పాటు చేయిస్తే సహించమని భారత యాదవ సమితి (బీవైఎస్) హెచ్చరించింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని లకారం చెరువు మధ్యలో శ్రీకృష్ణుడి రూపంలో సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని పెట్టడం యావత్ హిందూ సమాజాన్ని కించపరచడమే అని వారు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, సినీనటి కరాటే కల్యాణి యాదవ్, బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్ మాట్లాడారు. కృష్ణుడు యాదవుల ఆరాధ్య దైవమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కొలిచే దేవుడన్నారు. దేవుడికి రూపంలేనట్లు ఎన్టీఆర్ రూపంలో విగ్రహాన్ని పెట్టడం వారి మనోభావాలు దెబ్బతీయడమే అన్నారు. ఎన్టీఆర్ కృష్ణుడి పాత్రమాత్రమే చేయలేదని పలు చిత్రాల్లో ముస్లింగా కూడా నటించారని గుర్తుచేశారు. యాదవ జర్నలిస్టు యూనియన్ ప్రతినిధి హరికృష్ణ, నేతలు తోకల శ్రీనివాస్, బొర్రాజు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేపీసీసీ అధ్యక్షుడికి అభినందన

బంజారాహిల్స్: కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించడంలో కీలక పాత్ర పోషించిన కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ప్రత్యేకంగా కలిసి అభినందించారు. కర్ణాటక కాంగ్రెస్ అధికారంలోకి రానున్న నేపథ్యంలో బెంగళూరుకు వెళ్లిన రోహిణ్‌రెడ్డి డీకే శివకుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్యను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో రాబోయే తెలంగాణ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి అన్నారు.



డీకే శివకుమార్‌ను అభినందిస్తున్న రోహిణ్‌రెడ్డి

భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వాలి

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల పేరిట రైతుల నుంచి సేకరించిన భూమికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని బాధిత రైతాంగ పోరాట వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ తన్నీరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతుల నుంచి భూములు సేకరించి వారికి నామమాత్రంగా పరిహారం ఇచ్చి పారిశ్రామిక వేత్తలకు కోట్ల రూపాయలకు అమ్ముకోవడం దారుణమన్నారు. భౌగోళిక పరిస్థితి దృష్ట్యా ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన 7 మండలాల వారికి విద్య, వైద్యం, ఉపాధి హక్కుల్లో రెండు తెలుగు రాష్ట్రాలు అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో శేషాద్రి పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం'



వెంకటేశ్వరకాలనీ: బస్తీవాసులు, కాలనీవాసులు వారి ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వెంట వెంటనే పరిష్కరించకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని జలమండలి తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు హెచ్చరించారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని తట్టికాన సెక్షన్ కార్యాలయంలో సీవరేజి, వాటర్ లైన్‌మెన్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెక్షన్ పరిధిలోని కొన్ని చోట్ల సిబ్బంది పనితీరు మార్చుకోవడం లేదని ఎన్నిమార్లు చెప్పినా వారి తీరు మారడం లేదన్నారు. తీరుమార్చుకోని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయగానే వెంటనే అక్కడికి వెళ్లాలని రోజుల తరబడి తాత్సారం చేస్తే వారు ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. తమ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే సెక్షన్ వద్దకు ఆ సమస్యను తీసుకురావాలని దానికి ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లను వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే నిర్వహించిన రివ్యూ సమావేశంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఖైరతాబాద్: యాదవులను కించ పరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలు యాదవుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. యాదవులు స్వయం కృషితో ముందుకు వెళ్తుంటే ఓర్వలేక కించపరుస్తూ, తక్కువ చేసి అవమానిస్తున్నారన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నేతలు కాటం ప్రశాంత్ యాదవ్, మహేష్ యాదవ్, రాజేశ్ యాదవ్, కాటం ప్రమోద్ యాదవ్, అశోక్ యాదవ్, ప్రదీప్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ పునఃనిర్మాణ పూజలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప దేవాలయం పునఃనిర్మాణ పనులకు సోమవారం భూమి పూజలు ప్రారంభమయ్యాయి. రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈవో లావణ్య, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా స్వామివారిని బాలాలయంలో ఏర్పాటు చేయగా ఇందుకు సంబంధించిన విశేష పూజలు జరిగాయి. ప్రముఖ కాంట్రాక్టర్ సూరపనేని సునంద్, పద్మప్రియ దంపతులు ఈ ఆలయ నిర్మాణానికి దాతలుగా ముందుకు వచ్చారు. అయిదు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు కుంభాభిషేకం నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూమి పూజా కార్యక్రమంలో మణికంఠ అన్నదాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయ శాఖ ఆర్‌జేసీ, అధికారులు

వృద్ధురాలి శరీరదానం



బల్లా రుద్ర (ఫైల్)

బంజారాహిల్స్: తన మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోరాదని సామాజిక ప్రయోజనాల కోసం, భవిష్యత్ తరాల వైద్య ప్రయోగాల కోసం ఉపయోగపడాలనే సంకల్పంతో ఓ వృద్ధురాలు తన నేత్రాలు, శరీరాన్ని దానం చేశారు. గాజుల రామారానికి చెందిన బల్లా రుద్ర(89) ఆదివారం కన్నుమూయగా ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను వాసన్ ఐ బ్యాంక్‌కు, శరీరాన్ని మల్లారెడ్డి మెడికల్ కాలేజీకి అందజేశారు. బతికుండగానే తన నేత్రాలు, శరీరాన్ని దానం చేస్తూ హైదరాబాద్‌కు చెందిన అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆమె ఆకాంక్ష మేరకు కుటుంబ సభ్యులు మరణానంతరం శరీరాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చారు. తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 శరీరాలను వివిధ మెడికల్ కాలేజీలకు వారి దరఖాస్తు మేరకు అందజేసినట్లు సంఘం అధ్యక్షులు గంజి ఈశ్వరలింగం వెల్లడించారు. అలాగే ఇప్పటి వరకు 1043 నేత్రాలను ఆయా నేత్రనిధి బ్యాంకులకు అందజేసినట్లు తెలిపారు. ఎవరైనా నేత్రాలు, శరీరాలు, ఇతర అవయవాలు దానం చేయాలనుకుంటే ఫోన్స్: 95508 94940, 94910 74940లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

మ్యాన్‌హోల్ మరమ్మతు పూర్తయ్యేదాకా ట్రాఫిక్ మళ్లింపు

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో ఉన్న యూ టర్న్ వద్ద భారీ మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో ఇందుకు సంబంధించిన మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ పెద్ద ఎత్తున జామ్ అవుతుండటంతో ట్రాఫిక్ అధికారులు వాహనాలు వేగంగా ముందుకు కదిలేలా ప్రణాళిక రూపొందించారు. ఫిలించాంబర్ వైపు నుంచి వస్తున్న రోడ్డులో సగభాగంలో బారికేడ్లు వేసి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వైపు నుంచి వస్తున్న వాహనాలను ఈ బారికేడ్లు మీదుగా ముందుకు పంపిస్తున్నారు. మ్యాన్‌హోల్ మరమ్మతులు పూర్తయిన వెంటనే మళ్లీ సాధారణ స్థితిలో వాహనాలు ముందుకు వెళ్లేలా చేస్తామని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

'క్వియర్' పిల్లలకు అన్ని హక్కులనూ వర్తింపచేయాలి

పంజగుట్ట: ఒక కుటుంబంలోని వ్యక్తులకు ఎన్ని హక్కులు ఉంటాయో అన్ని హక్కులనూ క్వియర్ వ్యక్తులకు సైతం వర్తింప చేయాలని క్వియర్ తల్లి దండ్రుల సంఘం విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షురాలు మాల, సెక్రటరీ సునిత మాట్లాడుతూ... ట్రాన్స్‌జెండర్, గే, లెస్బియన్, బైసెక్సువల్ పిల్లల తల్లిదండ్రులుగా తాము వారు సమాజంలో ఎదుర్కొంటున్న తీవ్ర వివక్ష, పక్షపాతం, వెలివేతను ప్రత్యక్షంగా చూశామన్నారు. వీరికి వివాహ సమానత్వం కోసం ఇప్పటికే 20 కిపైగా పిటీషన్లు న్యాయస్థానాల్లో ఉన్నాయన్నారు. వారికి పెళ్లి చేసుకునే హక్కు, కుటుంబం ఏర్పాటు చేసుకునే, పిల్లల్ని దత్తత తీసుకునే హక్కులు కల్పించాలన్నారు. ఒక సంస్థ నిర్వాహకులు క్వియర్ వ్యక్తుల పిల్లల్ని పెంచితే వారి జీవితం ప్రమాదంలో పడుతుందని ప్రకటించారని... వారు ఏ గణాంకాలను పరిగణలోకి తీసుకుని అలా చెప్పారో వివరించాలని తెలిపారు. సమలైంగికత, ట్రాన్స్ ధోరణులు లేవని ఇదంతా పాశ్చాత్య సంస్కృతి అని భారతీయ సంస్కృతి పేరుతో క్వియర్ వ్యక్తులను వ్యతిరేకించే ధోరణులు పెరుగుతున్నాయన్నారు. అయితే క్వియర్ లైంగికతను, ట్రాన్స్ సంస్కృతిని సమర్థించాయి అనడానికి మన పురాణాలే నిదర్శనమన్నారు. క్వియర్ వ్యక్తులకు చదువు, ఆరోగ్యం, ఉద్యోగంతో పాటు వారు ఎంచుకున్న వ్యక్తులతో కలిసి కుటుంబాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు, వివాహం చేసుకునే హక్కు ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. సమావేశంలో దీప్తి, అపర్ణ, కవిత, వైజయంతి తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ సంబురం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సోమవారం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ 9వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాలు అందుకున్న విద్యార్థులు సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

సాక్షి, అమరావతి: అమరావతి ముసుగులో నారా చంద్రబాబునాయుడు సాగించిన భూదందాలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంశం ఓ అవినీతి అధ్యాయమేనని వెల్లడైంది. అలైన్‌మెంట్ ప్రతి మెలికలోనూ పచ్చ గ్యాంగ్ అవినీతి గుట్టు రట్టవుతోంది. టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న చంద్రబాబు, వైస్ చైర్మన్ పొంగూరు నారాయణ అవినీతి బాగోతాలు విస్తుపోయే రీతిలో ఉన్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన లింగమనేని రమేష్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి వెంటనే రూ.877.50 కోట్లకు... రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం ఎల్లో గ్యాంగ్ బరి తెగింపు వ్యవహారాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా పిడికెడు వాటా ఇవ్వడం కొసమెరుపు. అవినీతికి బాటలు వేసిన ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెనుక సాగిన గూడుపుఠాణీ దశలవారీగా ఇదిగో ఇలా సాగింది..!

అలైన్‌మెంట్‌ను ఆనుకుని భూములు

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఆ భూములకు 3 కి.మీ. దూరంగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాలి. అలైన్‌మెంట్ మార్పుతో ఆ భూములను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకునే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 9 ఎకరాలు ఒకచోట, ఒప్పందం చేసుకున్న నాలుగు ఎకరాలు మరో చోట ఉండటం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.

అక్కడే పవన్ కల్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

కృష్ణా ఇవతలా అవినీతి మెలికలే

అమరావతి పరిధిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ద్వారా చంద్రబాబు, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతం పెంచుకోగా కృష్ణానదికి ఇవతల విజయవాడ శివారులో నారాయణ తమ ఆస్తుల విలువ భారీగా పెంచుకున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అయితే అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ నాడు సీఆర్‌డీఏ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు. దాంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తన విద్యా సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా నారాయణ చక్రం తిప్పారు.

అటూ ఇటూ భారీగా కొనుగోలు

ఇన్నర్‌రింగ్ రోడ్డును ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన బాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ తన సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. అవన్నీ ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అటూ ఇటూ ఉండటం గమనార్హం. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వయొలెట్ కలర్: సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్


బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్

రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

అలైన్‌మెంట్ 1

సీఆర్‌డీఏ తొలుత రూపొందించింది

అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ నిర్ణయించేందుకు టెండర్ల ద్వారా కన్సల్టెన్సీతో నిమిత్తం లేకుండా పని ముగించాలని చంద్రబాబు, నారాయణ నిర్ణయించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు 94 కి.మీ. పొడవుతో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీన్ని చూసి చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఎందుకంటే దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెంచుకునేందుకు ఆ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు.



రెడ్ కలర్ : గుంటూరు, కృష్ణాజిల్లాలను కలుపుతూ కృష్ణానది మీదుగా సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

గ్రీన్ కలర్ : నారాయణ ఆదేశాలతో కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులు

అలైన్‌మెంట్ 2


చంద్రబాబు ఆదేశాలతో రూపొందించారు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజా ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని మరీ ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. మేర అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అలైన్‌మెంట్ 3

కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించింది

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. అనంతరం ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు ఎస్టీయూపీ అనే ఓ కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే అది ఉండాలని నిర్దేశించారు. అప్పటికే సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. తాడికొండ, కంతేరు, కాజాలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.



అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వయొలెట్ కలర్ : సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్

బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్

రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్. (మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

నగర వార్తలు

16 బోగీలతో సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్

ఈ నెల 17 నుంచి అదనపు బోగీలు

- 530 నుంచి 1,128కి పెరుగనున్న సీట్ల సామర్థ్యం
- ప్రయాణ సమయంలో 15 నిమిషాలు తగ్గింపు..



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్–తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం 8 కోచ్‌లు ఉన్న ఈ ట్రైన్‌కు ఈ నెల 17వ తేదీ నుంచి అదనంగా మరో 8 కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ ట్రైన్ బోగీల సంఖ్య 16కు చేరుకోనుంది. అలాగే ఇప్పుడు 530 మంది ప్రయాణికుల సామర్థ్యం మాత్రమే ఉండగా బోగీల పెంపు వల్ల సీట్ల సంఖ్య కూడా 1,128 కి పెరగనుంది.దీంతో పాటు సికింద్రాబాద్–తిరుపతి, తిరుపతి–సికింద్రాబాద్ మధ్య రెండు వైపులా ప్రయాణ సమయం కూడా 15 నిమిషాల వరకు తగ్గనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు ఎనిమిదిన్నర గంటల వ్యవధిలో గమ్యస్థానం చేరుకుంటుండగా ఈ నెల 17 నుంచి 8 గంటల 15 నిమిషాలకే చేరుకోనుంది.

అనూహ్యమైన డిమాండ్..

నిత్యం వందలాది మంది భక్తులు హైదరాబాద్ నుంచి తిరుపతి పుణ్యక్షేత్రాన్ని సందర్శించేందుకు తరలి వెళ్తారు. దీంతో ఈ రూట్‌లో రైళ్లకు ఎంతో డిమాండ్ ఉంది. గత నెల 8వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వందేభారత్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి వంద శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తోంది. కానీ కోచ్‌లు, సీట్లు పరిమితంగానే ఉండడం వల్ల చాలా మంది వందేభారత్‌లో పయనించలేకపోయారు. 8 కోచ్‌ల కూర్పుతో ప్రవేశపెట్టిన ఈ ట్రైన్‌లో ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ తో పాటు 7 చైర్ కార్లు మాత్రమే ఉన్నాయి.సికింద్రాబాద్ నుంచి వెళ్లేటప్పుడు ఏప్రిల్‌లో 131 శాతం, మే నెలలో 135శాతం, తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చేటప్పుడు ఏప్రిల్‌లో 136 శాతం, మేలో ఇప్పటి వరకు 38 శాతం చొప్పున ఆక్యుపెన్సీ నమోదు కావడం గమనార్హం.ఇప్పటి వరకు ఈ ట్రైన్‌లో మొత్తం 44,992 మంది ప్రయాణం చేశారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి 21,798 మంది, తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు మరో 23,194 మంది చొప్పున రాకపోకలు సాగించారు.

పెరుగనున్న సీట్ల సంఖ్య....

కొత్తగా అందుబాటులోకి రానున్న 16 కోచ్‌లలో 14 చైర్‌కార్‌లు ఉంటాయి. వీటిలో 1,024 మంది ప్రయాణం చేస్తారు. మరో 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 104 మంది ప్రయాణం చేస్తారు. దీంతో ప్రయాణికుల సంఖ్య 1128 కి పెరగనుంది.కోచ్‌లను రెట్టింపు చేయడం వల్ల ఎక్కువ మంది ప్రయాణం చేయగలుగుతారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. వేసవి సెలవుల దృష్ట్యా ప్రయాణికుల డిమాండ్ కూడా ఎక్కువగానే ఉందన్నారు.

ఇవీ వేళలు..

సికింద్రాబాద్– తిరుపతి

- సికింద్రాబాద్– తిరుపతి (20701) ఉదయం 6.15 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఉదయం 7.29 గంటలకు నల్గొండ, 9.35 గంటలకు గుంటూరు, 11.12 గంటలకు ఒంగోలుకు చేరుకుంటుంది. ఒంగోలులో తిరిగి 11.15 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.29 గంటలకు నెల్లూరుకు మధ్యాహ్నం 2.30 కు తిరుపతికి చేరుకుంటుంది. ప్రతి స్టేషన్‌లో ఒక నిమిషం పాటు హాల్టింగ్ ఉంటుంది. ఒంగోలులో మాత్రం 3 నిమిషాల పాటు నిలుపుతారు.

తిరుపతి–సికింద్రాబాద్

- ఈ ట్రైన్ మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రాత్రి 11.30 కు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4.49 గంటలకు నెల్లూరు, 6.02 గంటలకు ఒంగోలుకు చేరుకుంటుంది. సాయంత్రం 6.05 గంటలకు ఒంగోలు నుంచి బయలుదేరి 7.45 గంటలకు గుంటూరు, రాత్రి 9.49 గంటలకు నల్గొండకు చేరుకుంటుంది. రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలోనూ ఒంగోలులో 3 నిమిషాల హాల్టింగ్ సదుపాయం ఉంటుంది.

సగానికి పైగా అనుబంధ గుర్తింపు లేనివే..!

- బోర్డు అనుబంధ జాబితాల్లో కనిపించని పేర్లు
- పెండింగ్‌లో ప్రైవేటు కాలేజీల అనుబంధ గుర్తింపు
- ఇప్పటికే వేలాది ముందస్తు ప్రవేశాలు
- నేటి నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. అడ్మిషన్ లాగిన్ ఓపెన్ అయింది. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు జోరందుకున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నగరంలోని సగానికి పైగా ప్రైవేటు కళాశాలలకు అనుబంధ గుర్తింపు రానప్పటికీ ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు తరగతులు కూడా కొనసాగుతున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్‌లో ఆయా కళాశాలల పేర్లు లేకపోయినా యాజమాన్యాలు అడ్మిషన్ ప్రక్రియ మాత్రం కొనసాగించడం విస్మయానికి గురిచేస్తోంది. వాస్తవంగా గత కొన్నేళ్లుగా గృహ, వాణిజ్య సముదాయాల్లో కొనసాగుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు వివాదం కొనసాగుతోంది. అగ్నిమాపక ఎన్‌ఓసీ లేకున్నా అనుబంధ గుర్తింపు ఇవ్వాలన్న గతేడాది జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వులు అనుకూల అంశంగా తయారైనా చాల కళాశాలకు ఈసారి ఇప్పటి వరకు గుర్తింపు లభించనట్లు తెలుస్తోంది. వాస్తవంగా అనుబంధ గుర్తింపు గడువు ఇప్పటికే ముగిసినా.. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన గుర్తింపు ప్రక్రియపూర్తి కానట్లు తెలుస్తోంది.

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలోనే కాలేజీలు

నగరంలో చాల వరకు మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలున్నాయి. అంటే ఆయా భవనాల్లో కాలేజీతో పాటు, ఇతర కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కాలేజీలకు ఫైర్ సర్వీస్ విభాగం నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుంది. గత విద్యా సంవత్సరం చివర్లో వాటికి మినహాయింపు లభించడంతో పాటు ఈ కొత్త విద్యా సంవత్సరం కూడా వర్తించనుంది. అయినప్పటికీ కార్పొరేట్ విద్యా సంస్థలకు సంబంధించిన అనేక బ్రాంచ్‌లకు ఈ సారి అనుబంధ గుర్తింపు లభించనట్లు తెలుస్తోంది. బోర్డు వెబ్‌సైట్‌లో వాటి పేర్లు లేక పోవడం ఇందుకు బలం చేకూర్చుతోంది. ఇప్పటికే వాటిలో అడ్మిషన్ల ప్రక్రియ 90 శాతంపైగా పూర్తయింది. సాంకేతికంగా చూసే అనుబంధ గుర్తింపు లేని కాలేజీలో చేరిన విద్యార్థులకు ఇంకా అడ్మిషన్లు కానట్లే. నిబంధనల ప్రకారంబోర్డు వెబ్‌సైట్‌లో విద్యార్థుల వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. అందుకు కాలేజీలకు ఇంటర్ బోర్డు లింక్‌ను అందిస్తోంది. అనుబంధ గుర్తింపు లేని కారణంగా తక్షణమే వివరాల నమోదు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ఆయా విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయడానికి అవకాశం ఉండదు. ఒకవేళ పరీక్షలు రాయాలనుకుంటే... ప్రైవేట్ విద్యార్థులుగా పరిగణిస్తారు. అదే జరిగితే జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ వంటి కొన్ని ప్రవేశ పరీక్షలకు ప్రైవేట్ విద్యార్థులను అనుమతించరు. ఇంతటి కీలక అంశంపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం విస్మయానికి గురిచేస్తోంది.

మోకాళ్ల మార్పిడిలో రోబోటిక్ సర్జరీ సేవలు

కాచిగూడ: రోబోటిక్ పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స మరింత సులభతరం కావడంతో పాటు ఖచ్చితత్వంలో చేసేందుకు అవకాశం కలుగుతోందని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుశాల్ తెలిపారు. సోమవారం బర్కత్‌పురలోని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ క్లినిక్‌లో రోబోటిక్ సర్జరీపై ఏర్పాటు చేసిన అవగాహన శిబిరంలో ఆయన ప్రసంగించారు. వయస్సుతో సంబంధం లేకుండా పెరుగుతోన్న ఆర్థోపెడిక్ సమస్యలను మొదటి మూడు దశల్లో ఉన్నప్పుడు గుర్తిస్తే మోకాళ్ల మార్పిడి వరకు వెళ్లకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఆధునిక వైద్య సేవల్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే బర్కత్‌పురలో సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ క్లినిక్ ద్వారా ప్రతిరోజూ సేవల్ని అందిస్తున్నట్లు డాక్టర్ కుశాల్ తెలిపారు.

హెచ్‌సీయూ వర్చువల్ ల్యాబ్స్‌కు నోడల్ సెంటర్‌గా గుర్తింపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని వర్చువల్ ల్యాబ్స్‌కు నోడల్ సెంటర్‌గా గుర్తింపు లభించింది. కేంద్ర విద్యాశాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. అందుకోసం అవసరమైన సర్టిఫికెట్‌ను కూడా విడుదల చేసింది. పరికరాల పరిశోధన, అభివృద్ధి తదితర అంశాలు నోడల్ సెంటర్ పరిశీలనలో ఉంటాయి.

సాహిత్యరంగంలో రంగనాథాచార్యులు విశిష్ట వ్యక్తి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగంలో విశిష్టమైన వ్యక్తి ఆచార్య రంగనాథాచార్యులు అని ప్రముఖ దిగంబర కవి నిఖిలేశ్వర్ అన్నారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆచార్య కేకే రంగనాథాచార్యులు ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ మాట్లాడుతూ..రంగనాథాచార్యులు సాహిత్య రంగంలో విమర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అధ్యక్షతన వహించిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి రంగనాథాచార్యులు అని కొనియాడారు. ఆచార్య పిల్లలమర్రి రాములు, ఊర్మిల రంగనాథం పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న మహిళా సంఘాలు

కవాడిగూడ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, ఆల్ ఇండియా రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మహిళా, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ప్లకార్డులను పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, ఎన్‌ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిలు మాట్లాడుతూ... అంతర్జాతీయ క్రీడల్లో తలపడి వివిధ పతకాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు బీజేపీ ఎంపీ పాల్పడితే.. నెలరోజుల నుండి మహిళా క్రీడాకారులు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. 40కి పైగా కేసులు ఉన్న ఎంపీని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నం చేస్తోందని మండి పడ్డారు. కేసును సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిచే విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్యరసప్రధానం మన్మథ శతకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నాగమారుతి శర్మ, శంకరనారాయణ, కళా జనార్ధనమూర్తి

చిక్కడపల్లి : మన్మథశతకం హాస్యరస ప్రధానంగా ఉందని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. శంకరనారాయణ రచనలు సాధారణంగా వ్యంగ్యంతో కూడి సామాజిక అంశాలు ప్రధానంగా ఉంటాయని ఆవరుసలో ఈ మన్మథశతక రచన సాగిందన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం ప్రముఖ హాస్యావధాని డాక్టర్ శంకరనారాయణ రచించిన మన్మథ శతకం ఆవిష్కరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగమారుతిశర్మ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సాహిత్యం సామాజిక ప్రయోజనం కోసమని నమ్మి రచనలు చేస్తున్న శంకరనారాయణ రచయితగా, అవధానిగా, జర్నలిస్టుగా ప్రసిద్ధి అని ప్రశంసించారు. కవి శంకరనారాయణ తన శతకాన్ని రామారావు, విశ్వేశ్వర్‌రావుకు అంకితమిచ్చారు. గాయని శ్రీమణి పాల్గొన్నారు.

జీఆర్‌టీలో పెళ్లిళ్లకు ప్రత్యేక ఆభరణాలు

సాక్షి, సిటీబ్యూరో: పెళ్లిళ్లకు అవసరమైన ఆభరణాలు వివిధ డిజైన్లలో అందరినీ ఆకట్టుకునేలా జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో అందుబాటులో ఉన్నట్లు సంస్థ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ పేర్కొన్నారు. భారతీయ విలువలు, సంప్రదాయాల్ని దృష్టిలోఉంచుకొని ఆధునిక ట్రెండ్స్‌కు తగ్గట్లుగా వెడ్డింగ్, సెలబ్రేషన్స్ కలెక్షన్స్, గోల్డ్, డైమండ్స్,ప్లాటినం, సిల్వర్‌ఆభరణాలు జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు అపురూప రత్నాలతో ఉంగరాలు, గాజులు, చెవిదుద్దులు, నెక్లెస్‌లు, హారాలు, వడ్డాణాలు తదితరాలు ప్రత్యేక డిజైన్లతో, హస్తకళలతో రూపొందించినట్లు పేర్కొన్నారు. పెళ్లిళ్లు చేసుకునే వారికి, వారి ఇంట్లోవారి అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక డిజైన్లతో వివిధ రకాల ఆభరణాలు కొత్త కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



కొత్త ఆలోచన



ఈ పార్కులు స్త్రీలకు మాత్రమే!

ఢిల్లీలో స్త్రీలకు ఉపశమనం. ఢిల్లీలోని 250 వార్డుల్లో కేవలం స్త్రీలకు మాత్రమే ప్రవేశం కల్పించే 'పింక్ పార్కు'లను ఏర్పాటు చేయనున్నారు. ఆకతాయుల వల్ల, దొంగల వల్ల పార్కులకు వెళ్లాలంటే భయపడే స్త్రీలు ఇళ్లల్లోనే మగ్గాల్సిన అవసరం లేకుండా చేసిన ఆ ఆలోచన మెచ్చుకోలు పొందుతోంది. బహుశా ప్రతి నగరంలో, పట్టణంలో ఇలాంటి పార్కులు ఉండాలేమో.

ఆడవాళ్లు ఉదయాన్నే పార్క్‌కు వెళ్లి నడవాలనుకుంటారు. వారికి సౌకర్యంగా ఉండే బట్టలు వేసుకుని నడుస్తుంటారు. కాని అలా నడిచేవారిని చూడటానికి కొందరు ఆకతాయులు వస్తుంటారు. ఇంకేం నడక? పార్కుకు వచ్చి యోగా మ్యాట్ పరిచి ఆసనాలు వేద్దామనుకుంటారు. అటుగా వెళుతున్న మగవారు ఒక నిమిషం ఆగి చూసినా వారికి అసౌకర్యమే. ఆడవాళ్లు పార్క్‌లో పిల్లలతో ఆడుకోవాలనుకుంటారు. పక్కనే ఒక తండ్రి వచ్చి తన పిల్లలతో ఆడుకుంటూ ఉంటే వారు ఉండగలరా? పార్కుకు వచ్చి ఆడవాళ్లు అక్కడున్న జిమ్ పరికరాలతో ఏవో ప్రయత్నాలు చేయాలనుకుంటారు. మగవారు కూడా లోపల ఉంటే ఎంత ఇబ్బంది. పార్క్‌కు వచ్చిన ఆడవాళ్లు ఊరికే అలా బెంచీ మీద కూచుని పాటలు వినడమో, పుస్తకం చదువుకోవడమో చేయాలనుకున్నా కావలసిన ప్రైవసీ దొరుకుతుందా? ఇంట్లో ఇరవై నాలుగ్గంటలూ ఉండే గృహిణులు, అమ్మమ్మలు, నానమ్మలు, ఉద్యోగం చేసి అలసొచ్చిన స్త్రీలు కాస్త తెరిపిన పడాలంటే ఆహ్లాదమైన, సురక్షితమైన పబ్లిక్ ప్లేస్ ఉంటే ఎలా ఉంటుంది?

వీటన్నింటికి జవాబు 'పింక్ పార్క్'.

ఢిల్లీలో ఉన్న 250 వార్డుల్లో ప్రతి వార్డులోనూ తప్పనిసరిగా ఒక 'పింక్ పార్క్'ను ఏర్పాటు చేయాలని ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. 'ఢిల్లీలో కార్పొరేషన్ పరిధిలో 15000 పార్కులు ఉన్నాయి. ఇవి స్త్రీలు, పురుషులు ఉపయోగించడానికి వీలుగా మెయిన్‌టెయిన్ అవుతున్నాయి. కాని వీటిలోని జిమ్‌లను కాని, వాకింగ్ ట్రాక్‌లను కాని, పిల్లల ప్లే ఏరియాలను కాని ఉపయోగించుకోవడానికి స్త్రీలు ఇబ్బంది పడటం గమనించాం. అందుకే స్త్రీలకు మాత్రమే ప్రవేశం కల్పించే పింక్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నాం' అని కార్పొరేషన్ డిప్యూటి మేయర్ తెలియచేశారు.

నేరాలను దృష్టిలో పెట్టుకుని

ఢిల్లీలో నేరాలు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి. పార్కుల్లో ఆకతాయిల బెడద ఉంటుంది. పిల్లలను ఎత్తుకుని పోయేవారు కూడా ఉండొచ్చు. అందుకని చాలామంది తల్లులు భర్త తోడు లేకుండా రావడానికి సంశయిస్తుంటారు. వీరి కోసమే 'పింక్ పార్కులు' రానున్నాయి.

స్త్రీల నిర్వహణ

పింక్ పార్కులకు ప్రవేశ ద్వారాల దగ్గర మాత్రమే మగ గార్డులు ఉంటారు. లోపల పార్కు నిర్వహణకు, జిమ్‌కు, క్యాంటీన్ దగ్గర ఆడవాళ్లే పని చేస్తారు. 'పదేళ్ల లోపు మగ పిల్లలను మాత్రమే ఈ పార్కుల్లో తల్లులతో పాటు అనుమతిస్తాం' అని కార్పొరేషన్ బాధ్యులు తెలియచేశారు. సీసీ టీవీలు అడుగడుగునా ఉంటాయి. పిల్లలు ఆడుకునే చోట నిఘా ఉంటుంది. దీని వల్ల పిల్లలను ఆడుకోవడానికి వదిలి స్త్రీలు తమ వ్యాయామాలను, నడకను, జిమ్‌ను నిశ్చింతగా కొనసాగించవచ్చు. 'అన్నింటికంటే ముఖ్యం పిల్లలతో హాయిగా ఆడుకోవాలనుకునే తల్లులు బిడియం అక్కర్లేకుండా ఆడుకోవచ్చు' అంటున్నారు ఈ ఆలోచనకు బాధ్యులు.

ప్రతి ఊరిలో అవసరం

బిజీ లైఫ్‌లో స్త్రీలు కాసింత విరామాన్ని, ఆహ్లాదాన్ని కోరుకుంటే అలాంటి వారికి పింక్ పార్కులు గొప్ప ఓదార్పు అవుతాయి. పిల్లల ఆరోగ్యం కోసం, కాలక్షేపం వారిని ఆడించాలనుకునే తల్లులు కూడా వీటి వల్ల మేలు పొందుతారు. తగిన చోటు లేక కనీసం వాకింగ్ కూడా చేయలేని స్త్రీలు వీటి వల్ల చురుకుదనాన్ని, ఆరోగ్యాన్ని పొందే వీలుంటుంది. ఇన్నీ ప్రయోజనాలున్న ఆలోచనను ప్రతి రాష్ట్రంలో ప్రతిపాదించవచ్చు. స్త్రీలు విన్నవిస్తే ప్రభుత్వాలు వింటాయి కూడా. త్వరలో అన్ని ఊళ్లలో ఇలాంటి పార్క్‌లు రావాలని ఆశిద్దాం.

బ్యూటిప్

పాలు... కొబ్బరి... తేనె

ఒక గిన్నెలో రెండు టీ స్పూన్ల పాలు, టేబుల్ స్పూన్ పచ్చికొబ్బరి తురుము, టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, సున్నితంగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా రోజుకు ఒకసారి చేస్తూ ఉంటే పొడిబారిన చర్మం మృదువుగా మారుతుంది.



సేవాపథం

జలకళ తీసుకువచ్చింది

బ్యాంకింగ్ రంగంలో క్షణం తీరిక లేని పనుల్లో ఉండేది వేదిక భండార్కర్. ఆ ఊపిరి సలపని పనుల్లో ఆమెకు కాస్త ఉపశమనం సామాజికసేవ. బ్యాంకింగ్ రంగాన్ని వదిలి సామాజికసేవా రంగం దారిని ఎంచుకున్న వేదిక... 'సామాజిక సేవ మనకు వినయాన్ని నేర్పుతుంది. మనుసులో నుంచి మానవత్వ భావన పోకుండా కాపాడుతుంది. మరిన్ని మంచి పనులు చేయాలనే ఉత్సాహాన్ని ఎప్పుడూ ఇస్తుంది' అంటోంది...



● వేదిక భండార్కర్

'సామాజిక సేవారంగంలో పనిచేస్తానని కలలో కూడా అనుకోలేదు' అంటుంది ముంబైకి చెందిన వేదిక భండార్కర్.

'స్టార్ బ్యాంకర్'గా పేరు తెచ్చుకున్న వేదిక జేపీ మోర్గాన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ హెడ్‌గా పనిచేసింది. ఆ తరువాత మరో కంపెనీలో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో పనిచేసింది.

తన వృత్తిపనుల్లో తలమునకలయ్యే వేదిక తొలిసారిగా ముంబైలోని 'జై వకీల్ ఫౌండేషన్'తో కలిసి పనిచేసింది. ఆ తరువాత 'దస్రా' అనే స్వచ్ఛందసంస్థతో కలిసి జార్ఖండ్, బిహార్ గ్రామీణ ప్రాంతాలలో మహిళలు, బాలికల విద్య, ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంది.

'అప్పుడప్పుడు' అన్నట్లుగా ఉండే ఆమె సామాజికసేవలు ఆతరువాత నిత్యకృత్యం అయ్యాయి.

అలాంటి సమయంలోనే తమ సంస్థకు ఇండియాలో సారథ్యం వహించమని 'వాటర్.ఆర్గ్' నుంచి పిలుపు వచ్చింది.

మిస్సోరీ (యూఎస్) కేంద్రంగా పనిచేసే స్వచ్ఛందసంస్థ 'వాటర్.ఆర్గ్' సురక్షిత నీరు, జలసంరక్షణ, పారిశుద్ధ్యంకు సంబంధించి ఎన్నో దేశాల్లో పనిచేస్తోంది.

ఆ సంస్థ నుంచి ఆహ్వానం అందినప్పుడు నిరాకరించడానికి వేదికకు ఏ కారణం కనిపించలేదు. ఒప్పుకోవడానికి మాత్రం చాలా కారణాలు కనిపించాయి. అందులో ప్రధానమైనది... 'పేదప్రజలకు సేవ చేసే అవకాశం దొరుకుతుంది'

'వాటర్.ఆర్గ్' సారథ్య బాధ్యతలు చేపట్టే ముందు నీటి సంక్షోభం గురించి లోతుగా అధ్యయనం చేసింది వేదిక.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ వో) గణాంకాల ప్రకారం సురక్షితమైన నీటి సౌకర్యానికి నోచుకోని ప్రజలు కోట్లలో ఉన్నారు. నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు మహిళలు. నీటి కోసం గంటల కొద్దీ సమయాన్ని వెచ్చించక తప్పని పరిస్థితుల వల్ల ఆ సమయాన్ని ఇతర ప్రయోజనకర పనులకోసం కేటాయించలేకపోతున్నారు.

'మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతాను' అంటున్న వేదిక ఆ సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తోంది.

మరుగుదొడ్లు నిర్మించుకోవడం నుంచి వాటర్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకోవడం వరకు 'వాటర్.ఆర్గ్' ద్వారా సహాయపడుతోంది.

ఒకసారి క్షేత్రపర్యటనలో భాగంగా కర్ణాటకలోని ఒక గ్రామానికి వెళ్లింది వేదిక.

ఒక మహిళ తన పదకొండు సంవత్సరాల కూతురు గురించి చెప్పింది. ఆ అమ్మాయి చదువుకోడానికి వేరే ఊళ్లో బంధువుల ఇంట్లో ఉంటుంది. అయితే బడికి సెలవులు వచ్చినా ఆ అమ్మాయి ఇంటికి రావడానికి మాత్రం ఇష్టపడడం లేదు. దీనికి కారణం వారి ఇంట్లో టాయిలెట్ సౌకర్యం లేకపోవడం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మహిళ టాయిలెట్ నిర్మించుకోవడానికి సహకరించింది వేదిక.

ఆ గృహిణి కళ్లలో కనిపించిన మెరుపును దగ్గర నుంచి చూసింది.

'బ్యాంకర్‌గా క్లయింట్స్ ఆదాయం ఒక స్థాయి నుంచి మరో స్థాయి పెరగడానికి కృషి చేశాను. ఇప్పుడు...తమకున్న వనరులతోనే సౌకర్యవంతమైన జీవితం ఎలా గడపవచ్చు అనే విషయంలో సామాన్య ప్రజలతో కలిసి పనిచేస్తున్నాను' అంటుంది వేదిక.

ఒకప్పుడు 'స్టార్ బ్యాంకర్'గా బ్యాంకింగ్ రంగంలో ఎన్నో విజయాలు సాధించిన వేదిక భండార్కర్ ఇప్పుడు 'నీటిని మించిన అత్యున్నత పెట్టుబడి ఏదీ లేదు' అంటూ జలసంరక్షణపై ఊరూరా ప్రచారం చేస్తోంది.

సాగుబడి
కృత్తిక కార్తె : మే 24 వరకు
రోహిణీ కార్తె : మే 25 నుంచి

కూరగాయలతో పాటే పుట్టగొడుగులు, కోళ్లు

● సమీకృత వర్టికల్ సిస్టమ్‌కు శాస్త్రవేత్తల రూపకల్పన

భువనేశ్వర్‌లోని కేంద్రీయ మహిళా రైతుల పరిశోధనా సంస్థ (సిఐడబ్ల్యుఎ- ఐసిఏఆర్ అనుబంధం) శాస్త్రవేత్తల బృందం భూమి లేని నిరుపేద మహిళల ఇంటిపంటల సాగుకు ఊతమిచ్చే 'ఇంటిగ్రేటెడ్ వర్టికల్ న్యూట్రి-ఫార్మింగ్ సిస్టమ్'ను రూపొందించింది. బహుళ అంతస్థుల ఐరన్ స్ట్రక్చర్ ఇది. పెరట్లో తక్కువ స్థలంలోనే పైన కూరగాయలు, మధ్యలో పుట్టగొడుగులు, కింద నాటు కోళ్ల పెంపకానికి ఉపయోగపడే విధంగా దీన్ని రూపొందించారు.

డా. తానియా సేథ్, డా. అరుణ్ కుమార్ పండా, చైత్రాలి శంషాక్ మాత్రే సిఐడబ్ల్యుఎ శాస్త్రవేత్తల బృందం బహుళ ప్రయోజనాలను అందించే ఈ వినూత్న స్ట్రక్చర్‌ను ఆవిష్కరించారు. భూమి లేని నిరుపేద కుటుంబాలకు దీన్ని అందిస్తే ఆ కుటుంబం తీసుకునే ఆహారంలో వైవిధ్యత పెరుగుతుంది. పెరట్లో తక్కువ స్థలం ఉన్నా దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఏడాది పొడవునా సేంద్రియ కూరగాయలు, పుట్టగొడుగులు, గుడ్లు, కోడిమాంసం అందుబాటులో ఉంటాయి. ఈ పేద కుటుంబాలు వీటిని ఉపయోగించడంతో పాటు ఎంతో కొంత అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని ఆశిస్తున్నారు. మహిళలు, పిల్లల పౌష్టికాహార లోపాన్ని తగ్గించడానికి ఈ న్యూట్రి-ఫార్మింగ్ సిస్టం పనికొస్తుందని వారు అంటున్నారు. ఇనుముతో దీన్ని తయారు చేయడానికి రూ. 30 వేల వరకు ఖర్చవుతుందని డా. తానియా 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఈ టెక్నాలజీని సిఐడబ్ల్యుఎ నుంచి ఎవరైనా కొనుగోలు చేసి, ఈ స్ట్రక్చర్లను తయారు చేసి విక్రయించవచ్చు. ఇప్పటికే గుజరాత్ వల్సాద్‌లోని సెంట్రిఫ్యూగల్ ప్రొడక్ట్స్, లక్నోలోని తనగర్ సంస్థలకు టెక్నాలజీని ఇప్పటికే విక్రయించామని ఆమె అన్నారు. టెక్నాలజీని పొందడానికి లైసెన్స్ ఫీజుగా రైతులకు రూ. 11వేలు+ జీఎస్టీ. వ్యాపారులకు రూ. 20 వేలు+జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని డా. తానియా వివరించారు. **వివరాలకు.. 06742387940. director.ciwa@icar.gov.in**

దేశీ వరి పరిరక్షకులకు శిక్షణ

దేశీ వరి విత్తనాలు మన వ్యవసాయక సమాజపు అమూల్యమైన వారసత్వ సంపద. 25 ఏళ్లుగా 1,440 దేశీ వరి వంగడాలను జన్యుస్వచ్ఛత ఏ విధంగానూ కోల్పోకుండా ప్రతి ఏటా సాగు చేస్తూ, వీటిలో చాలా రకాలను రైతులకు ఉచితంగా పంచిపెడుతూ కంటికి కాపాడుతున్న సుప్రసిద్ధ విత్తన సంరక్షణ ఉద్యమకారుడు, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త డా. దేబల్ దేవ్ వృద్ధాప్యం కారణంగా ఈ గురుతర బాధ్యతలను నిబద్ధత కలిగిన దేశీ విత్తన సంరక్షకులు ఎవరైనా ఉంటే వారికి బదలాయించాలని నిర్ణయించుకున్నారు. 1997లో 'బసుధ' పేరిట పరిశోధన ప్రయోగశాలను, 'వ్రిహి' పేరిట విత్తన బ్యాంకు బాధ్యతలను ఆయన చేపట్టారు. ప్రభుత్వేతర నిధుల ద్వారానే నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో ప్రారంభించిన దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమ కేంద్రాన్ని 2011లో ఒడిషాలోని రాయగడ జిల్లాలో కుగ్రామానికి డా. దేబల్ దేవ్ మార్చారు. ప్రతి వరి వంగడానికి 56 వ్యవసాయ సంబంధమైన విశిష్ట గుణాలుంటాయి. 4 రసాయనిక గుణాలు ఉంటాయని ఆయన చెబుతారు. పూత కాలంలో పరపరాగ సంపర్కం ద్వారా 82% మేరకు వరి వంగడాలు స్వచ్ఛతను కోల్పోయే అవకాశం ఉంటుంది. అందుకని, ఒకేసారి పూతకు వచ్చే రకాలను దగ్గర్లో సాగు చేయకూడదు. విత్తనాలు కూడా భౌతికంగా కలిసిపోకుండా చూడాలి. ఈ పరిరక్షణ కృషి ఎంతో కష్టంతో కూడుకున్నది. కేవలం ముగ్గురు సిబ్బందితో ఇన్నాళ్లూ ఏటేటా వీటిని కల్తీ జరగకుండా సాగు చేస్తూ, గుణగణాలను స్వీయ ప్రయోగశాలలో పరీక్షించి చూస్తూ స్వచ్ఛతను ఆయన కాపాడుతూ వస్తున్నారు. ఆసియాలో ఇలాంటి బృహత్తర పని చేస్తున్న మరో స్వచ్ఛంద సంస్థ లేదని డా. దేబల్ దేవ్ తెలిపారు. 11 రాష్ట్రాల్లో సుమారు 7 వేల మంది రైతులకు 860 రకాల దేశీ వరి రకాలను వ్రిహి సీడ్ బ్యాంక్ ద్వారా పంపిణీ చేశారు. ఈ ఏడాది తీసుకున్న విత్తనానికి రెట్టింపు విత్తనం రైతులు తిరిగి ఇవ్వాలి. అంతే. విత్తనం ఎవరికీ అమ్మకూడదు. విత్తన వ్యాపారం సంస్థలకు ఇవ్వకూడదు. ఇదీ డా. దేబల్ దేవ్ సిద్ధాంతం.

విత్తన పరిరక్షణపై ఆసక్తి ఉన్న 182 మందికి గత 20 ఏళ్లలో డా. దేబల్ దేవ్ శిక్షణ ఇచ్చి, విశిష్టమైన వంగడాలను వారికి ఇచ్చారు. అయితే, ఆరుగురు మాత్రమే కొన్ని రకాలను త్రికరణ శుద్ధితో పరిరక్షిస్తున్నారని ఆయన తెలిపారు. వయోభారం వల్ల ఈ పరిరక్షణ బాధ్యతను కొనసాగించలేనని, ఆసక్తి గల కొత్త వారు ఎవరైనా ఉంటే 12 మందిని లేదా స్వచ్ఛంద సంస్థలను ఎంపిక చేసి వచ్చే జూలై నుంచి శిక్షణ ఇస్తానన్నారు. వారు తలా ఒక 100 రకాలను పరిక్షించాల్సి ఉంటుందన్నారు. స్వచ్ఛతను కాపాడుతూ ప్రతి ఏటా సాగు చేస్తూ రైతులకు ఉచితంగా పంచాల్సి ఉంటుంది. ఆసక్తి గల వారెవరైనా ఉంటే డా. దేబల్ దేవ్‌ను మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. జూన్ 30లోగా ఎవరూ యోగ్యులు దొరక్క పోతే వ్రిహి విత్తన బ్యాంకు మూతపడుతుందని, దేశీ వరి వంగడాలు మాత్రం కలకాలం నిలుస్తాయని ఆయన తెలిపారు.
basudha.lab@gmail.com



● డా. దేబల్ దేవ్

■ ఎంబీయే చదివి పాడి రైతుగా రాణిస్తున్న యువ రైతు **అప్పలనాయుడు**

■ 40 ఎకరాల కౌలు భూమిలో ఆధునిక పశుగ్రాసాల సాగు

■ పాడికి తోడుగా సైలేజీ గడ్డి విక్రయం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం

కౌలు సేద్యంలో గెలిచాడు!



● అప్పలనాయుడు మినీ డెయిరీ

పాడి పరిశ్రమ నిర్వహణలో మేటిగా పురస్కారాలు అందుకుంటున్న ఆళ్ల అప్పలనాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంబీఏ చదివినా ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా పాడి పరిశ్రమనే నమ్ముకొని అభివృద్ధి సాధిస్తూ విజయాన్ని తన సొంతం చేసుకున్నారు. శ్రద్ధగా చేస్తే పాడి పరిశ్రమ కౌలు రైతులకు కూడా లాభదాయకంగా ఉంటుందనడానికి చక్కని ఉదాహరణ అప్పలనాయుడు సోదరుల వ్యవసాయం నిలుస్తుంది. అనకాపల్లి జిల్లా కశింకోట మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అప్పలనాయుడు ఎంబీఎ చదివారు. ఉద్యోగం పట్ల ఆసక్తి చూపలేదు. మరొకరి కింద పని చేయడం సుతరాం ఇష్టపడలేదంటారాయన. 2008లో పశు సంవర్థక శాఖ ద్వారా పశు క్రాంతి పథకం కింద (సగం రాయితీపై) రూ.75 వేల రుణం పొంది, 2 పాడి ఆవులు కొనుగోలు చేసి పాడి రైతుగా స్వయంకృషితో జీవనాన్ని ప్రారంభించారు. ఏ పని చేసినా దీక్షగా చేసే అలవాటున్న అప్పలనాయుడు సత్ఫలితాలు సాధిస్తూ పురోగమించారు. 2012లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో 30 శాతం రాయితీపై మినీ డెయిరీ పథకానికి రూ.5 లక్షల రుణం మంజూరైంది. పది పాడి ఆవులను కొనుగోలు చేసి తన సొంత స్థలం అరెకరంలో మినీ డెయిరీ ఏర్పాటు చేశారు. సోదరులు శివకృష్ణ, సత్తిబాబుల సహకారంతో పాలను విక్రయిస్తున్నారు. క్రమేపీ అనుభవం గడిస్తూ పాడి రైతుగా సమృద్ధి సాధించారు. ఇప్పుడు ఆయన డెయిరీ ఫాంలో 52 ఆవులు ఉన్నాయి. రోజుకు 220 లీటర్ల పాలు ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు.

కౌలు రైతుల పశుగ్రాసం సాగుకు 'ఉపాధి' పథకం వర్తింపజెయ్యాలి



● విజయవాడలో సీకె రావు ఎండోమెంటు ట్రస్టు బంగారు పతకాన్ని మంత్రి అప్పలరాజు నుంచి అందుకుంటున్న అప్పలనాయుడు

ఎంబీఏ చదివినా వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధి పొందాలని నిర్ణయించుకొని లాభదాయకమైన పాడి అభివృద్ధిపై దృష్టి పెట్టి విజయం వైపు పయనిస్తున్నాను. పది మందికి ఉపాధి కల్పిస్తున్నానన్న సంతృప్తి ఉంది. పాడి ఆవులతో డెయిరీ నిర్వహణ, పాతర గడ్డి తయారీ, మేలు జాతి గడ్డి రకాల పెంపకం చాలా లాభదాయకంగా ఉంది. నెలకు వీటి ద్వారా సుమారు రూ.60 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. పురస్కారాలు అందుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధికి మున్ముందు మరింత కృషి చేస్తాను. కౌలు రైతుల పశుగ్రాసం సాగుకు ఉపాధి పథకం వర్తింపజేయటం ద్వారాప్రభుత్వం సహాయం అందిస్తే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. పాడి పరిశ్రమపై మక్కువ ఉన్న యువతకు, రైతులకు శిక్షణతో పాటు ఆర్థిక సహాయం అందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలి.



- ఆళ్ల అప్పలనాయుడు,
అభ్యుదయ పాడి రైతు, కశింకోట, అనకాపల్లి జిల్లా

పాతర గడ్డి ఉత్పత్తి ఇలా...

పశు పోషణకు, పాల ఉత్పత్తిని పెంపొందించడానికి ఉపయోగపడే నాణ్యమైన పాతర గడ్డి తయారీపై అప్పలనాయుడు సోదరులు దృష్టి సారించారు. 2018లో రూ. కోటి పెట్టుబడితో శిలప రౌట్టి చిట్టిమ్మ భాగస్వామ్యంతో సైలేజ్ యంత్రం (పాతర గడ్డి తయారీ యంత్రం) కొనుగోలు చేశారు. పశు సంవర్థక శాఖ 50% రాయితీ కల్పించింది. మొక్కజొన్న పంట విత్తిన 75 రోజులు దాటాక పాలకంకి స్థాయి (మొక్కజొన్న పొత్తులు గోరు గిల్లితే పాలు వచ్చే దశ)లో ఉన్నప్పుడు మొక్కజొన్న కర్రలను ముక్కలుగా కట్ చేస్తారు. ఆధునిక పాతర గడ్డి యంత్రం ద్వారా నిల్వ కోసం అనుమతించిన మందులు కలిపి గుండ్రటి బేళ్లుగా తయారు చేస్తారు. ఇవి 21 రోజుల తర్వాత అమ్మకానికి సిద్ధమవుతాయి. తక్కువ ధరపై కిలో 6.50కు పాడి రైతులకు అందుబాటులో ఉంచుతారు. ఈ పాతర గడ్డి ఏడాది వరకూ నిల్వ ఉంటుంది.

వేసవి కాలంలో పచ్చిగడ్డి అందుబాటులో లేనప్పుడు, ప్రవృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు గ్రాసం కొరత రాకుండా పాతర గడ్డి ఉపయోగపడుతుంది. ఒక్కొక్క పాడి పశువుకు రోజుకి 30 కిలోల వరకు పాతర గడ్డి అవసరం అవుతుంది. ఒక పాడి గేదెకు పాతర గడ్డి మేపితే రూ.210 ఖర్చుతో సరిపోతుంది. ఇది ఉంటే దాణా కూడా వేయాల్సిన పని ఉండదు. రోజుకు ఐదు కిలోల దాణాకు అయ్యే రూ.150 ఖర్చు కూడా తగ్గుతుంది. ఈ గడ్డి వల్ల అధిక పాల దిగుబడి వస్తుంది. పాతర గడ్డిని అప్పలనాయుడు స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి ఆదాయాన్ని సంపాదిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఆయన డెయిరీ ఫాంలో పశుపోషణ, గడ్డి పెంపకం, పాతర గడ్డి తయారీ పనుల్లో రోజూ పది మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



● సైలేజ్ యంత్రంతో తయారు చేసిన పాతర గడ్డి



● సాగులో ఆధునిక నేపియర్ గడ్డి

40 ఎకరాల్లో పశు గ్రాసం సాగు

40 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని అప్పలనాయుడు మేలు రకాల పచ్చగడ్డి పెంపకాన్ని చేపట్టారు. పాతర గడ్డి తయారీ కోసం మొక్కజొన్నతో పాటు బహుళజాతి, ఆధునిక మేలు జాతి పశుగ్రాసాలు పెంచుతున్నారు. సూపర్ నేపియర్, కొంబో నేపియర్, రెడ్ నేపియర్, 4జి బుల్లెట్ నేపియర్, స్మార్టు నేపియర్ వంటి రకాల గ్రాసం పెంచి సొంతానికి వాడుకోగా మిగిలిన గ్రాసాన్ని రైతులకు టన్ను రూ. 2500కు విక్రయిస్తున్నారు. గడ్డి రకాల పెంపకానికి రైతులకు విత్తన కర్రలు (ముచ్చులు) తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఆధునిక పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష సేవలందిస్తున్నందుకు గుర్తింపుగా అప్పలనాయుడుకు రెండుసార్లు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రభుత్వ పురస్కారాలు దక్కాయి. డా.సీకె రావు ఎండోమెంటు ట్రస్టు తరఫున గత నెలలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి చిదిరి అప్పలరాజు చేతుల మీదుగా ఉత్తమ పాడి రైతు బంగారు పతకం, జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2019లో పద్మశ్రీ డాక్టర్ ఐవి సుబ్బారావు 'రైతు నేస్తం' పురస్కారాన్ని హైదరాబాద్‌లో అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుతం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సభ్యునిగా కొనసాగుతున్నారు.

- వేగి రామచంద్రరావు,
సాక్షి, కశింకోట, అనకాపల్లి జిల్లా

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ ఓటమి

ఇటాలియన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. రోమ్‌లో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-7 (8/10), 10-12తో డిమినార్-కుబ్లర్ (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓడిపోయింది. గంటా 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సూపర్ టైబ్రేక్‌లో బోపన ద్వయం ఒక మ్యాచ్ పాయింట్ చేజార్చుంది. బోపన్న జోడీకి 29,300 యూరోల (రూ. 26 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



నితీశ్ రాణాపై రూ. 24 లక్షల జరిమానా

చెన్నై సూపర్‌కింగ్స్‌తో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కెప్టెన్ నితీశ్ రాణాపై రూ. 24 లక్షలు జరిమానా విధించారు. ఈ సీజన్‌లో కోల్‌కతా జట్టు స్లో ఓవర్‌రేట్ నమోదు చేయడం ఇది రెండో సారి. స్లో ఓవర్ రేట్‌తో ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా (గుజరాత్), విరాట్ కోహ్లి, డు ప్లెసిస్ (బెంగళూరు), సంజూ సామ్సన్ (రాజస్తాన్), సూర్యకుమార్ యాదవ్ (ముంబై), కేఎల్ రాహుల్ (లక్నో), వార్నర్ (ఢిల్లీ)లపై కూడా జరిమానా పడింది.

'సాఫ్ట్ సిగ్నల్'కు కాలం చెల్లింది

క్రికెట్‌లో ఇం'కొన్ని' మార్పులు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తరుచూ వివాదాస్పదమవుతున్న నిర్ణయాలను సవరించింది. సాఫ్ట్ సిగ్నల్, ఫ్రీ హిట్‌కు బౌల్డయితే పరుగులపై స్పష్టతనిచ్చింది. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొనే బ్యాటర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే! ఇకపై తన ఇష్టానికి వదిలేయరు. ఇది ఐసీసీ కొత్త రూల్!

సాఫ్ట్ సిగ్నల్: సాధారణంగా క్యాచ్‌లు పట్టినపుడు తీసుకునే నిర్ణయాలు. బౌండరీకి దగ్గరో, లేదంటే బంతి నేలను తాకినట్లు పట్టిన క్యాచ్‌లు వివాదాస్పదమవుతాయి. ఫీల్డ్ అంపైర్ తొలుత అవుటిచ్చినా... దాన్ని మళ్లీ టీవీ (థర్డ్) అంపైర్‌కు నివేదిస్తారు. కానీ మళ్లీ సాఫ్ట్ సిగ్నల్ ప్రకారం అవుటనే ప్రకటిస్తారు. ఇప్పుడు 'సాఫ్ట్'కు కాలం చెల్లింది. టీవీ అంపైర్‌దే తుది నిర్ణయమవుతుంది. దీంతో ఫీల్డ్ అంపైర్‌కు ఇది మరో కోతలాంటిది!

ఫ్రీ హిట్‌కు బౌల్డయితే: ఫ్రీ హిట్‌కు బౌల్డయితే బ్యాటర్ తీసిన పరుగులు చట్టబద్ధమే! ఇందులో ఎలాంటి వివాదానికి తావులేదని ఐసీసీ కమిటీ ప్రకటించింది. అయితే ఇలా తీసిన పరుగులు ఎక్స్‌ట్రాల కోటలో జమకావు. బ్యాటర్స్ ఖాతాలోకి వెళ్తాయి. గత టి20 ప్రపంచకప్‌లో భారత్, పాక్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఫ్రీ హిట్‌కు బౌల్డయి మూడు పరుగులు రాబట్టాడు. పాక్ క్రికెటర్లు గగ్గోలు పెడితే అంపైర్లు నియమావళిని వివరించినా... చాన్నాళ్లు దీనిపై చర్చ నడిచింది!

హెల్మెట్ ఐచ్ఛికం కాదు... కచ్చితం: పేసర్లు బౌలింగ్‌కు దిగితే బ్యాటర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. అలాగే బ్యాటర్లకు చేరువగా మోహరించిన ఫీల్డర్లు సైతం హెల్మెట్ పెట్టుకోవాలి.

'మా నిరసన ఎల్లలు దాటిస్తాం'



న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయకపోతే తాము చేపట్టిన నిరసన దీక్షను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తామని స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ హెచ్చరించారు. 'మా నిరసనను ఎల్లలు దాటిస్తాం. అంతర్జాతీయ క్రీడాకారులు, ఒలింపియన్ల మద్దతు కోరతాం. విదేశీ ఆటగాళ్లు కూడా ఇందులో గళం విప్పేలా ప్రణాళికతో ముందుకెళ్తాం' అని వినేశ్ తెలిపారు.

టైటాన్స్ క్వాలిఫై... సన్‌రైజర్స్ అవుట్

ఐపీఎల్–2023లో హైదరాబాద్ టీమ్ సన్‌రైజర్స్ ఆట ముగిసింది. 2021, 2022లలో 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించలేకపోయిన జట్టు వరుసగా మూడో ఏడాదీ విఫల ప్రదర్శనతో ముందంజ వేసే అవకాశాలు కోల్పోయింది. గుజరాత్ టైటాన్స్ చేతిలో తాజా ఓటమితో జట్టు అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించింది. ఈ గెలుపుతో డిఫెండింగ్ చాంపియన్ టైటాన్స్ అందరికంటే ముందుగా ప్లే ఆఫ్స్ చేరడంతో పాటు టాప్–2లో చోటును ఖాయం చేసుకుంది.



గిల్

- 'ప్లే ఆఫ్స్'కు గుజరాత్
- నిష్క్రమించిన హైదరాబాద్
- 34 పరుగులతో టైటాన్స్ విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌కు దూరమైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 34 పరుగుల తేడాతో సన్‌రైజర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (58 బంతుల్లో 101; 13 ఫోర్లు, 1 సిక్స్) ఐపీఎల్‌లో తన తొలి సెంచరీ సాధించగా, సాయి సుదర్శన్ (36 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు 84 బంతుల్లో 147 పరుగులు జోడించగా, భువనేశ్వర్ (5/30) ఐదు వికెట్లతో రాణించాడు. గుజరాత్ జట్టు 40 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 8 వికెట్లు చేజార్చుకుంది. భువీ వేసిన ఆఖరి ఓవర్లోనే 4 వికెట్లు కోల్పోయింది. ఇందులో ఒక రనౌట్ కూడా ఉంది. అనంతరం సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 154 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 64; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా... షమీ, మోహిత్ శర్మ చెరో 4 వికెట్లు తీశారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమంలో భాగంగా గుజరాత్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో 'లావెండర్' రంగు జెర్సీలు ధరించారు. ఛేదనలో రైజర్స్ ఏమాత్రం పోరాటం కనబర్చలేకపోయింది. క్లాసెన్ మినహా ఇతర ఆటగాళ్లు కనీస స్థాయి ప్రదర్శన కూడా చూపలేదు. తొలి 6 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయిన సన్‌రైజర్స్ జట్టు తర్వాతి మూడు ఓవర్లలో మరో మూడు వికెట్లు చేజార్చుకొని విజయంపై ఆశలు కోల్పోయింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	12	6	6	0	12	-0.268
హైదరాబాద్	12	4	8	0	8	-0.575
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) అభిషేక్ (బి) భువనేశ్వర్ 0; శుబ్‌మన్ గిల్ (సి) సమద్ (బి) భువనేశ్వర్ 101; సుదర్శన్ (సి) నటరాజన్ (బి) జాన్సెన్ 47; హార్దిక్ పాండ్యా (సి) త్రిపాఠి (బి) భువనేశ్వర్ 8; మిల్లర్ (సి) మార్క్‌రమ్ (బి) నటరాజన్ 7; తెవాటియా (సి) జాన్సెన్ (బి) ఫారుఖీ 3; షనక (నాటౌట్) 9; రషీద్ (సి) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 0; నూర్ (రనౌట్) 0; షమీ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0; మోహిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 188.** **వికెట్ల పతనం:** 1-0, 2-147, 3-156, 4-169, 5-175, 6-186, 7-186, 8-186, 9-187. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-30-5, జాన్సెన్ 4-0-39-1, ఫారుఖీ 3-0-31-1, నటరాజన్ 4-0-34-1, మార్క్‌రమ్ 1-0-13-0, మయాంక్ మార్కండే 3-0-27-0, అభిషేక్ శర్మ 1-0-13-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్ (సి) రషీద్ (బి) షమీ 5; అభిషేక్ (సి) సాహా (బి) యశ్ 5; మార్క్‌రమ్ (సి) షనక (బి) షమీ 10; త్రిపాఠి (సి) తెవాటియా (బి) షమీ 1; క్లాసెన్ (సి) మిల్లర్ (బి) షమీ 64; సన్వీర్ (సి) సుదర్శన్ (బి) మోహిత్ 7; సమద్ (సి) (సబ్) మావి (బి) మోహిత్ 4; జాన్సెన్ (సి) పాండ్యా (బి) మోహిత్ 3; భువనేశ్వర్ (సి) రషీద్ (బి) మోహిత్ 27; మార్కండే (నాటౌట్) 18; ఫారుఖీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 154.** **వికెట్ల పతనం:** 1-6, 2-11, 3-12, 4-29, 5-45, 6-49, 7-59, 8-127, 9-147. **బౌలింగ్:** షమీ 4-0-21-4, యశ్ దయాళ్ 4-0-31-1, రషీద్ 4-0-28-0, మోహిత్ శర్మ 4-0-28-4, నూర్ 2.5-0-35-0, తెవాటియా 1.1-0-7-0.

'గ్రాండ్‌మాస్టర్' ప్రణీత్‌కు కేసీఆర్ అభినందన

రూ. 2 కోట్ల 50 లక్షలు నజరానా ప్రకటన



సాక్షి, హైదరాబాద్: భారత్ నుంచి 82వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన తెలంగాణ కుర్రాడు ఉప్పల ప్రణీత్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అభినందించారు. ప్రణీత్ తన తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, ధనలక్ష్మిలతో కలిసి సోమవారం సచివాలయంలో సీఎంను కలిశాడు. ప్రణీత్ ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేసిన కేసీఆర్...అతను మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రణీత్ ఇతర టోర్నీల కోసం సన్నద్ధమయ్యేందుకు, మరింత మెరుగైన శిక్షణ తీసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకంగా రూ. 2 కోట్ల 50 లక్షలను తెలంగాణ సీఎం ప్రకటించారు. రాష్ట్రం తరఫున గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన ఐదో ఆటగాడిగా ప్రణీత్ గుర్తింపు పొందాడు. మరోవైపు మహిళా క్యాండిడేట్ మాస్టర్ (డబ్ల్యూసీఎం) హోదా పొందిన చెస్ ప్లేయర్ వీర్లపల్లి నందినికి రూ. 50 లక్షల ప్రోత్సాహకాన్ని సీఎం ప్రకటించారు. ఈ దిశగా తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా తన కార్యదర్శి భూపాల్ రెడ్డిని సీఎం ఆదేశించారు.

రన్నరప్ హంపి



బెర్లిన్: వరల్డ్ చెస్ అర్మగెడాన్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ మహిళల టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి రన్నరప్‌గా నిలిచింది. బిబిసారా అసాబయేవా (కజకిస్తాన్)తో జరిగిన ఐదు గేమ్‌ల ఫైనల్లో హంపి 1.5-3.5తో ఓడిపోయింది. తొలి గేమ్‌లో హంపి 33 ఎత్తుల్లో ఓడిపోగా.. రెండో గేమ్‌లో హంపి 41 ఎత్తుల్లో గెలిచింది. మూడో గేమ్‌లో 61 ఎత్తుల్లో, నాలుగో గేమ్‌లో 27 ఎత్తుల్లో బిబిసారా విజయం సాధించింది. ఐదో గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఎనిమిది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఈ టోర్నీ జరిగింది. మహిళల టోర్నీ విన్నర్, రన్నరప్ హోదాలో బిబిసారా, హంపి ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే అర్మగెడాన్ గ్రాండ్ ఫైనల్ టోర్నీకి అర్హత సాధించారు. గ్రాండ్ ఫైనల్ టోర్నీకి ఇప్పటికే సో వెస్లీ, సామ్ షాంక్‌లాండ్ (అమెరికా), దొమ్మరాజు గుకేశ్ (భారత్), నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్) కూడా అర్హత పొందారు. త్వరలో యూరోప్, ఆఫ్రికా రీజియన్ మధ్య జరిగే టోర్నీ ద్వారా మరో ఇద్దరికి గ్రాండ్ ఫైనల్ టోర్నీకి బెర్త్‌లు లభిస్తాయి.

భారత జట్టుకు నిరాశ

మలేసియా చేతిలోనూ పరాజయం




సింధు

సుజౌ (చైనా): సుదిర్మన్ కప్ వరల్డ్ టీమ్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో పరాజయంతో భారత జట్టు కథ ముగిసింది. మలేసియాతో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో 0-5తో ఓడిపోయింది. బుధవారం జరిగే నామమాత్రమైన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది. మలేసియాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో ధ్రువ్-అశ్విని పొన్నప్ప 16-21, 17-21తో గో సూన్ హువాట్-లాయ్ షెవన్ జెమీ చేతిలో ఓడిపోయారు. రెండో మ్యాచ్‌లో శ్రీకాంత్ 16-21, 11-21తో లీ జియా జీ చేతిలో... మూడో మ్యాచ్‌లో పీవీ సింధు 21-14, 10-21, 20-22తో గో జిన్ వె చేతిలో ఓడటంతో భారత ఓటమి ఖరారైంది. నామమాత్రమైన నాలుగో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 18-21, 19-21తో ఆరోన్ చియా-సో వుయ్ యిక్ చేతిలో... ఐదో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ 15-21, 13-21తో పియర్లీ-థినా చేతిలో ఓడిపోయారు.

సినిమా

కొట్టర కొట్టు.. బొక్కలు చూర అయ్యేటట్టు..



● రామ్

'నీ స్టేటు దాటలేనన్నావ్... దాటా!', 'నీ గేటు దాటలేనన్నావ్... దాటా!', నీ పవర్ దాటలేనన్నావ్...దాటా!', 'ఇంకేంటి దాటేది...!' అనే డైలాగ్స్‌తో విడుదలైంది రామ్ కొత్త సినిమా టీజర్. బోయపాటి శ్రీను దర్శకత్వంలో పవన్ కుమార్, జీ స్టూడియోస్ సౌత్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోమవారం (మే 15) హీరో రామ్ బర్త్ డే సందర్భంగా 'ఫస్ట్ థండర్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సదర్ ఉత్సవాల నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీన్ విజువల్స్‌లో 'కొట్టర కొట్టు... నరాలు కట్టు! బొక్కలు చూర అయ్యేటట్టు..' అనే బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ టీజర్‌లో వినిపించింది. ''మా హీరో రామ్ మేకోవర్, యాక్టింగ్, బోయపాటి శ్రీనుగారి డైరెక్షన్, తమన్ రీ రికార్డింగ్ ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో టైటిల్, ఇతర వివరాలు వెల్లడిస్తాం. దసరా సందర్భంగా అక్టోబర్ 20న తెలుగు, హిందీ, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

పవర్‌ఫుల్ రుద్ర



● వైష్ణవ్ తేజ్

అదొక చిన్న గ్రామం. ఆ గ్రామంలోని శివాలయాన్ని కొందరు గూండాలు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వారిని అడ్డుకోవడానికి రుద్ర రంగంలోకి దిగుతాడు. ఈ గొడవ ఎక్కడికి దారి తీసింది? తర్వాత ఏం జరిగింది? అనే కథాంశంతో హీరో వైష్ణవ్ తేజ్ తాజా చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి 'ఆది కేశవ' అనే టైటిల్‌ని ఖరారు చేసి, పాత్రలను పరిచయం చేస్తూ సోమవారం ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్‌లో పవర్‌ఫుల్ రుద్రగా ఉగ్రరూపం చూపించారు వైష్ణవ్ తేజ్. చిత్ర పాత్రలో హీరోయిన్ శ్రీలీల, వజ్ర కాళేశ్వరి దేవిగా కీలక పాత్రలో అపర్ణా దాస్, విలన్‌గా జోజు జార్జ్ నటిస్తున్నారు. జూలైలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఎస్. నాగ వంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, కెమెరా: డడ్లీ.

స్పెషల్ ఫోకస్



● జ్యోతిక

బాలీవుడ్‌పై జ్యోతిక స్పెషల్ ఫోకస్ పెట్టినట్లున్నారు. వరుసగా ఆమె హిందీ ప్రాజెక్ట్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇరవయ్యేళ్ల తర్వాత ఇటీవల హిందీ చిత్రం 'శ్రీ'లో నటించారు జ్యోతిక. వ్యాపారవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్‌గా రూపొందిన ఈ సినిమాలో రాజ్ కుమార్ రావు టైటిల్ రోల్ చేశారు. అలాగే ఓ హిందీ వెబ్ సిరీస్‌కు జ్యోతిక సైన్ చేశారనే టాక్ కొన్ని నెలల క్రితం బీటౌన్‌లో బలంగా వినిపించింది. తాజాగా మరో హిందీ ప్రాజెక్ట్‌కు జ్యోతిక సై అన్నారు. వికాస్ బాల్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, మాధవన్ ప్రధాన పాత్రధారులుగా హిందీలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో అజయ్ దేవగన్ భార్య పాత్రలో జ్యోతిక కనిపిస్తారట. గుజరాతీ ఫిల్మ్ 'వష్'కు ఈ చిత్రం రీమేక్ అని భోగట్టా.


నేతాజీ జీవిత రహస్యాలతో...



● నిఖిల్

''నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి సంబంధించి మీరు ఎప్పుడూ వినని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. అందుకే మొదటి టీజర్‌ని నేతాజీ విగ్రహం వద్ద విడుదల చేయాలనుకున్నాం. ఇక్కడ టీజర్‌ను విడుదల చేసే అవకాశం దక్కడం గౌరవంగా భావిస్తున్నాం. నేతాజీ జీవితంపై సాగే అవుట్ అండ్ అవుట్ యాక్షన్ చిత్రం ఇది'' అన్నారు నిఖిల్. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితంలోని రహస్యాల ఆధారంగా రూపొందిన చిత్రం 'స్పై'. నిఖిల్ హీరోగా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం దగ్గర రిలీజ్ చేశారు. నేతాజీ మరణం తాలూకు మిస్టరీని ఛేదించే స్పై పాత్రలో నిఖిల్ కనిపిస్తారు. ఐశ్వర్యా మీనన్, సన్యా ఠాకూర్ కథానాయికలుగా, ప్రత్యేక పాత్రలో ఆర్యన్ రాజేష్ కనిపించనున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో జూన్ 29న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, కెమెరా: వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్.

గాఢమైన ప్రేమకథ



● శివ

శివ కందుకూరి హీరోగా నటించిన తాజా ఇంటెన్స్ లవ్ స్టోరీ (గాఢమైన ప్రేమకథ) 'మను చరిత్ర'. ఇందులో మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించారు. భరత్ పెదగానిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్. శ్రీనివాస రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను జూన్ 23న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. శ్రీ విజయ ఫిల్మ్స్ ఈ సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. ''వరంగల్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ లవ్ స్టోరీ ఇది. ఇందులో ఇంటెన్స్ ఉన్న క్యారెక్టర్‌ను శివ చేశారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్.


జూన్‌లో దర్శకులు మధుసూదనరావు శత జయంతి ఉత్సవాలు



● శివాజీ రాజా, వాణీ దేవి, కోదండ రామిరెడ్డి

ప్రముఖ దివంగత దర్శకులు వీరమాచనేని మధుసూదనరావు (జూన్ 14, 1923లో జన్మించారు) శతజయంతి ఉత్సవాలు జూన్ 11న హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన సమావేశంలో దర్శకుడు కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ– ''మధుసూదనరావుగారు మన మధ్య లేకపోయినా దర్శకుడిగా ఆయన ప్రతిభ మరికొన్ని వందల ఏళ్లు బతికే ఉంటుంది. ఆయన దగ్గర శిష్యరికం చేయడం నా అదృష్టం'' అన్నారు. ''నాన్నగారి శత జయంతి ఉత్సవాలకు సినీ పరిశ్రమ నుంచి అందర్నీ ఆహ్వానిస్తున్నాం'' అన్నారు మధుసూదనరావు కుమార్తె వాణీదేవి. ''ఈ సంవత్సరం నందమూరి తారక రామారావుగారు, అక్కినేని నాగేశ్వరరావుగారు, సూర్యకాంతంగారు, వి. మధుసూదనరావుగారి శత జయంతి కావడం తెలుగు పరిశ్రమ పులకించి పోయే సంవత్సరం. మన మధ్య లేకపోయినా వారు పరిశ్రమకు చూపించిన మంచి మార్గాన్ని ఎప్పటికీ అనుసరిస్తూనే ఉంటాం'' అన్నారు శివాజీరాజా. ''మావయ్య విలువలతో జీవించారు. అదే విలువలను తన చిత్రాల ద్వారా పది మందికి పంచటానికి ప్రయత్నించారు'' అన్నారు నాని (మధుసూదనరావు మేనల్లుడు). ఈ కార్యక్రమంలో మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా. జి. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవం సాయిబాబా



● రామలింగా రెడ్డి, సీత

షిర్డీ సాయిబాబా జీవితం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ప్రత్యక్ష దైవం షిర్డీ సాయి'. సాయిబాబాగా రామలింగా రెడ్డి నటించారు. కొండవీటి సత్యం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భానుచందర్, సీత ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం పాటల ప్రదర్శన హైదరాబాద్‌లో జరిగింది. విశ్రాంత ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమీషనర్ నరసింహప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓ ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు ఓం సాయి ప్రకాశ్ మాట్లాడుతూ– ''సాయిభక్తుల అనుభవాలతో సినిమా తీయడం అభినందనీయం'' అన్నారు. ''యువతరంలో ఆధ్యాత్మికతను పెంపొందించాలనే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించారు మచ్చా రామలింగారెడ్డి'' అన్నారు చీఫ్ కమిషనర్ నరసింహప్ప. ''యం.ఆర్. రెడ్డి మంచి భక్తిరస చిత్రాన్ని నిర్మించాలనుకోవడం అభినందనీయం'' అని ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్ అన్నారు. చిత్రదర్శకుడు కొండవీటి సత్యం, నిర్మాతలు వెంకట్, వి. సుబ్బారావు, సంగీతదర్శకులు కిషన్ కవాడియా, పాటల రచయిత బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రింగా రింగా రోసే..



● సిమ్రన్, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, సిమ్రన్ చౌదరి, ఐరా హీరోహీరోయిన్లుగా నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'అథర్వ'. మహేశ్ రెడ్డి దర్శకత్వంలో నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి ఈ సినిమాను నిర్మించారు. త్వరలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ చిత్ర సంగీతదర్శకుడు శ్రీ చరణ్ పాకాల పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి 'రింగా రింగా రోసే.. పిల్లా నిన్నే చూసే.. చిట్టిగుండె కూసే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. శ్రీ చరణ్ పాకాల బాణీ అందించిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, జావేద్ అలీ ఆలపించారు. మాస్టర్ రాజ్‌కృష్ణ కొరియోగ్రాఫర్. ఈ పాట విడుదల సందర్భంగా హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ– ''రింగా రింగా రోసే..' పాట అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు. ''హీరో చిన్నతనం నుండి హీరోయిన్‌ను ప్రేమిస్తుంటాడు కానీ చెప్పలేకపోతాడు. చివరికి తన ఫీలింగ్‌ను ఈ పాటతో చెప్పే ప్రయత్నం చేస్తాడు'' అన్నారు మహేశ్ రెడ్డి. ''త్వరలోనే రిలీజ్ కానున్న మా సినిమాను ప్రేక్షకులు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు సుభాష్. ''ఈ చిత్రంలో చాలా ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు సిమ్రన్ చౌదరి.

ఆగస్టులో టీఎఫ్‌సీసీ నంది అవార్డులు



● సుమన్, మురళీ మోహన్, రామకృష్ణ గౌడ్, ప్రసన్నకుమార్, బి. గోపాల్

తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023' వేడుక జరగనుంది. దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్లో ఆగస్టు 12న ఈ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జ్యూరీ సభ్యులను సెలెక్ట్ చేసుకున్న సందర్భంగా సోమవారం పాత్రికేయుల సమావేశంలో టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''2021, 22 సంవత్సరాల్లో విడుదలైన చిత్రాల వారు ఈ అవార్డుల కోసం టీఎఫ్‌సీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి తేదీ జూన్ 15. తెలంగాణ ప్రభుత్వం నుండి నంది అవార్డ్స్‌కి సంబంధించిన లెటర్ పై మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారు సంతకం చేసి ఇవ్వడం జరిగింది. అలాగే ఆంధ్ర ప్రభుత్వం సహకారం కూడా కోరనున్నాం. ఆగస్టు 12న దుబాయ్ ప్రిన్స్ చేతుల మీదుగా నంది అవార్డులు ఇవ్వనున్నాం'' అన్నారు. ''జ్యూరీ కమిటీకి నన్ను చైర్మన్‌గా ఉండమన్నారు. కానీ నేను జ్యూరీ మెంబర్‌గా ఉంటూ సపోర్ట్ చేస్తానని చెప్పాను. తెలంగాణ ప్రభుత్వ సహకారం తీసుకున్నట్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంది'' అన్నారు మురళీ మోహన్. సుమన్, బి. గోపాల్ తదితరులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
16-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	318	62,346
నిఫ్టీ ▲	84	18,399

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,352 ▲	67
డోజోన్స్	33,375 ▲	74
ఎఫ్‌టీఎస్ఈ 100	7,777 ▲	23
డాక్స్	15,917 ▲	3
హాంకాంగ్	3,311 ▲	38
నికాయ్	29,626 ▲	238

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	62,894 ▲	139
బంగారం (22 క్యారెట్లు)	57,653 ▲	128
వెండి (కిలో)	73,400 ▲	320

మైనస్‌లోకి టోకు ద్రవ్యోల్బణం

- దాదాపు మూడేళ్లలో మొదటిసారి
- ఏప్రిల్‌లో మైనస్ 0.92%
- కమోడిటీల రేట్ల తగ్గుదల ఎఫెక్ట్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కమోడిటీ ధరల క్షీణతతో ఆహారం, ఇంధనం, ఇతరత్రా ముడి సరుకుల రేట్లు తగ్గిన నేపథ్యంలో టోకు ధరలు దాదాపు మూడేళ్లలో తొలిసారిగా మైనస్‌లోకి జారిపోయాయి. ఏప్రిల్‌లో 34 నెలల కనిష్టానికి దిగివచ్చాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మైనస్ 0.92 శాతంగా నమోదైంది. చివరిసారిగా 2020 జూన్‌లో డబ్ల్యూపీఐ .. మైనస్ 1.81 శాతంగా నమోదైంది. ఇది గత 11 నెలలుగా తగ్గుదల బాటలోనే కొనసాగుతోంది. గతేడాది ఏప్రిల్‌లో బేస్ అధికంగా 15.38 శాతం స్థాయిలో ఉండటం కూడా ఏప్రిల్‌లో తాజా పరిస్థితికి కారణమని అధికారవర్గాలు తెలిపాయి. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ఈ మార్చిలో 1.34 శాతంగా ఉంది. టోకు ధరలు ఏటా క్షీణిస్తుండటాన్ని సాంకేతికంగా ప్రతిద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. '2023 ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం రేటు మందగించడానికి ప్రధానంగా ఆహారోత్పత్తులు, ప్రాథమిక లోహాలు, టెక్స్‌టైల్స్, ఆహారేతర ఉత్పత్తులు, రసాయనాలు.. రసాయన ఉత్పత్తులు, రబ్బర్.. ప్లాస్టిక్ ఉత్పత్తులు, పేపర్.. పేపర్ ఉత్పత్తుల ధరలు తగ్గడం కారణం' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తెలిపింది.



రాబోయే రోజుల్లోనూ ఇలాగే..

కమోడిటీల ధరలు తగ్గే కొద్దీ రాబోయే రోజుల్లోనూ డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మరింత తగ్గడం కొనసాగవచ్చని బార్‌క్లేస్ ఒక నివేదికలో తెలిపింది. టోకు, రిటైల్ ద్రవ్యోల్బణం రెండూ తగ్గుతున్నందున తదుపరి పాలసీ సమీక్షలో రిజర్వ్ బ్యాంక్.. వడ్డీ రేట్ల పెంపునకు మరికాస్త విరామం ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రతిద్రవ్యోల్బణ ధోరణి వచ్చే 2–3 నెలలు కొనసాగవచ్చని, పూర్తి ఆర్థిక సంవత్సరానికి డబ్ల్యూపీఐ 1–2 శాతం శ్రేణిలో ఉండొచ్చని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఎకానమిస్ట్ రజని సిన్హా తెలిపారు. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టమైన 4.70 శాతానికి తగ్గింది. గత నెల పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. తాజా గణాంకాల్లోని మరిన్ని విశేషాలు..

- ఆహార, ఆహారయేతర, ఇంధన.. విద్యుత్, తయారీ ఉత్పత్తులు మొదలైన వాటన్నింటి ధరలు తగ్గాయి.
- మార్చితో పోలిస్తే ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.48 శాతం నుంచి 3.54 శాతానికి దిగి వచ్చింది. పండ్లు, పాలు .. గుడ్లు, మాంసం, చేపల ధరలు తగ్గాయి. కూరగాయల ద్రవ్యోల్బణం మైనస్ 1.50 శాతంగా నమోదైంది. బంగాళాదుంపల ధరల పెరుగుదల మైనస్ 18.66 శాతం, ఉల్లి మైనస్ 18.41 శాతం, గోధుమలు 7.27 శాతంగాను ఉంది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 8.96 శాతం నుంచి 0.93 శాతానికి తగ్గింది.
- తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మార్చిలో 0.77% కాగా ఏప్రిల్‌లో మైనస్ 2.42%గా ఉంది.

ఎగుమతులు మూడో నెలా డౌన్

- ఏప్రిల్‌లో 12.7 శాతం క్షీణత
- 34.66 బిలియన్ డాలర్లకు పరిమితం
- 14 శాతం తగ్గిన దిగుమతులు

న్యూఢిల్లీ: భారత్ నుంచి ఎగుమతులు వరుసగా మూడో నెలా క్షీణించాయి. ఏప్రిల్‌లో 12.7 శాతం తగ్గి 34.66 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు కూడా వరుసగా అయిదో నెలా క్షీణించాయి. ఏప్రిల్‌లో 14 శాతం క్షీణించి 49.9 బిలియన్ డాలర్లకు తగ్గాయి. గత ఏప్రిల్‌లో ఇవి 58.06 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత్‌కు ప్రధాన మార్కెట్లుగా ఉన్న అమెరికా, యూరప్‌లో డిమాండ్ అంతగా లేకపోవడం .. ఎగుమతులు మందగించడానికి కారణమైంది. పరిస్థితి మెరుగుపడటానికి మరికొద్ది నెలలు పట్టే అవకాశం ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి తెలిపారు. 'యూరప్, అమెరికాలో డిమాండ్ క్షీణించింది. వచ్చే 2–3 నెలలు కూడా అంత ఆశావహంగా కనిపించడం లేదు.



అయితే, చైనా ఎకానమీ కోలుకుని.. యూరప్, అమెరికా మార్కెట్లలో కూడా కాస్త డిమాండ్ నెలకొనే అవకాశం ఉన్నందున ఆగస్టు–సెప్టెంబర్ తర్వాత నుంచి ఎగుమతులు మళ్లీ పుంజుకోవడానికి ఆస్కారం ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

20 నెలల కనిష్టానికి వాణిజ్య లోటు ..

ఎగుమతులు, దిగుమతుల మందగమనంతో ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 20 నెలల కనిష్టమైన 15.24 బిలియన్ డాలర్లకు తగ్గింది. చివరిసారిగా 2021 ఆగస్టులో వాణిజ్య లోటు ఇంతకన్నా తక్కువగా 13.81 బిలియన్ డాలర్లుగా నమోదు కాగా.. గతేడాది ఏప్రిల్‌లో ఇది 18.36 బిలియన్ డాలర్లుగా ఉంది. కమోడిటీల ధరలు, రత్నాభరణాల్లాంటి ఉత్పత్తులకు డిమాండ్ క్షీణించడంతో దిగుమతులు తగ్గినట్లు సారంగి వివరించారు. ఎగుమతులపరంగా రాబోయే రోజుల్లోనూ రత్నాభరణాలు, కొన్ని రకాల ఇంజినీరింగ్ ఉత్పత్తులు, దుస్తులపై ప్రభావం ఉండవచ్చన్నారు. ఎక్కువగా ఎగుమతులు చేసేందుకు ఆస్కారమున్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, నూనె గింజల్లాంటి వాటిపై వ్యాపార వర్గాలు మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు.

2022–23 గణాంకాల సవరణ..

గత ఆర్థిక సంవత్సరం గణాంకాలను వాణిజ్య శాఖ ఎగువముఖంగా సవరించింది. దీని ప్రకారం..

- 2022–23లో ఉత్పత్తులు, సర్వీసుల ఎగుమతులు 14.68 శాతం వృద్ధి చెంది 676.53 బిలియన్ డాలర్ల నుంచి 775.87 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 17.65 శాతం పెరిగి 894.19 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 118.31 బిలియన్ డాలర్లుగా నమోదైంది.
- ఉత్పత్తుల ఎగుమతులు 6.74% వృద్ధితో 450.43 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 16.47% పెరిగి 714 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- సేవల ఎగుమతులు 27.86 శాతం ఎగిసి 325.44 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 22.54 శాతం పెరిగి 180 బిలియన్ డాలర్లకు చేరాయి.

నిప్పో బ్రాండ్ కొత్త లోగో ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ప్రముఖ బ్యాటరీ ఉత్పత్తుల సంస్థ నిప్పో (ఇండో నేషనల్ లిమిటెడ్) బ్రాండ్ కొత్త లోగోని ఆవిష్కరించింది. జపాన్‌కు చెందిన మత్సుషిత ఎలక్ట్రిక్ ఇండస్ట్రియల్ కంపెనీతో పారిశ్రామికవేత్త పి ఓబుల్ రెడ్డి సంయుక్తంగా 1972లో ఇండో నేషనల్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిప్పో నూతన లోగో వినియోగదారులకు కొత్త అనుభూతిని ఇస్తుందని, కొత్త కస్టమర్లకు చేరువ కావడానికి కూడా సాయపడుతుందని కంపెనీ పేర్కొంది. నిప్పో బ్రాండ్‌తో తాము మార్కెట్లో మరింతగా విస్తరించనున్నట్లు సంస్థ ఎండీ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. "50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుక జరుపుకుంటూ మేము ఉత్సాహవంతమైన, ముఖ్యమైన దశకు చేరుకున్నాం. మా ఉత్పత్తులకు సంబంధించి వినియోగదారులు అందించే అవకాశాలను సొంతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని సంస్థ జాయింట్ ఎండీ ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు.

5 నెలల గరిష్టానికి మార్కెట్

- 318 పాయింట్లు అప్
- 62,346 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ 84 పాయింట్లు ప్లస్
- 18,399 వద్ద ముగింపు

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు, ఉపశమించిన ద్రవ్యోల్బణం నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ దూకుడు చూపాయి. సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్‌చేసి 62,346కు చేరింది. నిఫ్టీ 84 పాయింట్లు ఎగసి 18,399 వద్ద నిలిచింది. వెరసి గతేడాది డిసెంబర్ 14 తర్వాత తిరిగి మార్కెట్లు గరిష్టాలకు చేరాయి. ఆసియా, యూరోపియన్ మార్కెట్ల ప్రోత్సాహానికితోడు.. ఏప్రిల్‌లో టోకు ధరలు మైనస్‌కు చేరడంతో ఇన్వెస్టర్లకు హుషారొచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు మిడ్‌సెషన్‌కల్లా జోరందుకున్నాయి. సెన్సెక్స్ 535 పాయింట్లు పురోగమించి 62,563కు చేరింది. నిఫ్టీ 18,459ను తాకింది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు సైతం సెంటిమెంటుకు బలాన్నిస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.



రియల్టీ దూకుడు

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ బలపడగా.. రియల్టీ 4.3 శాతం జంప్‌చేసింది. రిటైల్, టోకు ధరలు తగ్గడంతో వడ్డీ రేట్లకు చెక్ పడనున్న అంచనాలు ఇందుకు దోహదపడినట్లు నిపుణులు తెలియజేశారు. కాగా.. మీడియా, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ 2–0.7 శాతం లాభపడ్డాయి. ఆయిల్ అండ్ గ్యాస్ యథాతథంగా నిలిచింది. రియల్టీ కౌంటర్లలో శోభా 11.5 శాతం దూసుకెళ్లగా.. డీఎల్ఎఫ్, మహీంద్రా లైఫ్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, ఒబెరాయ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, లోధా 7.4–3.4 శాతం మధ్య జంప్ చేశాయి.

టాటా మోటార్స్ జోరు

నిఫ్టీ దిగ్గజాలలో హీరోమోటో, టాటా మోటార్స్ 3 శాతం పుంజుకోగా.. ఐటీసీ, టెక్ మహీంద్రా, హిందాల్కో, హెచ్‌యూఎల్, డాక్టర్ రెడ్డీస్, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఎల్అండ్‌టీ, ఎంఅండ్ఎం, ఇండస్ఇండ్, టాటా స్టీల్, విప్రో, ఐషర్, ఎస్‌బీఐ, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2–0.6 శాతం మధ్య బలపడ్డాయి. అయితే అదానీ ఎంటర్, సిప్లా, బీపీసీఎల్, గ్రాసిమ్, దివీస్ ల్యాబ్, మారుతీ, అదానీ పోర్ట్స్, టీసీఎస్ 3–0.7 శాతం మధ్య నీరసించాయి.

చిన్న షేర్లు ఓకే

మార్కెట్ల బాటలో చిన్న షేర్లకూ డిమాండ్ కనిపించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.5 శాతం చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,856 లాభపడితే, 1,802 డీలాపడ్డాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 1,014 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) సోమవారం మరింత అధికంగా రూ. 1,685 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే దేశీ ఫండ్స్ రూ. 191 కోట్ల విలువైన స్టాక్స్ మాత్రమే కొనుగోలు చేశాయి. ఈ నెల తొలి రెండు వారాలలో ఎఫ్‌పీఐలు రూ. 23,152 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! విదేశీ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు బ్యారల్ 0.25 శాతం బలపడి 74.34 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి 13 పైసలు నీరసించి 82.31కు చేరింది.

సెన్సెక్స్, బ్యాంకెక్స్ డెరివేటివ్‌లు మళ్లీ ప్రారంభం

స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ తాజాగా సెన్సెక్స్, బ్యాంకెక్స్ డెరివేటివ్‌లను సోమవారం పునఃప్రారంభించింది. ఈ కాంట్రాక్టులకు సంబంధించిన ఫ్యూచర్స్, ఆప్షన్స్ లాట్ సైజును తగ్గించడంతో పాటు ఎక్స్‌పైరీ రోజును కూడా గురువారం నుంచి శుక్రవారానికి మార్చినట్లు సంస్థ ఎండీ సుందరరామన్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. సెన్సెక్స్ ఫ్యూచర్స్, ఆప్షన్స్ లాట్ సైజు 15 నుంచి 10కి, బ్యాంకెక్స్ లాట్ సైజును 20 నుంచి 15కి తగ్గించారు. అధిక రాబడులిచ్చేందుకు ఆస్కారమున్న అత్యంత రిస్కీ సాధనాలుగా డెరివేటివ్స్‌ను పరిగణిస్తారు. 2000లో బీఎస్ఈ తొలిసారిగా సెన్సెక్స్–30 డెరివేటివ్స్ (ఆప్షన్స్, ఫ్యూచర్స్)ను ప్రవేశపెట్టింది.

నైమెక్స్ క్రూడ్ ఫ్యూచర్స్ షురూ

- నేచురల్ గ్యాస్‌లోనూ కాంట్రాక్టులు
- డెరివేటివ్స్‌కు తెరతీసిన ఎన్ఎస్ఈ



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా రూపాయలలో నైమెక్స్ డబ్ల్యూటీఐ క్రూడాయిల్ కాంట్రాక్టులకు తెరతీసింది. కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో నేచురల్ గ్యాస్‌లోనూ రూపాయలలో ట్రేడయ్యే ఫ్యూచర్స్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది మార్చిలో క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇందుకు ఎన్ఎస్ఈని అనుమతించింది. దీంతో ఎనర్జీ బాస్కెట్‌లో ఎన్ఎస్ఈ మరిన్ని ప్రొడక్టులను జత చేసుకుంది. తాజా కాంట్రాక్టులతో కీలక ఎనర్జీ ప్రొడక్టులను ఒకే ప్లాట్‌ఫామ్‌పై ప్రవేశపెట్టడం ద్వారా మార్కెట్ పార్టిసిపెంట్లకు ప్రభావవంతమైన ట్రేడింగ్, హెడ్జింగ్ అవకాశాలను కల్పించినట్లయ్యింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా డీఎంహెచ్‌వోలో 10 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

మచిలీపట్నంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం..ఉమ్మడి కృష్ణా జిల్లాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** పీడియాట్రిషియన్–05, జనరల్ ఫిజిషియన్–01, ఎంవో డెంటల్–01, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్–01, డెంటల్ టెక్నీషియన్–01, డీఈఐసీ మేనేజర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, ఎండీ, బీడీఎస్, డిగ్రీ, డిప్లొమా, బీపీటీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, మచిలీపట్నం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.05.2023.
» **వెబ్‌సైట్:** www.krishna.ap.gov.in

టిస్, ముంబైలో 19 టీచింగ్ స్టాఫ్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్).. టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
» **విభాగాలు:** ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, సైకాలజీ, ఆర్థిక శాస్త్రం, భూగోళ శాస్త్రం, సామాజిక శాస్త్రం, పొలిటికల్ సైన్సెస్, లాంగ్వేజెస్, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్/సెట్ అర్హత సాధించాలి.
» **ఎంపిక విధానం:** పని అనుభవం, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.05.2023
» **వెబ్‌సైట్:** www.tiss.edu

ఇంజనీర్లకు ఆర్మీ ఆహ్వానం

ఆర్మీ జాబ్స్

» టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు ప్రకటన విడుదల
» రాత పరీక్ష లేకుండానే ఎంపికలు

బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇండియన్ ఆర్మీ స్వాగతం పలుకుతోంది. ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్.. శాశ్వత ప్రాతిపదికన 2024 జనవరిలో ప్రారంభించే 138వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు(టీజీసీ)కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటారు. ఇలా కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి.

మొత్తం పోస్టుల సంఖ్య: 40 (సివిల్–11, కంప్యూటర్ సైన్స్–09, ఎలక్ట్రికల్–04, ఎలక్ట్రానిక్స్–06, మెకానికల్–08, మిసిలేనియస్–02)

అర్హతలు: సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న,అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** జనవరి 01, 2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మార్కులకు కట్ ఆఫ్ నిర్ణయిస్తారు. దాన్ని బట్టి షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ).. బెంగళూరులో ఐదు రోజులపాటు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. మొదటి రోజు స్టేజ్–1 స్క్రీనింగ్(ఇంటెలిజెన్స్) పరీక్షలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారినే స్టేజ్–2కి ఎంపిక చేస్తారు. వీరికి నాలుగు రోజులపాటు పలు విభాగాల్లో పరీక్షించి, అందులో రాణించవారికి మెడికల్ పరీక్షలు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

శిక్షణ ఇలా: ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్‌లో శిక్షణ ఉంటుంది. కోర్సు కాలవ్యవధి 49వారాలు.శిక్షణలో చేరినప్పటి నుంచే లెఫ్టినెంట్ హోదా ఇస్తారు. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్సీ) నిబంధనల ప్రకారం-వేతనం అందుతుంది. ఆ సమయంలో నెలకు రూ. 56,100చెల్లిస్తారు.విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు శాశ్వత కమిషన్ పరిధిలోకి వస్తారు.

వేతనాలు: శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరిన వారికి లెవల్–10 ప్రకారం మూలవేతనం లభిస్తుంది. ఇలా ఎంపికైన వారికి ప్రతి నెల రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే కింద రూ.15,500 అందుతాయి.వీటితోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, ప్రోత్సాహకాలు దక్కుతాయి. ఈ కొలువులో చేరిన వారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో చేరిన రెండేళ్ల తర్వాత కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, మే 17 మధ్యాహ్నం 3 వరకు.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. దేశంలో బ్యాంకింగ్ కార్యకలాపాలను నియంత్రించి, పర్యవేక్షించే కేంద్ర బ్యాంకు! ఇంతటి కీలక వ్యవస్థలో యువత పాల్పంచుకునే అవకాశం కల్పిస్తోంది ఆర్‌బీఐ! ఇందుకోసం గ్రేడ్-బి ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది! బ్యాచిలర్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. ఇటీవల కేంద్ర బ్యాంకు 291 గ్రేడ్ బీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

అవుతారా.. ఆర్‌బీఐ ఆఫీసర్!

» 291 గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టులకు ఆర్‌బీఐ నోటిఫికేషన్
» బ్యాచిలర్ డిగ్రీ, పీజీ అర్హతతో పోటీ పడే అవకాశం
» కొలువు సాధిస్తే..రూ.55,200 ప్రారంభ వేతనం
» రాత పరీక్షలు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

మూడు విభాగాలు.. 291 పోస్టులు

తాజా నియామక ప్రక్రియ ద్వారా బ్యాంకుకు చెందిన మూడు విభాగాల్లో 291 పోస్టులను భర్తీ చేయనుంది. ఆ వివరాలు..

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్)–222 పోస్టులు.
- గ్రేడ్–బి ఆఫీసర్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ పాలసీ రీసెర్చ్–డీఈపీఆర్) –38 పోస్టులు.
- గ్రేడ్–బి ఆఫీసర్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ –డీఐఎస్ఎం)– 31 పోస్టులు.

అర్హతలు

- **గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్):** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్:** క్వాంటిటేటివ్ ఎకనామిక్స్/మ్యాథమెటికల్ ఎకనామిక్స్ /ఫైనాన్షియల్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ ఇండస్ట్రియల్ ఎకనామిక్స్ సబ్జెక్టుతో ఎంఏ లేదా ఎమ్మెస్సీ ఎకనామిక్స్ ఉత్తీర్ణత ఉండాలి. (లేదా) ఫైనాన్స్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత లేదా పీజీడీఎం/ ఎంబీఏ పాసవ్వాలి. అన్ని కోర్సులకు సంబంధించి కనీసం 55 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి.
- **గ్రేడ్–బి ఆఫీసర్ డీఐఎస్ఎం:** స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ ఎకనామిక్స్ /ఎకనోమెట్రిక్స్/స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్లతో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్, అదే విధంగా ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐఎం కోల్‌కతలలో పీజీడీబీఏలలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** మే 1, 2023 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టుల నియామకానికి మూడు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అవి.. ఫేజ్–1 రాత పరీక్ష; ఫేజ్–2 రాత పరీక్ష; పర్సనల్ ఇంటర్వ్యూ.

మూడు విభాగాలకు వేర్వేరుగా

ఫేజ్–1, ఫేజ్–2లుగా నిర్వహించే రాత పరీక్ష మూడు విభాగాల(గ్రేడ్ బీ ఆఫీసర్ –జనరల్, గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్, గ్రేడ్ బి ఆఫీసర్ డీఐఎస్ఎం)కు వేర్వేరుగా ఉంటుంది.

గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) రాత పరీక్షలు

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్టులకు సంబంధించి ఫేజ్–1లో 200 మార్కులకు జనరల్ అవేర్‌నెస్,ఇంగ్లిష్ లాంగ్వేజ్,క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.
- ఫేజ్–1 పరీక్షలో సెక్షన్ల వారీగా, మొత్తంగా నిర్దేశిత కటాఫ్ మార్కులను పొందిన వారితో మెరిట్ జాబితా రూపొందించి.. పోస్టుల సంఖ్యను అనుసరించి తదుపరి దశలో ఫేజ్–2 పరీక్ష నిర్వహిస్తారు.

మూడు వందల మార్కులకు ఫేజ్–2

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్టులకు రెండో దశలో నిర్వహించే ఫేజ్–2 రాత పరీక్ష.. మూడు పేపర్లలో మూడు వందల మార్కులకు ఉంటుంది.
- పేపర్–1 ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్ 100 మార్కులు, పేపర్–2 ఇంగ్లిష్ రైటింగ్ స్కిల్స్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు జరుగుతుంది.
- పేపర్–1,పేపర్–3లలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో 1 మార్కు, రెండు మార్కులతో 30 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 50మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలుంటాయి.
- మరో 50 మార్కులకు వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. మొత్తం ఆరు ప్రశ్నలు అడుగుతారు. వీటిలో కనీసం నాలుగింటికి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. రెండు ప్రశ్నలకు 15 మార్కులు చొప్పున, మరో రెండు ప్రశ్నలకు 10 మార్కులు చొప్పున కేటాయిస్తారు.

గ్రేడ్–బి ఆఫీసర్(డీఈపీఆర్).. మూడు పేపర్లు

- గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టులకు తొలిదశలో రాత పరీక్ష, తదుపరి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. తొలి దశ రాత పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి. –ప్రతి పేపర్‌కు 100 మార్కులు చొప్పున మొత్తం మూడు వందల మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పేపర్–1లో ఎకనామిక్స్ నుంచి ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.



- పేపర్–2లో కూడా ఎకనామిక్స్ ఉంటుంది. ప్రశ్నలు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి.
- పేపర్–3ని ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. • పేపర్–1కు రెండు గంటలు, పేపర్–2 మూడు గంటలు, పేపర్–3కు గంటన్నర సమయం ఉంటుంది.
- అభ్యర్థులు డిస్క్రిప్టివ్, ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు కంప్యూటర్‌పైనే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

పేపర్–1లో అర్హత సాధిస్తేనే

గ్రేడ్–బి ఆఫీసర్(డీఈపీఆర్)కు సంబంధించి పేపర్–1లో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికే పేపర్–2, పేపర్–3లకు అనుమతి లభిస్తుంది. ముందుగా పేపర్–1ను నిర్వహించి..కొద్ది రోజుల వ్యవధి తర్వాత పేపర్–2, 3లను నిర్వహిస్తారు.

గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్ఎం).. స్టాటిస్టిక్స్ పేపర్లు

గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్ఎం) పోస్టుల ఎంపిక విధానం డీఈపీఆర్ గ్రేడ్–బి ఆఫీసర్ మాదిరిగానే ఉంటుంది. మూడు పేపర్లుగా మూడు వందల మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1, 2లలో స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్–3లో ఇంగ్లిష్ విభాగం ఉంటుంది. –పేపర్–1ను ఆబ్జెక్టివ్ విధానంలో, పేపర్–2, పేపర్–3లను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. –పేపర్–1లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకే పేపర్–2, పేపర్–3లకు అర్హత కల్పిస్తారు.

ఇంటర్వ్యూకు 75 మార్కులు

మూడు విభాగాల పోస్టుల(జనరల్, డీఈపీఆర్, డీఐఎస్ఎం)కు సంబంధించి రాత పరీక్షల్లో నిర్దేశిత కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి చివరి దశలో 75 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ కంటే ముందు సైకోమెట్రిక్ టెస్ట్‌ను కూడా నిర్వహించే అవకాశముంది.

ఆకర్షణీయ వేతనం

అన్ని దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభం అవుతుంది. రూ.55,200– రూ.99,750 వేతన శ్రేణి లభిస్తుంది. వీటికి అదనంగా హెచ్‌ఆర్ఏ, డీఏ, ఫ్యామిలీ అలవెన్స్, గ్రేడ్ అలవెన్స్ వంటివి కూడా అందుతాయి.

పీజీ స్థాయి ప్రిపరేషన్

- ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టులకు నిర్వహించే రాత పరీక్షల్లో మెరుగైన స్కోర్ సాధించడానికి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న పోస్ట్, అందుకు నిర్దేశించిన సబ్జెక్టులకు సంబంధించి పీజీ స్థాయిలో పూర్తి స్థాయి అకడమిక్ నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి.
- ఆర్థిక, సామాజిక అంశాలు, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం, ఇండియన్ ఎకానమీ, గ్లోబలైజేషన్,భారత సామాజిక విధానం, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, ఆర్‌బీఐ విధులు, దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్స్, పీపీపీ, కార్పొరేట్ గవర్నెన్స్, బడ్జెట్, ద్రవ్యోల్బణం, ఫిన్‌టెక్, మేనేజ్‌మెంట్ ప్రాథమిక అంశాలు, లీడర్‌షిప్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్ అభ్యర్థులు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ పుస్తకాలతోపాటు ఆర్‌బీఐ ప్రచురణలు,వార్షిక నివేదికలు,బ్యాంకింగ్ రంగం తీరుపై విడుదలవుతున్న నివేదికలు, ద్రవ్య విధానం, ఎకనామిక్ సర్వేలను అధ్యయనం చేయాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఐఎస్ఎం అభ్యర్థులు ప్రాబబిలిటీ, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, శాంపిల్ థియరీ, ఎస్టిమేషన్, అనాలిసిస్ ఆఫ్ వేరియన్స్, టెస్టింగ్ ఆఫ్ హైపోథిసెస్, లీనియర్ మోడల్స్ అండ్ ఎకనామిక్ స్టాటిస్టిక్స్, న్యూమరికల్ అనాలిసిస్ అండ్ బేసిక్ కంప్యూటర్ టెక్నిక్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. • ఇంగ్లిష్‌కు సంబంధించి కాంప్రహెన్షన్, రీడింగ్, ప్యాసేజ్‌లను అర్థం చేసుకోవడం, భావ వ్యక్తీకరణలపై దృష్టి పెట్టాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ జనరల్..పేపర్–1లో ఉండే జనరల్ అవేర్‌నెస్ కోసం స్టాక్ జీకే అంశాలు, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా హిస్టరీ, ఎకానమీ, జాగ్రఫీలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్ అంశాలను పూర్తి స్థాయిలో చదవాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో అర్థమెటిక్ సంబంధిత అంశాలు(రేషియోస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, రిలేషన్స్ తదితర)పై అవగాహన పొందాలి. రీజనింగ్‌కు సంబంధించి కోడింగ్, డీ–కోడింగ్, సిలాజిజమ్, నంబర్ సిరీస్‌లపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మే 9–జూన్ 9, 2023
- **ఆఫీసర్ డీఈపీఆర్, డీఐఎస్ఎం పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rbi.org.in

'జియో సైన్స్' ద్వారా అద్భుతాలు

జీఎస్ఐ డీజీ డాక్టర్ రాజు

సాక్షి, హైదరాబాద్: జియో సైన్స్ ఆర్గనైజేషన్ ద్వారా భూ శాస్త్ర వేత్తలు ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజు అభిప్రాయపడ్డారు. భూ శాస్త్రవేత్తలకు సంబంధించిన 5 బ్యాచ్‌ల శిక్షణ ఆరంభ సమావేశం బండ్లగూడలోని జీఎస్ఐ శిక్షణా సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీజీ రాజు మాట్లాడుతూ భౌగోళిక శాస్త్రవేత్తలు శిక్షణా కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మగౌరవంతో సంపూర్ణ వృత్తి నైపుణ్యాన్ని కాపాడుకోవాలని, దేశాభివృద్ధికి దోహదపడే ఖనిజ నిక్షేపాల అన్వేషణకు తమ వంతు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.




అమ్మ ఆరోగ్యం కోసం..70 కి.మీ.

చెక్కబండిలో తల్లిని ఉంచి ఓ తనయుడి ప్రయాణం

రాయికల్(జగిత్యాల): నిర్మల్ జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య తన తల్లి ఆరోగ్యం బాగుకోసం ఆమెను ఓ చెక్కబండిలో కూర్చో బెట్టుకుని సుమారు 70.కిలోమీటర్లు ప్రయాణించాడు. జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు అక్కడ కొద్ది రోజులు గడిపితే తన తల్లి ఆరోగ్యం బాగుపడుతుందనే నమ్మకంతో సోమవారం ఖానాపూర్ నుంచి కర్రలతో తయారుచేసిన చెక్కబండిలో తల్లిని ఉంచి ప్రయాణం సాగించాడు. తన తల్లి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని, కొండగట్టుకు తీసుకెళ్తే కుదుటపడుతుందని భావిస్తున్నట్లు మల్లయ్య చెప్పాడు. తనవద్ద డబ్బులు లేకున్నా..తల్లి ఆరోగ్యం ముఖ్యమని, ఇందుకోసం తల్లిని ఎక్కడికైనా తీసుకెళ్తానని తెలిపాడు.

టుడేస్ గ్రాఫిక్



నిన్న మనం జీతాల సంగతి చెప్పకున్నాం.. ఇప్పుడు అసలు జీతాలే రాని వారి గురించి చెప్పకుందాం.. అదేనండీ నిరుద్యోగుల గురించి.. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత శాతాన్ని చూస్తే.. నైజీరియాలో ఇది ఎక్కువగా ఉంది. వరల్డ్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రకారం ఖతార్‌లో ఇది అత్యల్పంగా ఉంది. పలు దేశాల్లో నిరుద్యోగిత శాతం సంగతి ఓసారి చూస్తే..

విజయవాడకు 20 నిమిషాలకో ఎలక్ట్రిక్ బస్సు

హైదరాబాద్ నుంచి 'ఈ-గరుడ' బస్సులు నడపనున్న ఆర్టీసీ





- తొలివిడతగా 10 బస్సులు.. నేడు మియాపూర్ నుంచి ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ
- దశలవారీగా మరో 40 బస్సులు అందుబాటులోకి..
- గ్రేటర్ హైదరాబాద్‌లో త్వరలో 10 డబుల్ డెక్కర్ బస్సులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను 'ఈ-గరుడ' పేరుతో నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున ఈ బస్సులను నడపనున్నారు. మొదటి విడతగా 10 బస్సులను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్ క్రాస్‌రోడ్ సమీపంలోని పుష్పక్ బస్ పాయింట్ వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జెండా ఊపి ఈ బస్సులను లాంఛనంగా ప్రారంభిస్తారు. టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మిగతా 40 బస్సులను ఈ ఏడాది చివరినాటికి దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఈ-గరుడ బస్సుల ప్రత్యేకతలివీ..

- కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు 12 మీటర్ల పొడవు ఉంటాయి. 41 సీట్లు ఉంటాయి. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించవచ్చు.
- ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతోపాటు రీడింగ్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెహికిల్ ట్రాకింగ్ సిస్టంతోపాటు ప్రతి సీటు వద్ద పానిక్ బటన్ ఉంటుంది. వాటిని టీఎస్‌ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు.
- ప్రతి బస్సులో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి ఒక నెల రికార్డింగ్ బ్యాకప్ ఉంటుంది.
- బస్సులోని ప్రయాణికులను లెక్కించే ఆటోమేటిక్ ప్యాసింజర్ కౌంటర్ (ఏపీసీ) కెమెరా కూడా ఉంది.
- బస్సును రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా ఉంటుంది.
- బస్సుకు ముందు, వెనుక ఎల్ఈడీ బోర్డులు ఉంటాయి. వాటిలో గమ్యస్థానాల వివరాలను ప్రదర్శిస్తారు.
- అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఈ బస్సుల్లో 'ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం (ఎఫ్‌డీఎస్ఎస్)'ను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు వీలుగా బస్సుల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉంది.



త్వరలో డబుల్ డెక్కర్ బస్సులు

గ్రేటర్ హైదరాబాద్‌లో పరుగులు తీసేందుకు త్వరలోనే 10 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలు లేని రూట్లలో వీటిని నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక రానున్న రెండేళ్లలో ఆర్టీసీలో మొత్తంగా 1,860 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 1,300 బస్సులను హైదరాబాద్‌లో నడుపుతారు. మరో 550 బస్సులను హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు తిప్పనున్నారు.

ఆవు పేడతో కరెంట్!

వేములవాడలో బయోగ్యాస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్

- రూ.31.60 లక్షలతో నిర్మాణం
- ప్రాంతీయ ఆస్పత్రి, ఆలయ అవసరాలకు విద్యుత్ వినియోగం..



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా బయోగ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో కోడెల సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ ఉండే 200 ఆవుల పేడ ఆధారంగా బయోగ్యాస్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే బయోగ్యాస్‌తో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో వేములవాడ పట్టణ అభివృద్ధి అథారిటీ(వీటీడీఏ) ద్వారా రూ.31.60 లక్షలను మంజూరు చేశారు. ఈ విద్యుత్ ప్లాంట్‌ను జూన్ ఒకటో తేదీలోగా పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ మేరకు వేములవాడ మున్సిపల్ అధికారులు ప్లాంటు నిర్మాణ పనులను కోడెల సంరక్షణ కేంద్రం ఆవరణలో చేపట్టారు. సమీపంలోనే ఉన్న ప్రాంతీయ ఆస్పత్రికి ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అనుసంధానం చేయనున్నారు.

నిత్యం 2.5 టన్నుల పేడతో..

తిప్పాపూర్‌లోని కోడెల సంరక్షణ కేంద్రంలో నిత్యం అందుబాటులో ఉండే 2.5 టన్నుల పశువుల పేడను బయోగ్యాస్ ప్లాంటుకు అందించనున్నారు. ఈ ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే 30 కేవీఏ బయోగ్యాస్‌తో విద్యుత్ తయారు అవుతుంది. ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తయ్యే పర్యావరణహిత విద్యుత్‌ను వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, వేములవాడ రాజన్న ఆలయానికి వినియోగించనున్నారు.

బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణం



విద్యుత్ ఉత్పత్తి మెషనరీ

పనులు వేగంగా జరుగుతున్నాయి..



తిప్పాపూర్‌లో బయోగ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్లాంటు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాం. మరో పక్షం రోజుల్లో ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేసి, గ్రీన్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తాం.

– నర్మద, మున్సిపల్ ఏఈ, వేములవాడ

సోమనాథ కళాపీఠం పురస్కారాలకు ప్రతిపాదనలు



పాలకుర్తి టౌన్: మహాకవి సోమనాథుని జన్మస్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం 2022 సంవత్సరానికి గానూ ద్వైవార్షిక పురస్కారాలకు దేశవ్యాప్తంగా సాహితీవేత్తల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, కార్యదర్శి ఇమ్మడి దామోదర్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపాదనలను పూర్తి సమాచారంతో 'డాక్టర్ రాపోలు సత్యనారాయణ, అధ్యక్షుడు, సోమనాథ కళాపీఠం, పాలకుర్తి-506146, జనగామ జిల్లా, తెలంగాణ(9440163211) అడ్రస్‌కు 31 నాటికి చేరేలా పంపించాలని కోరారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి: తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం లేఖ రాశారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకుల విషయాన్ని మరిచిపోయారన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.